
నాగ్‌పూర్ అభ్యర్థికి అబుదాబీ సెంటర్




2

# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - ఆదివారం 21 జూన్ 2026 | సంపుటి: 10 | సంచిక: 166 | పేజీలు:12 | వెల రూ.5

మోనాలిసాకు భద్రత కల్పించండి: హైకోర్టు



2

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

## పాడి రైతుకు.. ప్రజా సర్కార్ భరోసా

- లాభసాటిగా తెలంగాణ పాడి పరిశ్రమ
- 27 లక్షల మంది విద్యార్థులకు 'విజయ' పాలు
- పాడి రైతులకు బకాయిల్లేని పేమెంట్లు
- డిప్యూటీ సీం భట్టి విక్రమార్క



హైదరాబాద్, జూన్ 20, (మనం బ్యూరో): రాష్ట్రంలో పాడి పరిశ్రమ మీద ఆధారపడి జీనం సాగిస్తున్న రైతులను ఆదుకోవడంతో పాటు విజయ డైరీనీ ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఈ ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్రంలోని పాడిపరిశ్రమను ఆదుకోవాలని, పాల ఉత్పత్తులపై ఆధారపడిన వారి జీవితాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రజాప్రభుత్వం కృత నిశ్చయంతో పనిచేస్తోందని స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలలు,అంగన్వాడీ కేంద్రాలకు విజయ డెయిరీ నుంచి పాలను సరఫరా చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు శనివారం ఉప ముఖ్యమంత్రి నేతృత్వంలో సచివాలయంలో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశానికి పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి హాజరయ్యారు. ప్రధానంగా తెలంగాణ రాష్ట్రంలో పాల వినియోగం, సేకరణ, రైతులకు చెల్లించాల్సిన బిల్లులపై లోతైన చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ... రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న పాల వినియోగం, కొత్తగా ప్రభుత్వం ప్రకటించిన మేరకు వివిధ పాఠశాలల్లో చదువుకుంటున్న 27 లక్షల మంది విద్యార్థులకు పాలను అందించే అంశంపై అధికారులతో చర్చించారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో మొత్తం పాల ఉత్పత్తికి సంబంధించి ఖచ్చితమైన లెక్కలు తీసుకురావాలని అధికారులను ఆయన ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి పాలిచ్చే పశువుల అసలు సంఖ్యను

...మిగతా 2లో

## 8వ పే కమిషన్ 'కీలక దశ పూర్తి'

వినతుల స్వీకరణ పూర్తి

2

## బీసీల సాధికారతే ప్రభుత్వ లక్ష్యం




- విద్య ఉపాధితోనే బీసీల అభివృద్ధి
- సమీక్షా సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, మనం ప్రతినిధి : తెలంగాణ వ్యాప్తంగా ఉన్న బీసీ సంక్షేమ శాఖలు, సంబంధిత అధికారులతో మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. మహాత్మ జ్యోతిభా పూలే ప్రజా

...మిగతా 2లో

## ఎస్బీఐ భూముల వ్యవహారంలో... రాజకీయం ఉందా?

### చైర్మన్ చల్లా శ్రీనివాసులుపై రాజకీయ ప్రభావంపై ఆరా

- ఉద్యోగుల వేతనాలు, ఇతర ఆర్థిక లావాదేవీలన్నీ మరో బ్యాంకుకు..
- ఆర్బీఐ, కేంద్రానికి ఫిర్యాదు చేసే యోచనలో ప్రభుత్వం



హైదరాబాద్, జూన్ 20, (మనం బ్యూరో): వివాదాస్పదంగా మారిన రాయదుర్గం భూముల వ్యవహారంలో ఎస్బీఐ వ్యవహరించిన తీరుపై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా ఉన్నట్లు సమాచారం. ఈ వ్యవహారంలో రాజకీయ కోణం ఉండొచ్చని ప్రభుత్వ వర్గాలు అనుమానం వ్యక్తం చేస్తున్నాయి. తెలంగాణకు చెందిన ఎస్బీఐ చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టిపై రాజకీయ ప్రత్యర్థుల ప్రభావం ఏమైనా ఉందా ? అనే కోణంలో ప్రభుత్వం ఆరా తీస్తున్నట్లు సమాచారం. ఈ మొత్తం వ్యవహారంపై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించిన సీఎం రేవంత్ రెడ్డి అవసరమైతే ఆర్బీఐ, కేంద్రానికి సైతం ఫిర్యాదు చేసే యోచనలో ఉన్నట్లు తెలిసింది. ఎస్బీఐ భూముల వ్యవహారం ప్రతిపక్షాలకు రాజకీయ అస్త్రంగా మారే అవకాశం ఉన్న నేపథ్యంలో మొదట్లోనే దీనికి ఫుల్‌స్టాప్ పెట్టే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. ఇప్పటికే ఆ బ్యాంకులోని ప్రభుత్వానికి సంబంధించిన ఖాతాలు, ఫిక్స్‌డ్ డిపాజిట్ల వివరాలు ఇవ్వాలని ప్రభుత్వం అన్ని శాఖలకు ఆదేశాలు జారీ చేసింది. ఈమేరకు ప్రభుత్వానికి అన్ని శాఖల

...మిగతా 2లో

## దేవాదాయ శాఖలో సరికొత్త అధ్యాయం

- స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెంపుల్ అడ్మినిస్ట్రేషన్‌కు శ్రీకారం
- మంత్రి కొండా సురేఖ ఆధ్వర్యంలో ఏర్పాటు



హైదరాబాద్, జూన్ 20(మనం బ్యూరో): రాష్ట్ర దేవాదాయ శాఖలో మంత్రి కొండా సురేఖ సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టారు. దేవాలయ పరిపాలనలో నైపుణ్యాభివృద్ధి, ఆధునిక నిర్వహణ విధానాల అమలుకు ఉద్దేశించిన స్టేట్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ టెంపుల్ అడ్మినిస్ట్రేషన్స్ శిక్షణలో రాష్ట్ర దేవాదాయ శాఖ దేశంలోనే ఉన్నత స్థానంలో నిలుస్తుందన్న నమ్మకముందని పేర్కొన్నారు. అర్చకులు, ఉద్యోగులు కలిసి సమన్వయ ంతో పనిచేస్తేనే దేవాదాయశాఖ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న కార్యక్రమాలు విజయవంతమవు తాయని పేర్కొన్నారు. దైవాజ్ఞ లేనిదే ఏ కార్యం జరగదనీ, దేవాదాయశాఖ మంత్రిగా తన చేతులు మీదుగా ఈ కార్యాలు జరగాల్సి వుండటం దైవేచ్ఛ అని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖలో ఉద్యోగుల సంక్షేమం, పాలనా సంస్కరణలు, నైపుణ్యాభివృద్ధికి ఖిఐఖీఅ ఆధ్వర్యంలో కొత్త దిశను నిర్దేశించనున్నామని అన్నారు. దేవాదాయ శాఖను సరికొత్తగా ఆవిష్కరించే దిశలో కార్యాచరణ వుండోబోతున్నదని మంత్రి స్పష్టం చేశారు. ఉమ్మడి రాష్ట్ర విభజన తర్వాత పునః ప్రారంభించుకోవడం సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలోని ప్రజా ప్రభుత్వ తీరుకు నిదర్శనమన్నారు. ఈ సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన అర్చకులు, ఉద్యోగుల నిర్వహణలో దేవాలయాల నిర్వహణ, దేవాలయ భూముల సంరక్షణ, దేవాలయ ఆదాయ నిర్వహణ తదితర అంశాల్లో

...మిగతా 2లో

## రేపటి నుండి ఢిల్లీలో ఉంటా

### కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో భేటీ ఏర్పాటు చేయండి

- 'మెట్రో'పై కిషన్ రెడ్డికి సీఎం రేవంత్ మరో లేఖాస్త్రం
- 'నీట్' విద్యార్థులకు ఆల్ ది బెస్ట్

హైదరాబాద్, జూన్ 20(మనం బ్యూరో): హైదరాబాద్ మెట్రో రైల్ పెండింగ్ అంశాల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం మరో అడుగు ముందుకేసింది. మెట్రో ఫేజ్ 2, ఐఆర్ఎఫ్‌సి ఫైనాన్సింగ్‌కు సంబంధించిన అంశాలపై కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌తో భేటీ ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కోరారు. ఈమేరకు శనివారం ఆయనకు బహిరంగ లేఖ రాశారు. ఈనెల 16న తాను రాసిన లేఖలో హైదరాబాద్ మెట్రో రైల్‌కు సంబంధించిన సమస్యలను ప్రస్తావించినట్లు గుర్తు చేసిన సీఎం పెండింగ్ అంశాలపై త్వరితగతిన పరిష్కారం అవసరమనీ, అందుకు కేంద్రం జోక్యం చేసుకోవాలని కోరినట్లు పేర్కొన్నారు. ఈనెల 22, 23 తేదీల్లో తాను ఢిల్లీలో ఉంటాననీ, ఆ సమయంలో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. మెట్రో ఫేజ్-2, టేకోవర్, ఐఎఫ్ఆర్‌సి రుణ ఒప్పందాలు ప్రతిపాదనల ప్రతులను కూడా తాను తీసుకొస్తాననీ, సీఎం ఈ లేఖ ద్వారా తెలిపారు. సమావేశం ఏర్పాటు చేసి వివరాలు తనకు అందజేయాలని ఈ సందర్భంగా కిషన్ రెడ్డిని

...మిగతా 2లో

## ఎగవేతదారులతో బ్యాంకుల కుమ్మక్కు!



- రూ.కోట్ల రుణ వసూళ్లను విస్మరిస్తున్నాయని సుప్రీం ధ్వజం
- కేంద్రం, ఆర్బీఐలకు నోటీసులు


ఢిల్లీ, జూన్ 20: పన్ను చెల్లింపుదారుల డబ్బును ఎంతో ఉదారంగా రుణాలుగా ఇస్తోన్న బ్యాంకులు వాటి వసూళ్లపై మాత్రం గట్టి చర్యలు తీసుకోకపోవడం ఆమోదయోగ్యం కాదని సుప్రీంకోర్టు పేర్కొంది. ఈ విషయంలో బ్యాంకులు, ఆస్తుల పునర్నిర్మాణ కంపెనీ(ఏఆర్సీ)లు, రుణగ్రహీతల మధ్య లోతైన లాలూచీ వ్యవహారాలున్నాయంటూ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ వి.మోహన ధర్మాసనం ఆక్షేపించింది. ప్రజాసంక్షేమానికి ఉపయోగపడాల్సిన ప్రభుత్వ ధనం దుర్వినియోగమవుతోందన్న ఆందోళన వ్యక్తం చేసింది. రూ.1,537 కోట్ల బకాయిలను వసూలు చేయాల్సిన ప్రభుత్వ రంగ బ్యాంకులు కేవలం రూ.73.50 కోట్లకే రెండు ఏఆర్సీలతో పరిష్కారం కుదుర్చుకోవడాన్ని

...మిగతా 2లో

## సైబర్ నేరాలపై సాంకేతిక యుద్ధం

- యువ పోలీసులకు ప్రత్యేక శిక్షణ
- థ్రెట్ ఇంటలిజెన్స్‌తో నేరగాళ్లకు చెక్
- తగ్గుతున్న ఆన్‌లైన్ మోసాలు

హైదరాబాద్,జూన్ 20(మనం,ప్రత్యేక ప్రతినిధి) : రాష్ట్రంలో సైబర్ నేరాల కట్టడికి సాంకేతిక పరిజ్ఞనంతో సైబర్ సెక్యూరిటీ బ్యూరోచెక్ పెడుతోంది. దీంతో గడచిన ఆరు నెలల కాలంలో తెలంగాణ రాష్ట్రంలో సైబర్ నేరాలు 11 శాతం తగ్గుముఖం పట్టినట్లు రికార్డులు వెల్లడిస్తున్నాయి.



ఒకవైపు సైబర్ నేరాలను నియంత్రిస్తూ మరోవైపు సైబర్ బాధితుల సొత్తును రికవరీపై వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నట్లు సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ వివరించారు. సైబర్ నేరాలలో సొమ్ము పోగొట్టుకున్న బాధితులు సకాలంలో (గంట వ్యవధిలో) ఫిర్యాదు చేస్తే వారు పోగొట్టుకున్న డబ్బు తిరిగి రాబట్టేందుకు అధికారులు చర్యలు వేగవంతం చేస్తున్నామని వివరించారు.

**అవగాహనతో చైతన్యం :**

రాష్ట్రంలో ఎప్పటికప్పుడు కొత్త పుంతలు తొక్కుతున్న సైబర్ నేరాలపై సామాన్య ప్రజలకు అవగాహన కల్పించేందుకు సైబర్ సెక్యూరిటీ బ్యూరో ప్రత్యేక వర్క్‌షాప్‌లను నిర్వహిస్తోందని సంబంధిత అధికారులు వివరిస్తున్నారు. తరచూ షీల్ వంటి కాంక్లేవ్ ద్వారా సైబర్ నేరాల పట్ల ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కలిగించినట్లు అధికారులు చెబుతున్నారు. కాలర్ ట్యూన్స్, పోస్టర్లు, పాఠశాలలు, కళా శాలల్లో సైబర్ నేరాల కట్టడిపై వర్క్ షాప్‌లను నిర్వహిస్తున్నామని తెలిపారు. సైబర్ నేరాల కట్టడిలో కీలకంగా వ్యవహరించే బ్యాంకులు, టెలికం సర్వీసు ప్రొవైడర్లతో నిరంతరం సమన్వయం చేసుకోవడం వల్లనే ఇదంతా సాధ్యమైందంటున్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈ సంవత్సరం 11శాతం నేరాలు తగ్గినట్లు సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ వెల్లడించారు. దేశ వ్యాప్తంగా ఆర్థిక పరమైన సైబర్ నేరాల శాతం పెరుగుతున్న క్రమలో తెలంగాణలో మాత్రం తగ్గుతున్నాయని

...మిగతా 2లో



- బెంగాల్ సంకెళ్లు వీడాయి
- ప్రధాని నరేంద్ర మోడీ

## వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజనలో.. 70 లక్షల మందికి ఉద్యోగాలు

ఢిల్లీ/ కోల్‌కతా, జూన్ 20: 'ప్రధాన మంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన' (పీఎం-వీబీఆర్‌వై) కింద దేశంలో ఇప్పటివరకు 70 లక్షల మందికిపైగా యువత ఉద్యోగాలు పొందారని ప్రధాని మోదీ తెలిపారు. తొలిసారి ఉద్యోగాలు పొందినవారికి, వారి యజమానులకు రూ.2,400 కోట్ల ప్రోత్సాహకాలను శుక్రవారం ఆయన బదలాయించారు. ప్రభుత్వం, యువత, పరిశ్రమలు కలిసి పనిచేస్తే ఉద్యోగాలు అనేకరెట్ల మేర పెరుగుతాయని మోదీ చెప్పారు. ''ఈ పథకం ద్వారా ఉద్యోగాలతో లబ్ధిదారులకు సామాజిక భద్రత లభించింది. కొత్తగా ఉద్యోగాలు సృష్టించే సంస్థలను, యజమానులను ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది. యువతకు-పరిశ్రమలకు మధ్య వారధిలా ఈ పథకం నిలుస్తుంది. యువత నైపుణ్యాలు, ఆకాంక్షలు, శక్తిసామర్థ్యాలు వికసిత భారత్‌కు మార్గం సుగమం చేస్తాయి'' అని వివరించారు. తృణమూల్ కాంగ్రెస్, ప్రతిపక్ష పార్టీలపై ప్రధాని నరేంద్ర మోడీ తీవ్ర విమర్శలు గుప్పించారు. గత ప్రభుత్వాల హయాంలో బందీగా ఉన్న బెంగాల్ సంకెళ్ల నుంచి విముక్తి పొందిందని అన్నారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి సీఎం సువేందు అధికారి నేతృత్వంలోని ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. బెంగాల్ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. గతంలో రక్తపాతాన్ని, ప్రాణనష్టాన్ని చవిచూసినప్పటికీ బెంగాల్ తన అస్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని కోల్పోలేదని ప్రధాని పేర్కొన్నారు. దేశ విభజన సమయంలో రాష్ట్రాన్ని భారత్ నుంచి విడదీయడానికి కాంగ్రెస్ చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రయోజనాలను విస్మరించినందుకు ప్రజలు కాంగ్రెస్కు, టీఎంసీకి తగిన గుణపాఠం చెప్పారని అన్నారు. ఒకే ఒక్క ఎన్నికల తీర్పు తెచ్చిన మార్పు రాష్ట్రవ్యాప్తంగా స్పష్టంగా కనిపిస్తోందన్నారు.

భారత్-బంగ్లాదేశ్ సరిహద్దు వెంబడి కంచె ఏర్పాటుకు టీఎంసీ ప్రభుత్వం భూమిని కేటాయించలేదని ప్రధాని దుయ్యబట్టారు. ఓటుబ్యాంకు కోసం చొరబాటుదారులను రాష్ట్రంలోకి మమత అనుమతించారని ఆరోపించారు. ఈ సమస్యను పరిష్కరించడానికి అధికారంలోకి వచ్చిన వెంటనే సరిహద్దుల్లో కంచె ఏర్పాటుకు భాజపా ప్రభుత్వం భూమిని కేటాయించిందన్నారు.

## జంతర్‌మంతర్‌ను వీడబోం


సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే

2



## ఇది 'ఎగిరే వైట్‌హౌస్'

- ఖతార్ గిఫ్ట్‌పై ట్రంప్ ప్రశంసలు




ఖతార్, జూన్ 20: ఖతార్ పాలకులు తనకు గిఫ్ట్‌గా ఇచ్చిన 747 జంబో జెట్ విమానాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆవిష్కరించారు. ఇకనుంచి ట్రంప్ కొంతకాలం పాటు ఇందులోనే ప్రయాణాలు చేయనున్నారు. ఈ విమానాన్ని ఆయన 'ఎగిరే వైట్‌హౌస్‌గా'గా అభివర్ణించారు.

జాయింట్ బేస్ ఆండ్రూస్‌లో శుక్రవారం ఈ విమానం ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఇది ప్రపంచంలోనే అత్యంత విలాసవంతమైన విమానం అని ట్రంప్ పేర్కొన్నారు. ఇందులోని ఇంటీరియర్ డిజైన్, ఇంజిన్ల నాణ్యత అద్భుతంగా ఉన్నాయని ప్రశంసించారు. ఇది ఎయిర్‌ఫోర్స్ వన్ కంటే వేగంగా.. ఎక్కువ దూరం ప్రయాణిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఖతార్ పాలకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. జులై 4న జరగనున్న అమెరికా 250వ స్వాతంత్ర్య వేడుకల్లో నిర్వహించే విమానాల ప్రదర్శనల్లో ఈ విమానం కూడా పాల్గొనే అవకాశం ఉందని ట్రంప్ వెల్లడించారు. కాగా.. విమానం లోపల లెదర్ సీట్లు, గోల్డ్ షేడ్స్‌తో కూడిన లేత గోధుమ రంగు గోడలు ఉన్నట్లు మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి.

ఇప్పటివరకు 747- 200బి ఎయిర్‌ఫోర్స్ వన్ హోదాలో అమెరికా అధ్యక్షుడికి అధికారిక విమానంగా ఇది వ్యవహరించింది. జార్జ్ హెచ్డబ్ల్యూ బుష్ నుంచి ట్రంప్ వరకు ప్రతి అధ్యక్షుడికి ఈ పాత విమానమే సేవలందించింది. అధునాతన విమానం కాకపోయినా సౌకర్యవంతంగా ఉండేదని అమెరికా ప్రొటోకాల్ చీఫ్ మోనికా క్రౌలీ తెలిపారు. ప్రస్తుతం దీని ప్రస్థానం ముగిసింది. యూఎస్ వైమానిక దళం ఆర్డర్ చేసిన రెండు కొత్త బోయింగ్-747 విమానాలు అందేవరకు ఖతార్ నుంచి గిఫ్ట్‌గా వచ్చిన ఈ విమానాన్నే ట్రంప్ ప్రయాణాలకు వినియోగించనున్నారు.

## నౌకాదళం.. మరింత బలోపేతం

### నేడు కోల్‌కతాలో మూడు యుద్ధ నౌకల కమిషనింగ్

ప్రధాని చేతుల మీదుగా జాతికి అంకితం







కోల్‌కతా/,ఢిల్లీ, జూన్ 20: భారత నౌకాదళం మరింత బలోపేతం కానుంది. శత్రువుల రహస్య ఎత్తుగడలను చిత్తు చేసేలా దేశీయ అత్యాధునిక పరిజ్ఞానంతో తయారు చేసిన సరికొత్త నౌకలను రక్షణ రంగంలోకి దించనుంది. ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ఈ నెల 21న మూడు నౌకలను కోల్‌కతాలో జాతికి అంకితం చేసే కార్యక్రమానికి తూర్పు నౌకాదళ యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది.

**ఐఎన్ఎస్ అగ్రయ్...**

కోల్కతాలోని గార్డెన్‌రీచ్ షిప్‌బిల్డింగ్ ఇంజినీర్స్ (జీఆర్ఎస్ఈ)లో ఐఎన్ఎస్ అగ్రయ్ నౌకను యాంటీ సబ్మెరైన్ షాలో వాటర్ క్రాఫ్ట్ నిర్మించారు. ఇది 77.6 మీటర్ల పొడవుంటుంది. 2024 మార్చి 13న జలప్రవేశం చేయించారు. తీర జలాల్లో ఆపరేషనల్ విధులకు అనువుగా ఈ యుద్ధనౌకను డిజైన్ చేశారు. ఉపరితల నిఘా, అన్వేషణ, శత్రువులపై దాడికి స్వీయ ఎయిర్‌క్రాఫ్ట్‌తో సమన్వయం చేసుకునేలా 88 శాతం ఆధునిక సీస్థయ సాంకేతిక పరిజ్ఞానం వినియోగించారు. 30ఎంఎం నేవల్ సర్ఫేస్ గన్, వాటర్ జెట్లతో డీజిల్ యంత్రాలను అనుసంధానం చేయడం ప్రత్యేకత.

**ఐఎన్ఎస్ సంశోధక్...**

భారత నౌకాదళానికి సముద్ర భౌగోళిక, (హైడ్రోగ్రాఫిక్ సర్వే) సరిహద్దు జలాలు, సమగ్ర కొలతలు, కచ్చితత్వ పరిమాణం వంటి అంశాలపై వర్ణపటాల రూపకల్పన, నివేదిక

...మిగతా 2లో

## హర్మూజ్‌ను మళ్లీ మూసివేస్తున్నాం

### ఇరాన్ సైనిక విభాగం ప్రకటన

టెహ్రాన్, జూన్ 20: అమెరికా- ఇరాన్ మధ్య శాంతి ఒప్పందంతో పశ్చిమాసియాలో పరిస్థితులు కుదుటపడుతున్న వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. హర్మూజ్ జలసంధిని మళ్లీ మూసివేస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. లెబనాన్‌పై ఇజ్రాయెల్ నిరంతరం భీకర దాడులు చేస్తుండటాన్ని తీవ్రంగా తప్పుబట్టింది. కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిన కారణంగా తాజాగా హర్మూజ్ మూసివేత నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. దురాక్రమణ ఇలాగే కొనసాగితే మరిన్ని చర్యలు ఉంటాయని హెచ్చరించింది. ఈ మేరకు ఇరాన్ సంయుక్త సైనిక విభాగ కేంద్రమైన ఖతమ్-అల్ అన్బియా ప్రకటించినట్లు అక్కడి అధికారిక మీడియా పేర్కొంది.



## నాగ్‌పూర్ అభ్యర్థికి అబుధాబీ సెంటర్

ఢిల్లీ, జూన్ 20: నీట్ రీ-ఎగ్జామ్‌కు సంబంధించి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ జారీ చేసిన అడ్మిట్ కార్డుల్లో లోపాలు బయటపడ్డాయి. మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌కు చెందిన ఓ అభ్యర్థికి.. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని అబుధాబీలో పరీక్షా కేంద్రాన్ని కేటాయించడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. దీనిపై స్పందించిన ఎన్టీఏ.. సమస్యను పరిష్కరిస్తున్నట్లు తెలిపింది. పరీక్షకు ఒకరోజు ముందు ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం.

నీట్ రీటెస్టుకు సమయం దగ్గరపడుతోన్న నేపథ్యంలో అబ్దుల్లా మహ్మద్ తాలిబ్ అనే అభ్యర్థి.. శుక్రవారం సాయంత్రం తన అడ్మిట్ కార్డును డౌన్‌లోడ్ చేసుకున్నాడు. అందులో పరీక్షా కేంద్రాన్ని చూసి అవాక్కయ్యాడు. అబుధాబీలోని ఓ భారతీయ స్కూల్లో ఎన్టీఏ అతడికి పరీక్షా కేంద్రాన్ని కేటాయించింది. ఈ అడ్మిట్ కార్డుకు సంబంధించిన ఫొటో ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది. తాము ఇచ్చిన ఆప్షన్లలో అలాంటి కేంద్రం ఏదీ లేదని విద్యార్థి తండ్రి మీడియాతో పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఎన్టీఏ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. శనివారం సాయంత్రం 4 గంటల్లోపు కొత్త అడ్మిట్ కార్డు జారీ చేస్తామని తమకు హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. సమయం తక్కువగా ఉన్నందున నాగ్‌పూర్‌నే పరీక్షా కేంద్రంగా కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సంఘటనతో తన కొడుకు తీవ్ర ఆందోళనలో ఉన్నట్లు తెలిపారు.

స్పందించిన ఎన్టీఏ..

ఈ సమస్యపై ఎన్టీఏ కూడా స్పందించింది. సాంకేతిక లోపం వల్ల ఇలా జరిగినట్లు పేర్కొంది. సదరు అభ్యర్థికి నాగ్‌పూర్‌లోనే ఓ పరీక్షా కేంద్రాన్ని కేటాయించనున్నట్లు తెలిపింది. కాగా.. అడ్మిట్ కార్డులో వ్యక్తిగత వివరాలు, పరీక్ష కేంద్రాలు ఇతర ముఖ్యమైన అంశాల్లో ఏమైనా లోపాలు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని ఈసందర్భంగా ఎన్టీఏ అభ్యర్థులకు సూచించింది.

## మోనాలిసాకు భద్రత కల్పించండి: హైకోర్టు

కొచ్చి, జూన్ 20: : జాతీయస్థాయిలో వైరలైన కుంభమేళా మోనాలిసాకు భద్రత కల్పించాలని కేరళ హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఫర్మాన్‌ఖాన్‌ను మతాంతర వివాహం చేసుకొన్న మోనాలిసా కోర్టుకెక్కిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంలో మధ్యప్రదేశ్‌లో నమోదైన కిడ్నాప్, పోక్సో కేసుల నేపథ్యంలో తనకు ప్రాణహాని ఉందంటూ ఆమె కోర్టును ఆశ్రయించారు. దీంతో ఈ రిట్ పిటిషన్ పరిష్కారం అయ్యేవరకు ఆమె ప్రాణాలకు రక్షణ కల్పించాలని న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణను జులై 10కి వాయిదా వేసింది. ఈనెల ప్రారంభంలో ఈ కేసుపై దర్యాప్తు చేపట్టిన కేరళ హైకోర్టుకు చెందిన మరో ధర్మాసనం కిడ్నాప్ కేసులో ముందస్తు బెయిల్ కోసం మధ్యప్రదేశ్ కోర్టును ఆశ్రయించేందుకు వీలుగా మోనాలిసా భర్తకు నెల రోజుల పాటు 'ట్రాన్సిట్ బెయిల్' మంజూరు చేసింది. మహారాష్ట్రకు చెందిన ఫర్మాన్ ఖాన్ అనే యువకుడితో ఫేస్‌బుక్ ద్వారా మోనాలిసాకు గతంలో పరిచయం ఏర్పడింది. ఎనిమిది నెలల ప్రేమ అనంతరం వారిద్దరూ తిరువనంతపురం (కేరళ)లోని ఓ ఆలయంలో వివాహం చేసుకున్నారు. ప్రస్తుతం కేరళలో నివాసం ఉంటున్నారు. అయితే, మోనాలిసా మైనర్ అని ఆమె కుటుంబసభ్యులు ఆ తర్వాత ఆరోపించడంతో, ఫర్మాన్‌ఖాన్‌పై మధ్యప్రదేశ్ పోలీసులు కేసు నమోదు చేశారు.

## 8వ పే కమిషన్ 'కీలక దశ పూర్తి'

**హైదరాబాద్, మనం ప్రతినిధి :** కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 8వ కేంద్ర వేతన సంఘం.. తన కార్యకలాపాలను వేగవంతం చేసింది. ఉద్యోగ, పెన్షనర్ల సంఘాల నుంచి వినతులు, మెమొరాండంలు స్వీకరించే ప్రక్రియ ఈ నెల 15తో ముగిసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఈ డిమాండ్లను క్షుణ్ణంగా పరిశీలించే పనిలో కమిషన్ నిమగ్నమైంది. తుది సిఫార్సులు చేసే ముందు ఈ డిమాండ్లన్నింటినీ కూలంకుశంగా అధ్యయనం చేయనుంది. అయితే, గత సంవత్సరం 2025 అక్టోబర్‌లో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ కమిషన్‌కు, తన నివేదికను పూర్తి చేయడానికి దాదాపు 10 నెలల సమయం కేటాయించారు. ఈ సిఫార్సుల ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న సుమారు 55 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, 69 లక్షల మంది పెన్షనర్ల వేతనాలు, పెన్షన్లు, ఇతర అలవెన్సులలో మార్పులు జరగనున్నాయి. దీంతో కోటి మందికి పైగా ప్రజలు ఈ కమిషన్ సిఫార్సుల కోసం ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు.

## కామం...కన్నపేగునే కాటేసింది

- ప్రియుడితో గడిపే సమయంలో ఏడ్చాడని ఘాతుకం
- రెండేళ్ళ కొడుకును బండకేసి బాది చంపిన తల్లి



**హైదరాబాద్,జూన్ 20(మనం,ప్రత్యేక ప్రతినిధి):** ప్రియుడితో గడిపేందుకు అడ్డువచ్చిన కన్నకుమారుడిని ఓ తల్లి దారుణంగా హత్య చేసింది. ఈ ఘటన మేడ్చల్ జిల్లా కీసరలో చోటు చేసుకోగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. సిద్దిపేట జిల్లా జగదేవ్ పూర్ మండలం తీగుల్ గ్రామానికి చెందిన జ్యోతి, స్వామి భార్య భర్తలు. వీరికి నాలుగేళ్ల కూతురు, రెండేళ్ల కుమారుడు ఉన్నారు. ఉపాధి నిమిత్తం వీరు మేడ్చల్ జిల్లా కీసరలో నివాసం ఉంటున్నారు. స్వామి క్యాబ్ డ్రైవర్ గా పనిచేస్తు కుటుంబాన్ని పోషిస్తుండగా జ్యోతి ఇంటి వద్దనే ఉంటూ పిల్లలను చూసుకుంటోంది.కాగా జ్యోతికి పెళ్లికి ముందు నుండే యాదాద్రి భువనగిరి జిల్లా మాదాపూర్ గ్రామానికి చెందిన నవీన్‌తో వివాహేతర సంబంధం ఉంది. పెళ్లి తరువాత కూడా జ్యోతి నవీన్ తో ఆ సంబంధాన్ని కొనసాగిస్తూనే ఉంది. ఈ క్రమంలోనే గత నెల 29న ప్రియుడు ఇంటికి రాగా ఇద్దరూ ఏకాంతంగా గడిపారు. ఆ సమయంలో జ్యోతి రెండేళ్ల కుమారుడు ఏడవడంతో ప్రియుడు నవీన్‌కు కోపం వచ్చింది. ఏడుపు బయటకు వినిపిస్తే సమస్య అవుతుందని ఆ పిల్లాడిని చంపేద్దామని నవీన్ జ్యోతికి చెప్పాడు. ప్రియుడు చెప్పినట్టుగానే కామంతో కళ్లు మూసుకుపోయిన జ్యోతి కుమారుడిని నేలకేసి అత్యంత దారుణంగా కొట్టి చంపేసింది. కన్నకొడుకును చంపిన జ్యోతి ఇంటికి భర్తకు బాబు ఫిట్స్ వచ్చి చనిపోయాడని నమ్మించింది. బంధువులను కూడా జ్యోతి అలాగే నమ్మించడంతో అంత్యక్రియలు నిర్వహించారు. అయితే ఆ తరవాత భార్య ప్రవర్తనలో మార్పు రావడంతో భర్త స్వామి నిలదీయడంతో పాటు కుటుంబ సభ్యులతో పంచాయితీ పెట్టించాడు. భర్త, కుటుంబ సభ్యులు పదే పదే జ్యోతిని నిలదీయడంతో తానే కుమారుడిని చంపినట్టు ఒప్పుకుంది. భర్త పోలీసులకు ఫిర్యాదు చేయడంతో బాబు డెడ్ బాడీని బయటకు తీసి పోస్ట్ మార్టం నిర్వహించారు. కసాయి తల్లిని అరెస్ట్ చేశామని, ప్రియుడు నవీన్ పరారీలో ఉన్నాడని పోలీసులు చెబుతున్నారు.

# ఎస్బీఐ భూముల వ్యవహారంలో... రాజకీయం ఉందా?

(మొదటి పేజీ తరువాయి)

వివరాలు ప్రభుత్వానికి చేరాయి. వాటన్నింటినీ ఉపసంహరించి మరో బ్యాంకుకు బదిలీ చేసే ఆలోచనలో ఉన్న ప్రభుత్వం ఎస్బీఐకి లీడ్ బ్యాంక్ హోదాను కూడా తొలగించాలనే యోచనలో ఉంది. రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని ఉద్యోగుల జీతాలు, పీఎఫ్‌లు, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు వంటి ఆర్థిక లావాదేవీలన్నీ ప్రస్తుతం ప్రభుత్వం ఎస్బీఐ ద్వారానే నిర్వహిస్తోంది. తాజాగా, రాయదుర్గం భూముల వ్యవహారం నేపథ్యంలో ఎస్బీఐ నుంచి అన్ని లావాదేవాలను ఉపసంహరించుకుని మరో జాతీయ గుర్తింపు పొందిన ప్రభుత్వ బ్యాంకుకు బదిలీ చేసే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. అలాగే, రైతు రుణాల విషయంలోనూ ఎస్బీఐ ఆశించిన మేరకు పనితీరు కనబర్చడం లేదని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రభుత్వం రెతులకు అందజేసే రుణాల విషయంలో సరైన వివరాలు అందజేయకపోవడం, రుణాలు మాఫీ అయినప్పటికీ రైతులను వడ్డీల పేరుతో వేధించడం వంటి ఘటనలు వివాదాస్పదంగా మారాయి. వీటిని విపక్ష పార్టీలైన బీఆర్ఎస్, బీజేపీ తమకు అనుకూలంగా మార్చుకుని ప్రభుత్వంపై విమర్శనాస్త్రాలు ఎక్కుపెట్టి ఇరుకున పెట్టే ప్రయత్నం చేశాయి. మరోవైపు, ఎస్బీఐ చైర్మన్, ఎండీగా రాష్ట్రానికి చెందిన చల్లా శ్రీనివాసులు శెట్టి కొనసాగుతున్నారు. ఆయనపై రాజకీయ ప్రత్యర్థుల ప్రభావం ఏమైనా ఉందా ? అనే కోణంలోనూ ప్రభుత్వ వర్గాలు సమాచారం సేకరిస్తున్నట్లు తెలిసింది. కాగా, రాయదుర్గం భూముల వేలంపై హైకోర్టు 21 రోజుల పాటు స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చిన విషయం తెలిసిందే. ఆలోపు కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులకు హైకోర్టు ఆదేశాలు ఇచ్చింది. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన వేలంలో ఎకరం ధర రూ.237 కోట్లు పలికింది. అయితే, వేలం వేసిన భూమిలో 5 ఎకరాలు తమవేనని వాటిని కూడా ప్రభుత్వం విక్రయించిందని ఎస్బీఐ పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు స్టే విధించింది.

# సైబర్ నేరాలపై సాంకేతిక యుద్ధం

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. పోలీసులు, సైబర్ సెక్యూరిటీ బ్యూరో కృషి, బాధితులు సకాలంలో ఫిర్యాదులు చేస్తుడటం వల్లే రాష్ట్రంలో సైబర్ నేరాల కట్టడి సాధ్యమౌతోందన్నారు. రాష్ట్రంలో సైబర్ నేరాలకు సంబంధించి దాదాపు 45 వేల బ్యాంకు ఖాతాలు, 1500కిపైగా ఈ-మెయిల్ ఐడీలు, 21 వేల వెబ్‌సైట్‌లు, 50 వేల సిమ్‌కార్డుల డేటా సైబర్ సెక్యూరిటీ బ్యూరో సేకరించినట్లు సైబర్ పోలీసులు వివరించారు.

**స్పెషల్ ఆపరేషన్ :**

సైబర్ నేరాల కట్టడికి అత్యాధునిక సాంకేతికత వినియోగం, అవగాహన కార్యక్రమాలు, అంతర్రాష్ట్ర ఆపరేషన్‌లతో చెక్ పెడుతున్నట్లు సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు వివరించారు. అంతేకాకుండా బాధితుల నుంచి సకాలంలో ఫిర్యాదులు అందుతున్న క్రమంలో గణనీయంగా నేరాల తగ్గాయని సైబర్ క్రైం నిపుణులు పేర్కొంటున్నారు.ఇటీవల సైబర్ నేరాలలో సొమ్ము కోల్పోయిన బాధితులు వెంటనే సైబర్ సెక్యూరిటీ బ్యూరోను ఆశ్రయిస్తున్నారని, దీంతో నిందితుల ఖాతాలోని నగదును ఫ్రీజ్ చేయడం సులభతరమౌతుందని తెలిపారు. గతంలో నిందితులకు చెందిన బ్యాంక్ ఖాతాలను సీజ్ చేసే ప్రక్రియలో 2025లో 13శాతం ఉండగా, 2026లో (మే నాటికి) 16శాతానికి పెరిగిందన్నారు. సైబర్ నేరస్థుల ఆటకట్టించేందుకు ఒకవైపు సాంకేతికత పరిజ్ఞానంతోపాటు మరోవైపు బ్యాంకులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్నామన్నారు. తెలంగాణ వ్యాప్తంగా 2025లో సైబర్ నేరాల కేసులలో 230, 2026లో ఇప్పటి వరకు దాదాపు 300 మందిని అరెస్ట్ చేశామని తెలిపారు.

**ఉత్తరాది నుంచి ముప్పు :**

రాష్ట్రంలో ఉత్తరాది రాష్ట్రాలైన గుజరాత్, రాజస్థాన్, యూపీ కేంద్రంగా చేసుకుని తరచూ సైబర్ నేరాలకు పాల్పడుతున్నట్లు సైబర్ క్రైం పోలీసుల దర్యాప్తులో తేలింది. దీంతో నిందితులకు సంబంధించిన మెయిల్స్, వెబ్సైట్, సిమ్కార్డులను నిర్వీర్యం చేశామని, దీంతో సైబర్ నేరాలకు కొంత మేర తగ్గాయని సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ తెలిపారు. నేరాలకు పాల్పడిన నిందితులను అనతి కాలంలో గుర్తించేందుకు సైబర్ పోలీసులకు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. డేటా అగ్రిగేషన్ అండ్ అనాలసిస్ యూనిట్, థ్రెట్ ఇంటలిజెన్స్ యూనిట్ ద్వారా అది సాధ్యమవుతోందన్నారు. ఈక్రమంలో రాష్ట్రంలో వివిధ పోలీస్ స్టేషన్లకు చెందిన దాదాపు 100 మంది యువ పోలీసులకు సైబర్ నేరాల్లో వివిధ అంశాలపై శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. బాధితుల నుంచి ఫిర్యాదు తీసుకున్న వెంటనే అకౌంట్ నంబర్, ఫోన్ నంబర్స్, యూఆర్ఎల్ తీసుకుని డీయుఇ టీం విశ్లేషణ చేస్తుందన్నారు.

**1930కి ఫిర్యాదు :**

సైబర్ నేరాలలో మోసపోయిన బాధితులు వెంటనే 1930కి ఫిర్యాదు చేస్తే నిందితుల ఖాతాలను సీజ్ చేసి బాధితుల సొమ్ము కాపాడేందుక వీలుంటుందని సైబర్ క్రైం పోలీసులు చెబుతున్నారు. బాధితులు తొందరగా మేల్కొంటే నేరగాళ్లు నగదు విత్ డ్రా చేసుకోకుండా చర్యల చేపట్టడానికి అవకాశం ఉంటుందంటున్నారు. సైబర్ నేరాల విషయంలో ఆలస్యంగా ఫిర్యాదు చేయడం వల్ల దుండగులు వేరు వేరు అకౌంట్‌లోకి డబ్బు బదిలీ చేస్తారని సైబర్ నిపుణులు వివరిస్తున్నారు. కేటుగాళ్లు క్రిప్టో కరెన్సీగా ఆపై డాలర్లుగా మార్చుకునే అవకాశం ఉందని, బాధితులు సకాలంలో 1930కి ఫోన్ చేస్తే కాల్ సెంటరు బ్యాంకుల రిస్క్ మేనేజ్‌మెంట్ బృందాలు అనుసంధానమై ఉంటాయని వివరిస్తున్నారు. బ్యాంకు అకౌంట్ నుంచి సైబర్ నేరగాళ్లు నగదును ఎక్కడికి మళ్లించుకుంటున్నారో గుర్తించి ఆయా అకౌంట్లను వెంటనే ఫ్రీజ్ చేస్తారని వివరిస్తున్నారు. ముఖ్యంగా నేరగాళ్లు కాజేసిన నగదు విత్ డ్రా చేసుకునే అవ కాశం లేకుండా అధికారులు కట్టడి చేయడం జరుగుతుందంటున్నారు.

## పాడి రైతుకు.. ప్రజా సర్కార్ భరోసా

(మొదటి పేజీ తరువాయి)

గుర్తించాలని ఆదేశించారు. పాలిచ్చే పశువుల ద్వారా వస్తున్న వాస్తవ ఉత్పత్తిని లెక్కగట్టి సమగ్ర నివేదికను తదుపరి సమావేశంలో ఇవ్వాలని సంబంధిత అధికారులకు డిప్యూటీ సీఎం ఆదేశించారు. రైతుల నుంచి సేకరించే పాల ధరపై స్పష్టమైన విధానం ఉండాలన్నారు. రైతులకు బకాయిలు లేకుండా ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించేలన్నారు. పాఠశాలలకు సరఫరా చేసే పాలకు సంబంధించిన బిల్లులను సంక్షేమ శాఖలు నేరుగా ఆయా విభాగాలకే బదిలీ చేయాలని చెప్పారు. దీనివల్ల రైతులకు ఎలాంటి బకాయిలు ఉండవని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు పాడి పరిశ్రమ మీదే ఆధారపడతారని ఉప ముఖ్యమంత్రి అన్నారు. ఈ నేపథ్యంలో పాడి రైతులకు సమయానికి డబ్బులు చెల్లిస్తే.. వారి కుటుంబం ఆర్థికంగా బలోపేతం అవుతుంది.. డైరీకి నమ్మకంతో పాలు పోస్తారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పాడి పరిశ్రమను లాభసాటిగా మార్చేందుకు, పాల ఉత్పత్తులను గణనీయంగా పెంచేందుకు ఆధునిక పద్ధతులను అనుసరించాలని ఆయన సూచించారు. రైతులకు వ్యవసాయం పైనే కాకుండా, పాడి పరిశ్రమ ద్వారా అదనపు జీవనోపాధి కల్పించేందుకు అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా భట్టి విక్రమార్క అన్నారు.

## ఎగవేతదారులతో బ్యాంకుల కుమ్మక్కు!

(మొదటి పేజీ తరువాయి)

ప్రశ్నిస్తూ దాఖలైన వాజ్యంపై విచారణ సందర్భంగా ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ఈ పిటిషన్కు సమాధానమివ్వాలంటూ కేంద్రం, రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ), ఇతరులకు శుక్రవారం నోటీసులు జారీ చేసింది. రుణ బకాయిల పరిష్కారం తీరును ఆక్షేపించింది. 'పన్ను చెల్లింపుదారుల సొమ్మును, ప్రజల డబ్బును సేకరించి బాధ్యతారహితంగా వాటిని విడుదల చేయడం, రుణంగా ఇవ్వడం... ఆపై వాటి వసూలుకు ఎటువంటి ప్రయత్నం చేయకపోవడం మీ వ్యాపార విధానమైతే ఇది ఏ మాత్రం సమర్థనీయం కాదు' అని ధర్మాసనం పేర్కొంది. ఏఆర్సీల పనితీరును పరిశీలించాల్సిన ఆవశ్యకత ఉందని ధర్మాసనం అభిప్రాయపడింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

## దేవాదాయ శాఖలో సరికొత్త అధ్యాయం

(మొదటి పేజీ తరువాయి)

కొత్త ఒరవడి ప్రారంభవుతుందన్న ఆశాభావాన్ని మంత్రి సురేఖ వ్యక్తం చేశారు. దేవుడి ఆజ్ఞ లేనిదే చీమైనా కుట్టదని, దేవాదాయశాఖ మంత్రిగా తన ఆధ్వర్యంలో దేవాలయాల వికాసం, ఉద్యోగుల సంక్షేమానికి చేపడుతున్న చర్యల పట్ల మంత్రి సురేఖ సంతోషాన్ని వ్యక్తం చేశారు. కింది స్థాయి ఉద్యోగుల నుంచి ఉన్నతస్థాయి ఉద్యోగుల వరకు, దేవాలయ సిబ్బంది మొత్తం ఈ సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ పొందితే వచ్చే ఫలితాలు అద్భుతంగా వుంటాయని మంత్రి సురేఖ పేర్కొన్నారు. అర్చకులు, ఉద్యోగులు నిష్టతో పనిచేస్తూ తెలంగాణ రాష్ట్రాన్ని ఆధ్యాత్మిక రాష్ట్రంగా తీర్చిదిద్దాలని మంత్రి సురేఖ పిలుపునిచ్చారు. దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత క్రియాశీలంగా లేని కారణంగా చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు తెలిపారు. దేవాలయాల నిర్వహణ, ఉద్యోగుల సంక్షేమం పట్ల ఎంతో నిబద్ధత కలిగిన మంత్రి కొండా సురేఖ చొరవతో ప్రారంభించుకోవడం సంతోషంగా వుందని తెలిపారు.

## తవ్వేకొద్ది...నగలు,నగదు

- నరహరి లాకర్‌లో రూ.1.50 కోట్ల నగదు
- నిందితుడిని కస్టడీ కోరుతూ పిటిషన్

**హైదరాబాద్,జూన్ 20(మనం,ప్రత్యేక ప్రతినిధి) :** ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో నిందితుడు మాజీ డిప్యూటీ డైరెక్టర్ సుంకరి నరహరి కేసులో తవ్వేకొద్ది నగదు, నగలు బయటపడుతున్నాయి. ఇటీవల ఆయన నివాసంలో ఏసీబీ సోదాలలో నగదు, నగలు, ఆస్తి పత్రాలను వెరసి దాదాపు రూ. 300 కోట్ల స్థిరచారాస్థులు స్వాధీనం చేసుకున్న విషయం విదితమే. తాజాగా ఆయన బ్యాంకు లాకర్‌లో రూ. 1.50 కోట్లనగదు, రెండున్నర కిలోల బంగారు ఆభరణాలను ఏసీబీ అధికారులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఆదాయానికి మించి ఆస్తుల కేసులో నిందితుడు నరహరికి చెందిన షాలిబండలోని కెనరా బ్యాంకు లాకర్లను శనివారం ఏసీబీ అధికారులు ఓపెన్ చేశారు. ఈ క్రమంలో నరహరి లాకర్‌లో కుప్పలు తెప్పలుగా నోట్ల కట్టలను దర్శనం ఇచ్చాయి. ఈ నగదును గంటపాటు లెక్కించిన అధికారులు రూ. 1.50 కోట్లు ఉన్నట్లు లెక్కతేల్చారు. నరహరి నివాసంలోనూ 1.3 కిలోల బంగారం, 8 కిలోల వెండిని సీజ్ చేశారు. అలాగే బ్యాంకు ఖాతాల్లో రూ. 2.29 కోట్లు గుర్తించారు. ఆదాయానికి మించి ఆస్తుల కేసులో నిందితుడు నరహరి రావు, అతని కుంటుంబ సభ్యులకు సంబంధించి మరిన్ని లాకర్లు ఉన్నట్లు ఏసీబీ అధికారులు అనుమానిస్తున్నారు. నరహరి రావు, అతని బినామీల పేరు మీద ఉన్న మరికొన్ని బ్యాంక్ లాకర్లను కూడా తనిఖీ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ భారీ అవినీతి వెనుక ఇంకా ఎవరెవరి హస్తం ఉందనే కోణంలో ఏసీబీ తన విచారణను ముమ్మరంగా కొనసాగిస్తోంది.ఈ కేసులో మరిన్ని కీలక ఆధారాలు సేకరించేందుకు నిందితుడు నరహరిని వారం రోజుల పాటు కస్టడీ కోరేందుకు ఏసీబీ అధికారులు సమాలోచనలు సాగిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం కోర్టులలో పిటిషన్ దాఖలు చేయనున్నట్లు సమాచారం.

## నేరాల ఛేదనపై పోలీసులకు పాఠాలు

- పోలీస్ అకాడమీలో క్లూస్ టీం ప్రత్యేక శిక్షణ



**హైదరాబాద్: జూన్ 20(మనం,ప్రత్యేక ప్రతినిధి):** కొత్త పుంతలు తొక్కుతున్న తీవ్ర నేరాల ఛేదనలో మెరుగైన దర్యాప్తు కోసం పోలీసు శాఖలో కానిస్టేబుల్ నుంచి సీఐల వరకు ప్రత్యేక శిక్షణ ప్రారంభించారు. ముఖ్యంగా నూతన క్రిమినల్ చట్టాల అమలు నేపథ్యంలో శాస్త్రీయ దర్యాప్తు నైపుణ్యాలను పెంపొందించేందుకు పోలీసు అకాడమీలో శనివారం నుంచి ఆరు రోజుల ప్రత్యేక సేవా శిక్షణా కోర్సు నిర్వహిస్తున్నట్లు పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ తెలిపారు. ఈ శిక్షణలో నేర సంఘటన స్థలాన్ని శాస్త్రీయ పద్ధతుల్లో నిర్వహించడం, సాక్ష్యాధారాల గుర్తింపు, సేకరణ, సంరక్షణ, ప్యాకింగ్, సీలింగ్, లేబులింగ్ మరియు ఫార్వార్డింగ్ విధానాలపై సమగ్ర అవగాహన కల్పించనున్నామన్నారు. భౌతిక, జీవసంబంధ, డిజిటల్ సాక్ష్యాధారాలను సక్రమంగా నిర్వహించడం, వాటి సమగ్రతను కాపాడడం, అలాగే చైన్ ఆఫ్ కస్టడీ నిర్వహణపై శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు.నేర సంఘటన స్థల డాక్యుమెంటేషన్‌కు సంబంధించిన ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ, శోధన పద్ధతులు, రికార్డుల నిర్వహణపై విస్తృత స్థాయిలో ప్రాక్టికల్ శిక్షణ అందించనున్నట్లు వివరించారు. నూతన క్రిమినల్ చట్టాల ప్రకారం తప్పనిసరి అయిన ఆడియో-వీడియో రికార్డింగ్ విధానాలపై ప్రత్యేక దృష్టి సారించి, ఎలక్ట్రానిక్ రికార్డుల ప్రామాణికత, న్యాయపరమైన అంశాలపై అవగాహన కల్పించడం జరిగిందన్నారు.డిజిటల్ సాక్ష్యాధారాల ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుని, ఎలక్ట్రానిక్ పరికరాల గుర్తింపు, స్వాధీనం, సాక్ష్యాల భద్రత, డాక్యుమెంటేషన్‌పై ప్రత్యక్ష శిక్షణ ఉంటుదని తెలిపారు. క్లూస్ టీమ్ వాహనం, నేర సంఘటన స్థల పరిశీలనలో ఉపయోగించే వివిధ ఫోరెన్సిక్ కిట్లు, పరికరాలు, ఉపకరణాలపై ప్రత్యేక సెషన్ నిర్వహించి వాటి వినియోగాన్ని ప్రదర్శనల ద్వారా వివరించినట్లు తెలిపారు. ఈ కోర్సులను స్పెషల్ కోర్సుగా పోలీస్ అకాడమీలో నిర్వహిస్తున్నామని డైరెక్టర్ అభిలాష బిస్త్ తెలిపారు.ఈ కోర్సు డైరెక్టర్ గా ధనజ వ్యవహరించగా క్లోజింగ్ కు ఏడీ నరహరి క్లూస్ టీం ప్రాముఖ్యతలను వివరించారు.

# బీసీల సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

భవన్‌లో జరిగిన ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి రాష్ట్రంలోని జిల్లా బీసీ అభివృద్ధి అధికారులు, సహాయ బీసీ అభివృద్ధి అధికారులు, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టరు, శాఖాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రజా భవన్‌లో జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ... తెలంగాణ ప్రభుత్వం వెనుకబడిన తరగతుల విద్యా, ఆర్థిక, సామాజిక అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు, సంక్షేమ కార్యక్రమాల ద్వారా బీసీ యువతను సాధికారత కలిగిన వర్గంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. 2025-26 విద్యా సంవత్సరంలో బీసీ సంక్షేమ వసతి గృహాల విద్యార్థులు 96.05 శాతం ఉత్తీర్ణత సాధించడం అభినందనీయమని మంత్రి తెలిపారు. రాష్ట్ర సగటు ఉత్తీర్ణత శాతం 95.15 కంటే ఇది అధికమని పేర్కొన్నారు. పరీక్షలకు హాజరైన 4,941 మంది విద్యార్థుల్లో 4,746 మంది ఉత్తీర్ణులయ్యారని, రాష్ట్రవ్యాప్తంగా 285 హాస్టళ్లు 100 శాతం ఫలితాలు సాధించాయని వెల్లడించారు. 641 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించారని తెలిపారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షల్లో బీసీ హాస్టళ్లలో 51.63 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా, రాజన్న సిరిసిల్ల, రంగారెడ్డి, హనుమకొండ జిల్లాలు మెరుగైన ఫలితాలు సాధించాయని తెలిపారు. రెండో సంవత్సరం పరీక్షల్లో 71.85 శాతం ఉత్తీర్ణత నమోదైందని, హనుమకొండ, కొమరం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, ములుగు జిల్లాలు ఉత్తమ ఫలితాలు సాధించాయని వెల్లడించారు. తక్కువ ఫలితాలు సాధించిన జిల్లా అధికారులను మందలించారు. సంవత్సరం మంచి మార్కులు సాధించేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు.విద్యార్థుల విద్యా ప్రమాణాల పెంపు కోసం ప్రత్యేక శిక్షణ, మెంటరింగ్, మోడల్ పరీక్షలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. అదనపు విద్యా సహాయం అవసరమైన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.ఈ విద్యా సంవత్సరంలో బీసీ సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు యూనిఫాం క్లాత్, నోట బుక్స్, బెడ్ షీట్లు, ట్రంక్ బాక్స్, స్కూల్ బ్యాగ్, ట్రాక్సూట్, షూస్, సాక్స్, బ్లాంకెట్లు, స్టేషనరీ సామగ్రి తదితర అవసరమైన వస్తువులతో కూడిన సమగ్ర స్వాగతం కిట్ అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు.

హాస్టళ్లలో ఖాళీలను త్వరితగతిన భర్తీ చేయాలని, రిజర్వేషన్ విధానం ప్రకారం అడ్మిషన్లు చేపట్టాలని అధికారులకు సూచించారు. జూన్ నెలాఖరులోపు అన్ని హాస్టళ్లలో పేరెంట్-టీచర్ సమావేశాలు నిర్వహించి విద్యార్థుల పురోగతి, హాస్టల్ సౌకర్యాలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. విద్యార్థుల భద్రత, ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. హాస్టల్ ప్రాంగణాల పరిశుభ్రత, కలుపు మొక్కల తొలగింపు, నిల్వ నీటి నిర్మూలన, ఎలుకల బొరియల తొలగింపు, పెస్ట్ కంట్రోల్, ఫాగింగ్, వాటర్ ట్యాంకుల శుభ్రపరిచే కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఖుప్లాంట్లు, వాటర్ కూలర్లు సక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన, పోషకాహారం అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. నిర్ణీత డైట్ మెనూను కచ్చితంగా అమలు చేయడంతో పాటు నాణ్యమైన బియ్యం, పప్పులు, కూరగాయలు, గుడ్లు, పాలు సరఫరా చేయాలని సూచించారు. ప్రతి విద్యార్థికి అకడమిక్ ప్రొఫైల్, ఆరోగ్య ప్రొఫైల్ రూపొందించి వారి విద్యా పురోగతి, ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని మంత్రి ఆదేశించారు. పరీక్షల ఒత్తిడి, వ్యక్తిత్వ వికాసం, ఆత్మవిశ్వాసం పెంపు కోసం కౌన్సెలింగ్ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. బీసీ వర్గాల అభివృద్ధికి అందుతున్న ప్రయోజనాలపై అర్హులైన లబ్ధిదారులకు విస్తృత అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు.

ఇదిలాఉంటే, బోనాల పండుగ సందర్భంగా జూలై 14 నుండి 24 మధ్య హెచ్ఎండియే గ్రౌండ్స్ వద్ద కుల వృత్తుల ప్రదర్శన, మట్టి కుండల స్టాల్స్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. 33 జిల్లా వెనుకబడిన తరగతుల సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, మార్కెట్ కమిటీ చైర్మన్‌లు, నామినేటెడ్ పదవుల్లో ఉన్న వారితో జిల్లా బీసీ అభివృద్ధి అధికారులు సమావేశాన్ని ఏర్పాటు చేసి బీసీ సంక్షేమశాఖ అమలు చేస్తున్న పథకాలు సంక్షేమ కార్యక్రమాలపై చర్చించాలన్నారు.

కుట్టు మిషన్ పథకంలో జిల్లా కలెక్టర్‌లతో బీసీ సంక్షేమ అధికారులు సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. బీసీ, ఈబీసీ వర్గాలకు సంబంధించిన కళ్యాణ లక్ష్మి పథకం దరఖాస్తుల పెండింగ్ లేకుండా చూడాలని మంత్రి అధికారులను ఆదేశించారు. తహసీల్దార్, ఆర్‌డీఓ స్థాయిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను ప్రాధాన్యతగా పరిష్కరించి అర్హులైన లబ్ధిదారులకు సకాలంలో గ్రీన్ ఛానల్ ద్వారా ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

## నౌకాదళం.. మరింత బలోపేతం

(మొదటి పేజీ తరువాయి)

చార్టుల తయారీలో సామర్థ్యం పెంచేందుకు దోహదపడేలా ఐఎన్ఎస్ సంశోధక్ నౌకను నిర్మించారు. ఇది 110 మీటర్ల పొడవుతో ఉంటుంది. 2023 జూన్ 13న జలప్రవేశం చేయించారు. పోర్టులు, సీహానళ్లు, మారిటైం పరిధిలో సముద్ర అధ్యయనం, నావిగేషన్ విధుల కోసం ప్రత్యేక హెలికాప్టర్, విపత్కర పరిస్థితుల్లో మానవీయ సాయానికి, రక్షణ చర్యలు చేపట్టేందుకు అనువుగా సంశోధక్ నిర్మాణం చేశారు.

ఐఎన్ఎస్ దుణగిరి...

భారత నేవీలో విశిష్ట సేవలు అందించిన నీలగిరి శ్రేణిగా ఐఎన్ఎస్ దుణగిరి యుద్ధనౌకను ఎంతో ప్రత్యేకంగా నిర్మించారు. ప్రాజెక్టు 17ఏ పేరిట నిర్మించిన నౌకను 2022 జులై 15న జలప్రవేశం చేయించారు. దీని పొడవు 149 మీటర్లు. అడ్వాన్స్డ్ గైడెడ్ మిస్సైల్ ఫ్రిగేట్‌గా తీర్చిదిద్దారు. రాడార్, సెన్సర్లతో బహుముఖ పాత్ర పోషించేందుకు అనువుగా చేపట్టిన దుణగిరి బ్రహ్మోస్ యాంటీ క్రూజ్ క్షిపణులను కలిగి ఉండటం దీని ప్రత్యేకత.

## రేపటి నుండి ఢిల్లీలో ఉంటా

(మొదటి పేజీ తరువాయి)

సీఎం రేవంత్ కోరారు.

'నీట్' విద్యార్థులకు సీఎం రేవంత్ రెడ్డి ఆల్ ది బెస్ట్ తెలిపారు. ఆదివారం పునర్నిర్వహిస్తున్న ఈ పరీక్షలో విద్యార్థులు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా పూర్తి ఆత్మవిశ్వాసంతో పరీక్ష రాయాలన్నారు. వైద్య విద్యలో ప్రవేశానికి సంబంధించి ఈ పరీక్ష కోసం విద్యార్థులు ఎంతో కాలంగా కృషి చేశారనీ, దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఈ పరీక్షకు సంబంధించి రాష్ట్రంలో సుమారు 208 పరీక్ష కేంద్రాల్లో దాదాపు 2.95 లక్షల మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతున్నారని పేర్కొన్నారు. విద్యార్థుల సౌకర్యార్థం ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించిన విషయాన్ని సీఎం గుర్తు చేశారు. విద్యార్థులు చివరి నిమిషం వరకూ వేచి ఉండకుండా ముందుగానే పరీక్ష కేంద్రాలకు హాజరు కావాలనీ, నిబంధనలు పాటిస్తూ ప్రశాంతంగా పరీక్ష రాయాలన్నారు. విద్యార్థులంతా తమ లక్ష్యాలను సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు.

## జంతర్‌మంతర్‌ను వీడబోం

**ఢిల్లీ, జూన్ 20:** 'నీట్'తో సహా పలు ఇతర పరీక్షల్లో జరిగిన అక్రమాల నేపథ్యంలో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ పార్టీ ఢిల్లీలో మరోసారి నిరసన చేపట్టింది. ఆయన రాజీనామా చేసేవరకు జంతర్‌మంతర్‌ను వీడబోమని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే తేల్చిచెప్పారు. జంతర్‌మంతర్ వద్ద మరికొన్ని రోజులు నిరసన కొనసాగించేందుకు అనుమతివ్వాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు. ఈ నిరసన ప్రదర్శనలో విద్యార్థులు, మద్దతుదారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. విద్యావ్యవస్థలో తరచూ జరుగుతున్న తప్పిదాల వల్ల లక్షలమంది విద్యార్థుల భవిష్యత్తు ప్రభావితమవుతున్నా.. విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఇంకా పదవిలోనే కొనసాగించడం సిగ్గుచేటని దుయ్యబట్టారు. ప్రశ్నపత్రాల లీకేజీ వల్ల విద్యార్థులకు జరుగుతున్న నష్టంపై స్పందించాలని ప్రధాని నరేంద్ర మోడీకి లేఖ రాశారు.

## 'బండి'కి కండీషన్ బెయిల్

- ఏడు రోజుల మధ్యంతర బెయిల్ మంజూరు
- చర్లపల్లి జైలు నుండి విడుదల

**హైదరాబాద్,జూన్ 20(మనం,ప్రత్యేక ప్రతినిధి):** రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ పోక్సో కేసు వ్యవహారంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. దాదాపు నెల రోజులకు పైగా చర్లపల్లి జైల్లో ఉన్న భగీరథ్‌కు మల్కాజిగిరి కోర్టు కండీషన్ బెయిల్ మంజూరు చేసింది. ఇంజనీరింగ్ పరీక్షల నేపథ్యంలో బండి భగీరథ్ తరపు న్యాయవాదులు మధ్యంతర బెయిల్ కోరారు. వాదనల విన్న కోర్టు నెల 26 వరకు మధ్యంతర బెయిల్ మంజూరు చేస్తు ఉత్తర్వులు ఇచ్చింది. ఓ మైనర్ బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించాడన్న ఆరోపణలతో బండి బగీరథ్‌పై గత నెల 8వ తేదీన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో కేసు నమోదైన విషయం విదితమే. నాటకీయ పరిణామాల మధ్య ఈ కేసు విచారణాధికారి కూకట్ పల్లి డీసీపీ రితిరాజ్ ఆదేశాలతో 5 బృందాలుగా రంగంలోకి దిగిన పోలీసులు మే 16న భగీరథ్‌ను అరెస్ట్ చేసి చర్లపల్లి జైలుకు తరలించారు. ఈ కేసు దర్యాప్తులో మరిన్ని కీలక ఆధారాలు సేకరించేందుకు పోలీసులు తమ కస్టడీకి అప్పగించాలని కోర్టును ఆశ్రయించగా మల్కాజిగిరి కోర్టు 3 రోజుల కస్టడీకి అనుమతి ఇచ్చింది. భగీరథ్‌ను కస్టడీకి తీసుకున్న పేట్ బషీరాబాద్ పోలీసులు చర్లపల్లి జైలు నుంచి తమ అదుపులోకి తీసుకుని మొయినాబాద్‌లోని అరణ్య ఫామ్ హౌస్‌లో సీన్ రీ కన్ స్ట్రక్షన్ నిర్వహించారు. నెల రోజులకు పైగా జైలు జీవితం గడిపిన భగీరథ్ తాజాగా మధ్యంతర బెయిల్‌పై విడుదలయ్యాడు.

# ఎస్ఐఆర్ ప్రక్రియకు ఏర్పాట్లు పూర్తి




- **మీడియా సమావేశంలో సిఇఒ సి. సుదర్శన్ రెడ్డి**

**హైదరాబాద్, మనంప్రతినిధిః** అర్హులైన ప్రతి ఓటరు పేరును ఓటరు జాబితాతో నమోదు చేయాలని, అనర్హులైన వారి పేర్లను జాబితా తొలగించాలని ఉద్దేశ్యంతోనే భారత ఎన్నికల సంఘం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని చేపట్టిందని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సిఇఒ) శ్రీ సి. సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు.ఎస్ఐఆర్ ప్రక్రియపై శనివారం బిఆర్ కె భవన్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో సిఇఓ సదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ఈనెల 25.06.2026 నుండి ప్రారంభం కానున్న ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి గణన ఫారమ్స్ ను పంపిణీ చేసే కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు. గణన ఫారమ్స్ పంపిణీ కార్యక్రమాం నెల రోజుల (25.06.2026 నుండి 24.07.2026 వరకు) పాటు కొనసాగనున్నదని, ఈ గడువు పొడిగింపు ఉండదని తెలిపారు. ఇంటింటికీ బిఎల్ఒలు ఓటర్లకు గణన ఫారమ్ లను పూరించడంలో సహాయం చేస్తారని, ఇందుకోసం వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు. బిఎల్ఒలు ప్రతి ఇంటిని కనీసం మూడుసార్లు సందర్శిస్తారని, ఆ సమయంలో ఫారమ్ లను పంపిణీ చేయడంతో పాటు, ఓటర్లు పూరించిన ఫారమ్ లను కూడా సేకరిస్తారని, ఎస్ఐఆర్ ప్రక్రియలో బిఎల్ఒలు కీలక పాత్ర పోషిస్తారని, అలాగే బూత్ స్థాయి ఏజెంట్లు కూడా సంబంధిత పోలింగ్ కేంద్రాల పరిధిలో గణన ఫారమ్లను పూరించడంలో ఆఔెలకు సహకరించేందుకు తగిన శిక్షణ పొందుతున్నారని తెలిపారు. ఓటర్లు తమ గణన ఫారమ్లను ఆన్లైన్ ద్వారా వెబ్సైట్లో కూడా సమర్పించవచ్చని చెప్పారు.ప్రత్యేక ఓటరు జాబితా సవరణ-2026 కార్యక్రమంపై విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారని తెలిపారు. గణన ఫారమ్ల పంపిణీ, సేకరణ కోసం బిఎల్ఒ ఇంటింటికీ వచ్చినప్పుడు ఓటర్లందరూ సర్ ప్రక్రియకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ విలేకరుల సమావేశంలో అదనపు ప్రధాన ఎన్నికల అధికారి డా. వాసం వెంకటేశ్వర్ రెడ్డి, ఐఎఎస్, సంయుక్త ప్రధాన ఎన్నికల అధికారి ఎం. సత్యవాణి, ఐఎఎస్, ప్రభుత్వ అదనపు కార్యదర్శి శంకర్, సహాయ కార్యదర్శి ఎ.ఎస్. చారి, బి. చెన్నయ్య , ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# రోగుల భద్రతకు పెద్దపీట




- **కేంద్ర సర్కార్ కీలక నిర్ణయం**
- **దేశవ్యాప్తంగా 16 రకాల ఫిక్స్డ్ డోస్ కాంబినేషన్ మందులపై (బ్యాన్)నిషేధం**
- **ఔషధాల హేతుబద్ధ వినియోగమే లక్ష్యమని వెల్లడి**
- **సుప్రీం ఆదేశాలతో రంగంలోకి దిగిన నిపుణుల కమిటీ సిఫార్సు**
- **ఆ మందులతో ప్రయోజనాలకంటే?.. ప్రమాదాలే ఎక్కువని నిర్ధారణ**
- **నిషేధం తక్షణమే అమల్లోకి వస్తుంది?.. కేంద్ర ఆరోగ్య శాఖ స్పష్టీకరణ**

**హైదరాబాద్, మనం ప్రతినిధి :** భారత్‌లో రోగుల భద్రత బలోపేతం, ఔషధాల హేతుబద్ధ వినియోగాన్ని ప్రోత్సహించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా 16 రకాల ఫిక్స్డ్ డోస్ కాంబినేషన్ (ఎఫ్‌డీసీ) మందుల తయారీ, అమ్మకం, పంపిణీపై తక్షణమే నిషేధం విధిస్తున్నట్లు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ ఆదేశాలు వెంటనే అమల్లోకి వస్తాయని స్పష్టం చేసింది. అయితే, డ్రగ్స్ అండ్ కాస్మోటిక్స్ చట్టం, 1940లోని సెక్షన్ 26ఏ కింద ఈ నిషేధాన్ని విధించారు. భారత మార్కెట్‌లో అందుబాటులో ఉన్న ఫిక్స్డ్ డోస్ కాంబినేషన్ మందులపై సమగ్ర సమీక్ష జరపాలని సుప్రీంకోర్టు గతంలో జారీ చేసిన ఆదేశాల మేరకు ఈ చర్యలు తీసుకున్నారు. రెండు లేదా అంతకంటే ఎక్కువ మందులను కలిపి ఒకే ఔషధంగా తయారు చేయడాన్ని ఫిక్స్డ్ డోస్ కాంబినేషన్ అంటారు. సుప్రీంకోర్టు సూచనల నేపథ్యంలో డ్రగ్స్ టెక్నికల్ అడ్వైజరీ బోర్డ్ (డీటీఏబీ) ఒక నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. దేశంలోని వివిధ ఎఫ్డీసీ మందులపై ఈ కమిటీ లోతైన శాస్త్రీయ విశ్లేషణ జరిపింది. వాటి భద్రత, సమర్థత, చికిత్సా విలువలను అంచనా వేసింది. ఈ సమీక్షలో 16 రకాల ఎఫ్‌డీసీ మందులకు సరైన చికిత్సాపరమైన హేతుబద్ధత లేదని, వాటిని వాడటం వల్ల ప్రజల ఆరోగ్యానికి హాని కలిగే ప్రమాదం ఉందని కమిటీ తేల్చింది. ఈ మందుల వల్ల కలిగే ప్రయోజనాల కంటే వాటితో ముడిపడి ఉన్న నష్టాలే ఎక్కువగా ఉన్నాయని తన నివేదికలో పేర్కొంది. గతంలో కూడా ఇలాంటి హేతుబద్ధత లేని డ్రగ్ కాంబినేషన్లపై శాస్త్రీయ సమీక్షల అనంతరం నిషేధం విధించినట్లు గుర్తుచేసింది.

# బీజేపీ కుట్రపూరితంగా... మీనాక్షి నామినేషన్‌ను తిరస్కరించింది

- **ఎన్నికల రిటర్నింగ్ అధికారిని**
- **ఉరి తీసినా తప్పు లేదు**
- **ఆ పార్టీకి ప్రజాస్వామ్యంపై నమ్మకం లేదు**
- **పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్**
- **గాంధీభవన్‌లో సేవ్ డెమోక్రసి పేరుతో సత్యాగ్రహ దీక్ష**



**హైదరాబాద్, జూన్ 20 ( మనం బ్యూరో ) :** బీజేపీ కుట్రపూరితంగా మీనాక్షి నటరాజన్ నామినేషన్‌ను తిరస్కరించిందని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. నామినేషన్‌ను తిరస్కరించిన ఎన్నికల రిటర్నింగ్ అధికారిని ఉరి తీసినా తప్పు లేదని వ్యాఖ్యానించారు. మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణను వ్యతిరేకిస్తూ శనివారం గాంధీభవన్‌లో సేవ్ డెమోక్రసీ పేరుతో సత్యాగ్రహ దీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మహేశ్ గౌడ్ మాట్లాడుతూ బీజేపీ పాలన అడ్డూ అదుపూ లేకుండా సాగుతోందన్నారు. మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ తీరు చూస్తే మోడీ దుర్మార్గం అర్థం అవుతుందని విమర్శించారు. మతం పేరుతో బీజేపీ రాజకీయాలు చేస్తోందనీ, అధికారం కోసం ఏం చేసేందుకైనా ఆ పార్టీ సిద్ధంగా ఉందని ధ్వజమెత్తారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్యంపై బీజేపీకి నమ్మకం లేదనీ...మేం చెప్పిందే రాజ్యాంగం అన్నట్లుగా ఆ పార్టీ వ్యవహరిస్తోందని మండిపడ్డారు. టీఎంసీ, శివసేన ఎంపీలను నిట్టనిలువునా చీల్చి రాజ్యాంగాన్ని బీజేపీ అపహాస్యం చేస్తోందన్నారు. ఉదయం లేస్తే దేవుడి జపం చేస్తారు, దేవుడి పేరు చెప్పకుండా బీజేపీ నేతలకు గెలిచే దమ్ముందా అని ప్రశ్నించారు. దేశంలో 90 శాతం సంపద బీజేపీ నేతల అనుయాయుల చేతుల్లో ఉందనీ, ఆ పార్టీ అప్రజాస్వామిక చర్యలను దేశ ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. బీజేపీకి రాష్ట్రంలో స్థానం లేదు, మళ్లీ వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని ఈ సందర్భంగా మహేశ్ గౌడ్ స్పష్టం చేశారు.

# టీఐసీసీఐ నూతన కార్యవర్గ ఎన్నిక




**హైదరాబాద్, మనం ప్రతినిధిః** ట్రైబల్ ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ తెలంగాణ చాప్టర్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర నూతన కార్యవర్గ సమావేశం ఘనంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గానికి ఎన్నికైన సభ్యులకు నియామక పత్రాలను అందజేశారు. తెలంగాణ రాష్ట్రంలో గిరిజన యువత, పారిశ్రామికవేత్తలు మరియు వ్యాపారవేత్తలు భవిష్యత్తులో వ్యాపార రంగంలో ఎలా రాణించాలి, ప్రభుత్వ పథకాలను ఎలా సద్వినియోగం చేసుకోవాలి, స్వయం ఉపాధి అవకాశాలను ఎలా అభివృద్ధి చేసుకోవాలి అనే అంశాలపై విస్తృతంగా చర్చించి అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో నూతనంగా ఎన్నికైన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డా. ధరావత్ శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా గిరిజన పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం, వారికి అవసరమైన మార్గదర్శకత్వం అందించడం, వ్యాపార మరియు పారిశ్రామిక రంగాలలో మరిన్ని అవకాశాలు కల్పించడం తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. అలాగే తెలంగాణ రాష్ట్రంలో గిరిజన వ్యాపారవేత్తల అభివృద్ధికి టీఐఇఇఐ వేదికగా పనిచేస్తూ, కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాల వివిధ పథకాల ప్రయోజనాలను అర్హులైన లబ్ధిదారులకు చేరవేయడానికి కృషి చేస్తామని తెలిపారు.

# మహిళల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వ కట్టుబడి ఉంది

- **మంత్రి మహమ్మద్ అజహరుద్దీన్**

**హైదరాబాద్, మనంప్రతినిధిః** మహిళల ఆర్థిక, విద్యా, సామాజిక అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందనిమంత్రి మహమ్మద్ అజహరుద్దీన్ పేర్కొన్నారు. శుక్రవారం బంజారాహిల్స్‌లోని బంజారా భవన్‌లో ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజహరుద్దీన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం మహిళల సాధికారత, సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, ఎమ్మెల్సీ వెంకట బాల్మూర్, జీహెచ్ఎంసీ కమిషనర్, ఇతర ప్రభుత్వ




ఉన్నతాధికారులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, పార్టీ శ్రేణులు, మహిళా ప్రతినిధులు,కార్యకర్తలు పాల్గొన్నారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం కింద పెద్ద సంఖ్యలో మహిళా లబ్ధిదారులకు చీరలను పంపిణీ చేశారు. మహిళల సంక్షేమం, సాధికారత కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను సభలోని ప్రముఖులు అభినందించారు.ఈ కార్యక్రమం అనంతరం లబ్ధిదారులతో మంత్రి మరియు ఇతర ప్రజాప్రతినిధులు ముచ్చటించి వారి సమస్యలను తెలుసుకున్నారు. మహిళల అభ్యున్నతి కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని వారు పేర్కొన్నారు.

# మంత్రి సీతక్క చిత్రపటానికి పాలాభిషేకం చేసిన సర్పంచులు



**ములుగు,జూన్ 20మనం ప్రతినిధి :** జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్బి గెస్ట్ హౌస్ లో జరిగిన గ్రామ సర్పంచుల శిక్షణ అనంతరం ఏటూరునాగారం,కన్నాయిగూడెం, తాడ్వాయి,వాజేడు,వెంకటాపూర్ మండలానికి చెందిన గ్రామ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, జీపివోలు, శానిటేషన్ సిబ్బంది రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామపంచాయతీ సిబ్బందికి ప్రతి నెల 1న జీతాలు పడే విధంగా, గ్రామ సర్పంచులకు మంత్రి సీతక్క 5 నెలల జీతాలు ఒకేసారి పడేలా ఆదేశాలు జారీ చేసినందుకు వారి స్వచ్ఛందంగా మంత్రి సీతక్కకు కృతజ్ఞతలు తెలుపుతూ వారి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో డిపివో, డిఎల్పివో, ఏటూరునాగారం, కన్నాయిగూడెం, తాడ్వాయి, వాజేడు,వెంకటాపూర్ మండల సర్పంచులు,జీపివో లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సాగునీటి ప్రాజెక్టులన్నీ పూర్తి చేసి రైతుల కలలను సాకారం చేస్తాం

- **రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు**

**ఉమ్మడి మహబూబ్ నగర్ జూన్ 20 (మనం బ్యూరో)ః** ఉమ్మడి మహబూబ్‌గర్ జిల్లాను సాగునీటి పరంగా సస్యశ్యామలం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, జిల్లాలోని రైతాంగం దశాబ్దాలుగా రైతులు ఎదురుచూస్తున్న నీటి కలను సాకారం చేయడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో పనిచేస్తోందని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో 20 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో సాగునీటి ప్రాజెక్టులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. శనివారం నాగర్కర్నూల్ జిల్లా కలెక్టరేట్లో నిర్వహించిన సాగునీటి ప్రాజెక్టుల సమీక్ష సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడిన మంత్రి జూపల్లి కృష్ణారావు, జిల్లాలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల పురోగతి, భూసేకరణ, నిధుల అవసరం, సాంకేతిక సమస్యలు, పెండింగ్ పనులపై విస్తృతంగా చర్చించినట్లు తెలిపారు. మీడియా సమావేశంలో నాగర్కర్నూల్ పార్లమెంట్



సభ్యుడు డాక్టర్ మల్లు రవి, నాగర్కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ....., ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా చారిత్రాత్మకంగా కరువు, వలసలు, నీటి కొరతకు ప్రతీకగా నిలిచిందన్నారు. ఆ పరిస్థితిని పూర్తిగా మార్చి పాలమూరును పచ్చని పంటలతో కళకళలాడే జిల్లాగా తీర్చిదిద్దాలన్నదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పమని సూచించారు. ఈ నెల 3, 4 తేదీలలో ముఖ్యమంత్రి స్వయంగా జిల్లాలో పర్యటించి వివిధ సాగునీటి ప్రాజెక్టులను పరిశీలించారన్నారు. సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి పనుల వేగంపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని గుర్తు చేశారు. ప్రాజెక్టుల నిర్మాణంలో భూసేకరణ కీలక పాత్ర పోషిస్తోందని మంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రస్తుతం భూసేకరణకు సంబంధించిన పెండింగ్ అంశాలపై సమగ్రంగా చర్చించినట్లు తెలిపారు. ఎక్కడ భూయజమానుల అభ్యంతరాలు ఉన్నాయి, ఎక్కడ పరిహారం సమస్యలు ఉన్నాయి, ఎక్కడ పరిపాలనా అనుమతులు అవసరమవుతున్నాయి అనే అంశాలన్నింటినీ ఈ సమావేశంలో సమీక్షించినట్లు వెల్లడించారు. రైతుల హక్కులకు భంగం కలగకుండా, చట్టబద్ధంగా, పారదర్శకంగా భూసేకరణ పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించినట్లు చెప్పారు. పాలమూరు -రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం, జూరాల, నెట్టెంపాడు, భీమ తదితర ప్రాజెక్టులు పూర్తి స్థాయిలో అమల్లోకి వస్తే ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా సాగునీటి రంగంలో కొత్త చరిత్ర సృష్టిస్తుందని మంత్రి అభిప్రాయపడ్డారు. ఈ ప్రాజెక్టుల ద్వారా లక్షలాది ఎకరాలకు సాగునీరు అందడమే కాకుండా భూగర్భ జలాలు పెరిగి గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యలు కూడా గణనీయంగా తగ్గుతాయని తెలిపారు. మహాత్మా గాంధీ ఎత్తిపోతల పథకం ద్వారా అచ్చంపేట, నాగర్కర్నూల్ నియోజకవర్గాల పరిధిలో సుమారు 4 లక్షల 45 వేల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉండగా, గత కొన్నేళ్లుగా కేవలం మూడు మోటార్ల ద్వారానే నీటిని ఎత్తిపోస్తున్న పరిస్థితి నెలకొన్నట్లు మంత్రి తెలిపారు. దీనివల్ల రైతులకు పూర్తిస్థాయిలో ప్రయోజనం అందడం లేదని చెప్పారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా ఎల్లూరు నుంచి నీటిని తరలించే చర్యలు చేపట్టడంతో పాటు మోటార్ల పునరుద్ధరణ, ఆధునీకరణకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రాజెక్టుల నిర్వహణలో సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి సంబంధించిన భూసేకరణ కోసం ఇప్పటికే రూ.650 కోట్ల నిధులను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. దీంతో భూసేకరణ ప్రక్రియ వేగవంతం అవుతోందని ఎంపీ తెలిపారు. రైతులకు న్యాయం జరిగేలా, ప్రాజెక్టు పనులు ఆలస్యం కాకుండా ప్రభుత్వం సమన్వయంతో పనిచేస్తోందని తెలిపారు. నేటి సమీక్ష సమావేశంలో చర్చించిన అంశాలన్నింటినీ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ఎంపీ వెల్లడించారు. నాగర్కర్నూల్ పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి అవసరమైన నిధుల విడుదల, పరిపాలనా అనుమతులు, భూసేకరణ సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా కృషి చేస్తామని తెలిపారు. ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులను కేవలం అభివృద్ధి కార్యక్రమాలుగా కాకుండా రైతుల భవిష్యత్తును మార్చే మహత్తర కార్యక్రమాలుగా భావిస్తోందని సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. . ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాలో సాగునీటి విప్లవానికి నాంది పలికే ఈ ప్రాజెక్టులు పూర్తయితే లక్షలాది మంది రైతుల జీవితాల్లో గుణాత్మక మార్పు చోటుచేసుకోనుందన్నారు. పాలమూరును సస్యశ్యామల జిల్లాగా మార్చాలన్న ప్రభుత్వ సంకల్పం త్వరలోనే ఫలితాలను ఇస్తుందని ఎంపీ ఆశాభావం వ్యక్తం చేశారు.

# బాల్య వివాహ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలి



- **మంత్రి సీతక్క**

**హైదరాబాద్, మనంప్రతినిధిః** తెలంగాణను బాల్య వివాహ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలని మంత్రి సీతక్క సూచించారు.తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆధ్వర్యంలో మిషన్ వాత్సల్య, సక్షమ్ అంగన్వాడీ కార్యక్రమాలపై రాష్ట్ర స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశానికి తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ అధ్యక్షురాలు సీతా దయాకర్ రెడ్డి అధ్యక్షత వహించారు. గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా మరియు మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) ముఖ్య అతిథిగా హాజరై, తెలంగాణ ప్రభుత్వం మహిళలు మరియు పిల్లల సంక్షేమం కోసం అమలు చేస్తున్న వివిధ పథకాల గురించి వివరించారు. బాల్య వివాహాలు ఇంకా కొన్ని ప్రాంతాల్లో జరుగుతున్నందున, శాఖలోని ప్రతి అధికారి మరియు సిబ్బంది వాటి నివారణకు కృషి చేసి తెలంగాణను బాల్య వివాహ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలని మంత్రి సూచించారు. అలాగే పిల్లల రక్షణ చర్యలను మరింత బలోపేతం చేయడం, పిల్లలపై జరుగుతున్న దుర్వినియోగం మరియు పోక్సో కేసులను తగ్గించేందుకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనితా రామచంద్రన్ గారు సమావేశంలో పాల్గొని, మహిళలు మరియు పిల్లల సంక్షేమానికి సంబంధించిన విధానాలను సమర్థవంతంగా అమలు చేయడానికి అధికారులు తమ అత్యుత్తమ సామర్థ్యంతో పనిచేయాలని సూచించారు.

# కుటుంబ పార్టీలకు ప్రజలు చరమగీతం పాడతారు



- **రాజ్యసభ సభ్యులు లక్ష్మణ్**

**గజ్వేల్ జూన్ 20 మనం న్యూస్ :** రాజ్యసభ సభ్యులు, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు డాక్టర్ కె. లక్ష్మణ్ శనివారం గజ్వేల్ పట్టణంలో కురుమ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు బింగి స్వామి నివాసాన్ని సందర్శించి , వివిధ కుల సంఘాల నాయకులతో కలిసి సహపంక్తి భోజనంలో పాల్గొన్నారు. మీడియా సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని, ప్రజాస్వామ్య ప్రక్రియలో వరుసగా మూడు సార్లు ప్రజల మద్దతుతో ప్రధాని అయిన నాయకుడు మోదీయేనని పేర్కొన్నారు. అన్ని వర్గాలకు, అన్ని ప్రాంతాలకు సమన్యాయం చేసిన నాయకుడు మోదీ అని పేర్కొన్న ఆయన, ఆదివాసీ మహిళను రాష్ట్రపతిగా, దళిత నాయకుడిని రాష్ట్రపతిగా, దక్షిణాది ప్రాంతానికి చెందిన ఓబీసీ నాయకుడిని ఉప రాష్ట్రపతిగా చేసిన ఘనత బీజేపీదేనన్నారు. మహిళలకు అత్యున్నత పదవులు కల్పించి సాధికారతకు పెద్దపీట వేసిందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఒక కుటుంబ పార్టీగా మారిందని, నెహ్రూ-గాంధీ కుటుంబ సభ్యులే ప్రధానమంత్రి పదవిని అనుభవించారని విమర్శించారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ అధికార ప్రతినిధి కప్పర ప్రసాద్ రావు, గజ్వేల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్ రామ్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు మనోహర్ యాదవ్, తెలంగాణ జర్నలిస్టు యూనియన్ మెదక్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు దేవులపల్లి ఎల్లయ్య, సిద్దిపేట జిల్లా అధ్యక్షులు మరాటి కృష్ణమూర్తి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు వల్లప్ప శ్రీనివాస్, కరీంనగర్ జిల్లా కన్వీనర్ పెంటి రాజు, మెదక్ జిల్లా అధ్యక్షులు రామయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి తూర్పంటి శీను, ఉపాధ్యక్షులు బాలు భూపతి, రాష్ట్ర నాయకులు సిద్ధల రవి, గజ్వేల్ నియోజకవర్గ అధ్యక్షులు గుడాల శేఖర్, బైరి ప్రభాకర్, వైశ్య సంఘం నాయకులు సత్యనారాయణ, కురుమ సంఘం నాయకులు బొమ్మ మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# 'పది' ప్రతిభావంతులకు గిఫ్టుగా సైకిళ్ళు అందించిన ఎమ్మెల్యే 'గూడెం'



- **రూ.35 లక్షల ఎమ్మెల్యే 'జీఎంఆర్' సొంత నిధులతో 438 విద్యార్థులకు పంపిణీ**

**పటాన్ చెరు, జూన్ 20(మనం న్యూస్) :** పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి విద్యార్థుల కోసం మరో వినూత్న కార్యక్రమాన్ని ఆరంభించారు. పటాన్ చెరు నియోజకవర్గ చరిత్రలోనే మొట్టమొదటిసారి 2025 - 2026 విద్యా సంవత్సరంలో 10వ తరగతి పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ ఫలితాలు సాధించిన 438 విద్యార్థులకు 35 లక్షల రూపాయల సొంత నిధులతో సైకిళ్ల పంపిణీ చేపట్టారు. శనివారం ఉదయం పటాన్ చెరు డివిజన్ పరిధిలోని మైత్రి మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని 48 ప్రభుత్వ పాఠశాలలు, 89 ప్రైవేటు పాఠశాలలో ఇటీవల జరిగిన పదో తరగతి పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన 438 మంది విద్యార్థులకు 35 లక్షల రూపాయల సొంత నిధులతో కొనుగోలు చేసిన సైకిళ్లను ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి చేతుల మీదుగా విద్యార్థులకు అందించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులను ప్రోత్సహించడం ద్వారా ఉన్నత లక్ష్యాల సాధనకు మరింత ఉత్సాహం కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈ విద్యా సంవత్సరం నుండి వినూత్నంగా సైకిల్లు పంపిణీ చేయాలని నిర్ణయం తీసుకున్నామని తెలిపారు.

ఇందుకు అనుగుణంగా పటాన్ చెరు నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ ప్రైవేటు ఉన్నత పాఠశాలలో 10వ తరగతి ఫలితాల్లో ప్రథమ ద్వితీయ తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థినీ విద్యార్థులకు సైకిళ్ళు కొనుగోలు చేసి అందించడం జరిగిందని తెలిపారు. విద్యారంగ అభివృద్ధికి ఎల్లప్పుడూ అండగా నిలుస్తూ, విద్యార్థులకు ఆత్మబంధువుగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సేవలు అందిస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, ఆయా మండలాల విద్యాశాఖల అధికారులు, ప్రైవేటు పాఠశాలల ప్రిన్సిపాళ్లు, కరస్పాండెంట్లు సీనియర్ నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

మనం Manam Editorial సంపాదకీయం

## తెలుగు భాషా వైభవము

నన్నయ మహాకవీంద్రుడు నాడు వ్రాసె
భారతమ్మును తెలుగులో భవ్యముగను
ఆ పిదప తిక్కనార్యుడు, ఆ తదుపరి
సుకవి ఎర్రన ముగియించి శోభ గూర్చె

తెలుగు భాషన్న చో మది పులకరించు.
మధుర మౌ పద్య తతులను మనసు మెచ్చు
తెలుగు భాషలో నెందరో వెలుగు లీన
పద్య కావ్యాలు వ్రాసిరి పరవశాన

'దేశ భాషలలో లెస్స తెలుగ'టంచు
కృష్ణ దేవ రాయలనె నుత్కృష్టముగను
దివ్య మౌ తెల్గు వెల్గు దేదీప్యముగను
ప్రాభవమ్ముగ వ్యాప్తమై ప్రభలు గాక

తెలుగు భాషన్న చో వెల్గు జిలుగు మయము
తెలుగు పద్యాలు జూడగ తీపి యుతము
పద్య, గేయ కావ్యాలతో పదిలముగను
తెలుగు నిరతమ్ము నిల్చును వెలుగులీన

**- వడ్ల వీరాచారి**
8897182796

**ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు**
**manamlekhalu@gmail.com**
**మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.**

**ఈ పేపర్ కోసం**
**https://www.manamepaper.com/**
**వెబ్‌సైట్‌లో చూడండి**

**- ఎడిటర్**

# తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్



నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల్లో 'ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఆకాంక్ష'ను రగిలించిన చైతన్యస్ఫూర్తి ప్రొఫెసర్ జయశంకర్. ' నీళ్లు, నిధులు, నియామకాలు' అనే ఈ నినాదాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి తెలంగాణ స్వరాష్ట్ర చైతన్య జ్వాలలను రగిలించిన ధిక్కారస్వరం ఆయన. 'తెలంగాణ కేవలం రాజకీయ సమస్య కాదు. సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక సమస్య. అన్నింటికి మించి ఆత్మగౌరవ సమస్య' అని ఎలుగెత్తి నినదించిన పోరాటయోధుడు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన పోరాట క్రమంలో అడుగడుగునా ఎన్నో అడ్డంకులు ఎదురైననూ ఆయన వాటన్నింటిని ప్రతిఘటించి ముందుకు సాగిపోయారు తప్ప ఆయన ఏనాడు వెనకడుగు వేయలేదు. 'మా వనరులపై మాకు అధికారం కావాలి. మా తెలంగాణ మాగ్గావాలి' అని ప్రొఫెసర్ జయశంకర్ తన జీవితమంతా అవిశ్రాంతంగా ఉద్యమించారు.

'తెలంగాణ సిద్ధాంతకర్త'గా ప్రాచుర్యం పొందిన ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ 1934 ఆగష్టు 6 నాడు మహాలక్ష్మి, లక్ష్మీకాంతరావు దంపతులకు రెండవ సంతానంగా జన్మించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా ఆత్మకూరు మండలం లోని అక్కంపేట ఆయన స్వగ్రామం. ప్రొఫెసర్ జయశంకర్ బెనారస్ యూనివర్శిటీ నుంచి ఆర్థిక శాస్త్రంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పట్టా పొంది ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ పూర్తి చేశారు. తెలంగాణకు జరుగుతున్న అన్యాయాల పట్ల, అసమానతల పట్ల ప్రొఫెసర్ జయశంకర్ విద్యార్థి దశ నుండే తీవ్రంగా స్పందించి నినదించారు. ఆయన విద్యార్థి నాయకుడిగా తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారు. ఇడ్లీ - సాంబర్ గో బ్యాక్' అంటూ ఆయన నినదించారు. నాన్ ముల్కీ ఉద్యమంలోనూ ఆయన ప్రముఖ పాత్ర పోషించారు. విశాలాంధ్ర ప్రతిపాదనను వ్యతిరేకించి మొదటి ఎస్సార్సీ కమిషన్ ముందు హాజరై 'ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం' ఆకాంక్షను ఆయన ఆనాడే నొక్కి చెప్పారు.

వరంగల్లో విప్లవ విద్యార్థి ఉద్యమానికి కేంద్రంగా ఉన్న వరంగల్‌లోని చంద్రాకాంతయ్య స్మారక కళాశాలకు (సి.కె.ఎం) 1975 నుంచి 1979 వరకు ప్రొఫెసర్ జయశంకర్ ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. ఆ ఎమర్జెన్సీ కాలంలో ఆయన అనేక మంది విద్యార్థుల్ని మరియు అధ్యాపకుల్ని నిర్బంధం నుండి కాపాడారు. ప్రొఫెసర్ జయశంకర్ 1979 నుండి 1981 వరకు కాకతీయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ గాను, 1982 నుంచి 1991 వరకు సీఫెల్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ గాను, 1991 నుంచి 1994 వరకు సీఫెల్ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ గాను బాధ్యతలు నిర్వహించారు.




1969 లో తెలంగాణ రాష్ట్ర తొలి దశ ఉద్యమానికి మరియు 1996 లో ప్రారంభమైన తెలంగాణ రాష్ట్ర మలి దశ ఉద్యమానికి ప్రొఫెసర్ జయశంకర్ నాయకత్వం వహించి ముందుండి నడిపారు. 1999లో తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరమ్‌ను ఏర్పాటు చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. తెలంగాణ సమస్యలపై పరిశోధన, ప్రచురణలో భాగమైన తెలంగాణ అధ్యయన కేంద్రానికి ఛైర్మన్‌గాను ఆయన పని చేశారు. అసంఘటిత రంగంలోని సంస్థల జాతీయ కమిషన్‌లో సభ్యుడిగాను 2004-2006 వరకు ఆయన కొనసాగారు. తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ ఏర్పాటులో కల్వకుంట్ల చంద్రశేఖరరావుకు ప్రొఫెసర్ జయశంకర్ మార్గదర్శకులుగా వ్యవహరించి తెలంగాణ రాష్ట్ర సాధనకు 'సరికొత్త ఊపిరి'ని అందించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకతపై నియ మించబడ్డ అనేక కమిటీలకు గణాంకాలతో సహా పలు నివేదికలు ఆయన అందించారు.

తెలుగు, ఉర్దూ, హిందీ, ఇంగ్లీషు భాషల్లో విశేష ప్రావీణ్యం ఉన్న ప్రొఫెసర్ జయశంకర్ 'ప్రత్యేక తెలంగాణా రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకత'ను నొక్కి చెప్తూ తెలంగాణ రాష్ట్రం ఒక డిమాండ్, వక్రీకరణలు-వాస్తవాలు, తల్లడిల్లుతున్న తెలంగాణ (వ్యాస సంపుటి) తదితర రచనలు చేశారు. ప్రపంచమంతా పరివ్యాప్తమయ్యేలా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకత గురించి ఆయన అనేక వ్యాసాలు రాశారు. అలాగే ఉపన్యాసాల ద్వారా కూడా తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పలు జాతీయ, అంతర్జాతీయ వేదికల మీద గళం విప్పారు.

ప్రొఫెసర్ జయశంకర్‌ను అందరూ 'తెలంగాణ సిద్ధాంతకర్త'గా భావించేవారు. కాని 'నన్ను ఎప్పుడూ నేను సిద్ధాంతకర్తగాను భావించుకోలేదు. నేను తెలంగాణ సిద్ధాంతకర్తను కాను. నన్ను ఆ విధంగా సంభోదించకండి' అని ఆయన అనేక సందర్భాల్లో పేర్కొన్ననూ ఆయన జనం నోళ్లలో 'తెలంగాణ సిద్ధాంతకర్త'గా ప్రతిధ్వనిస్తూనే ఉన్నారు. 'ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కళ్లారా చూసిన తర్వాతే చనిపోవాలి' అని ప్రొఫెసర్ జయశంకర్ తన సన్నిహితుల వద్ద తరచుగా ప్రస్తావించేవారు. కాని ఆయన ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం కాకముందే 2011 జూన్ 21 నాడు మరణించారు.

తన జీవితాన్ని యావత్ తెలంగాణ కోసం అంకితం చేసి ఆజన్మ బ్రహ్మచారిగా జీవించి ప్రత్యేక తెలం గాణ రాష్ట్రం ఆవిర్భావం కోసం తుదిశ్వాస విడిచేవరకు ఉద్య మించిన ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర చరిత్రలో మహో జ్వలంగా వెలుగొందుతూనే ఉన్నారు. అంతే కాకుండా అనేక ప్రజాస్వామిక ఉద్యమాలకు ఆయన ఒక 'దారిదీపం'లా ప్రభవిస్తున్నారు. అంతిమంగా ప్రగతిశీల తెలంగాణ ప్రజానీకం భౌగోళిక తెలంగాణాని బద్దలు కొట్టి 'ప్రజాస్వామిక తెలంగాణ'ని సాకారం చేసే దిశగా ఉద్యమించడమే ఆయనకు అందించే నిజమైన నివాళి కాగలదు.

(జూన్ 21 ప్రొఫెసర్ జయశంకర్ 15 వ వర్ధంతి)

**- జె.జె.సి.పి. బాబూరావు**
94933 19690

# భాషాశాస్త్ర దిక్సూచి...భద్రిరాజు



భద్రిరాజు కృష్ణమూర్తి - తెలుగు భాషాశాస్త్ర రంగంలో వెలుగొందిన ప్రఖ్యాత పండితుడు. ద్రావిడ భాషల తులనాత్మక అధ్యయనం, శబ్ద నిర్మాణ విశ్లేషణ, వ్యాకరణ రూప పరిణామం వంటి విభాగాలలో ఆయన సాధించిన శాస్త్రీయ పరిశోధనలు భారత భాషాశాస్త్ర పరిణామాన్ని విశ్వవేదికలపై ప్రతిష్ఠాపించాయి. భాషలను కేవలం వాడుకకే పరిమితం కాక, వాటి మూలాలకు, నిర్మాణాలకు అర్థం తెలిపేలా చేసిన పరిశోధనల్లో ఆయన పాత్ర అపూర్వమైనది.

ఆంధ్రప్రదేశ్ తూర్పుగోదావరి జిల్లాలోని వెలుగుబండ గ్రామంలో 1928 జూన్ 19న జన్మించిన భద్రిరాజు చిన్ననాటి నుంచే బుద్ధిమంతుడిగా గుర్తింపు నందుకున్నారు. పిఠాపురం వయోజన విద్యాసంస్థల ద్వారా ప్రాథమిక విద్యనభ్యసించిన ఆయన, అనంతరం బెనారస్ హిందూ విశ్వ విద్యాలయంలో సంస్కృతంలో ఎం.ఎ. పూర్తి చేశారు.

ఆ తర్వాత అమెరికాలోని కాలిఫోర్నియా విశ్వ విద్యాలయం, బర్కిలీ నుండి భాషా శాస్త్రంలో పి.హెచ్.డి. పొందారు. అక్కడ ఆయన చార్లెస్ హాకెట్, ముర్రే ఎమెన్యూ వంటి భాషా శాస్త్రవేత్తల శిక్షణలో శాస్త్రీయ దృక్పథాన్ని సంపాదించారు.

ఆయన విద్యా, పరిశోధనా ప్రస్థానం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగు, ద్రావిడ భాషాశాస్త్ర విభాగానికి ప్రొఫెసర్‌గా కొనసాగింది. 1962 నుండి 1988 వరకు ఆయన ఆచార్య పదవిలో ఉన్నారు. ఈ కాలంలో తెలుగు భాషాశాస్త్ర అధ్యయ నానికి కొత్త వెలుగు చూపించి, పరిశోధనలకు మార్గనిర్దేశం చేశారు. భాషను శాస్త్రీయంగా అధ్యయనం చేయాలన్న దృక్పథాన్ని ఆయన విద్యార్థులకు నాటించారు. ఆయన శిష్యులలో ఎందరో నేటికీ వివిధ విశ్వవిద్యాలయాలలో ప్రఖ్యాతులుగా ఉన్నారు.

1961లో ప్రచురితమైన Telugu Verbal Bases అనే గ్రంథం ఆయనకు అంతర్జాతీయ ఖ్యాతిని తెచ్చిపెట్టింది. తెలుగు క్రియారూపాల తులనాత్మక అధ్యయనం, ద్రావిడ మూలాల అన్వేషణ ఈ గ్రంథంలో శాస్త్రీయంగా విశ్లేషించబడింది. తరువాత కాలంలో వచ్చిన "Comparative dravidian Linguistics: Current Pers pectives", "The dravidian Languages", "A Grammar of Modern Telugu" వంటి గ్రంథాలు ద్రావిడ భాషాశాస్త్ర విభాగంలో ప్రామాణిక గ్రంథాలుగా నిలిచాయి.

భద్రిరాజు కృష్ణమూర్తి పరిశోధనలు భాష శాస్త్రపు వివిధ విభాగాలకు వ్యాపించాయి - వ్యాకరణ శాస్త్రం, శబ్ద నిర్మాణం, భాషా పరిణామ క్రమం, మాండలిక అధ్యయనం, శాసనాల్లోని భాషా పరమైన అంశాల విశ్లేషణ మొదలైన అంశాలలో ఆయన సుదీర్ఘంగా కృషి చేశారు. భాషను కేవలం వ్యాకరణ పరిమితుల్లో కాక, సంస్కృతి, చరిత్ర, సమాజంతో ముడిపెట్టి అధ్యయనం చేసిన ఆయన దృక్పథం ఎంతో విశాలమైనది.

కేంద్ర భాషా సంస్థ, మైసూరుకు తొలి డైరెక్టర్‌గా పనిచేసిన ఆయన, భారత భాషల అధ్యయనానికి సాంకేతిక, శాస్త్రీయ దిశల్ని సూచించారు. భారత ప్రభుత్వ భాషా కమిషన్, సాహిత్య అకాడమీ, యునెస్కో భాషా ప్రాజెక్టుల్లో సలహాదారుడిగా కీలకంగా పని చేశారు. అంతర్జాతీయ విశ్వ విద్యాలయాల్లో అతిథి అధ్యాపకుడిగా సేవలందించారు. ఆయనకు లభించిన పురస్కారాలు ఆయన గొప్పతనానికి నిదర్శనంగా నిలిచాయి.

కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం (1993), పద్మభూషణ్ (2000), భాషా గౌరవ పురస్కారాలతో పాటు అనేక విశ్వ విద్యాలయాల నుండి గౌరవ డాక్టరేట్లు పొందారు. 2012 ఫిబ్రవరి 1న భద్రిరాజు కృష్ణమూర్తి గారు మృతి చెందినా, ఆయన చేసిన కృషి శాశ్వతంగా భాషా ప్రపంచంలో నిలిచిపోతుంది. ఆయన జీవితం భాషాపరంగా పరిశోధన చేయాలనుకునే ప్రతిభావంతుల కోసం మార్గదర్శక దీపంలా నిలుస్తుంది. భద్రిరాజు కృష్ణమూర్తి గారి పేరే భారత భాషాశాస్త్ర వికాసానికి ప్రతీకగా నిలిచి ఉంది.

**- రామ కిష్టయ్య సంగన భట్ల**
9440595494

# ఘర్షణల నుంచి సంభాషణల దిశగా...



ప్రపంచ రాజకీయాల్లో కొన్ని పరిణామాలు కేవలం వార్తలుగా మాత్రమే మిగలవు; అవి అంతర్జాతీయ సంబంధాల భవిష్యత్తును నిర్దేశించే మలుపులుగా నిలుస్తాయి. ఇటీవల పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల మధ్య అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన కాల్పుల విరమణ ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య పెరిగిన ఉద్రిక్తతలు మరింత విస్తరించే ప్రమాదం ఉందన్న ఆందోళనల మధ్య వెలువడిన ఈ పరిణామం అంతర్జాతీయ సమాజానికి కొంత ఊరటనిచ్చింది. అయితే ఇది కేవలం ఒక రాజకీయ ప్రకటనగా కాకుండా, ఘర్షణల నుంచి సంభాషణల వైపు ప్రపంచం మళ్లవలసిన అవసరాన్ని గుర్తు చేసిన సందర్భంగా కూడా చూడాలి. పశ్చిమాసియా ప్రాంతం ప్రపంచ రాజకీయ, ఆర్థిక వ్యవస్థలకు అత్యంత కీలకమైన ప్రాంతం. ఇక్కడ ఏర్పడే ప్రతి ఉద్రిక్తత ప్రపంచ ఇంధన మార్కెట్లపై, వాణిజ్య మార్గాలపై, పెట్టుబడుల ప్రవాహంపై ప్రభావం చూపుతుంది. ముఖ్యంగా హార్ముజ్ జలసంధి వంటి వ్యూహాత్మక మార్గాల భద్రతకు సంబంధించిన ప్రశ్నలు తలెత్తినప్పుడల్లా ప్రపంచ దేశాలు అప్రమత్తమవుతాయి. అందువల్ల అక్కడి పరిస్థితులు కేవలం ప్రాంతీయ అంశాలుగా కాకుండా అంతర్జాతీయ స్థిరత్వంతో ముడిపడి ఉంటాయి.ఇటీవలి పరిణామాల్లో పరస్పర దాడులు, ప్రతిదాడులు, భద్రతా ఆందోళనలు, దౌత్యపరమైన ప్రకటనలు వరుసగా చోటుచేసుకున్నాయి. పరిస్థితి మరింత దిగజారితే ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అనిశ్చితి పెరిగే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. అలాంటి సమయంలో కాల్పుల విరమణకు సంబంధించిన ప్రకటన రావడం ఉద్రిక్తతలను తగ్గించే దిశగా ఒక ముఖ్యమైన అడుగుగా భావించవచ్చు. అయితే శాంతి అనేది ఒక్క ప్రకటనతో సాధ్యమయ్యే విషయం కాదు. అది పరస్పర విశ్వాసం, నిరంతర సంభాషణలు, బాధ్యతాయుత దౌత్యం ద్వారా మాత్రమే బలపడుతుంది.చరిత్ర చెబుతున్న ఒక ముఖ్యమైన సత్యం ఏమిటంటే, యుద్ధాలు తాత్కాలిక విజయాలను ఇవ్వవచ్చు; కానీ స్థిరమైన పరిష్కారాలను ఇవ్వలేవు. చివరికి అన్ని పక్షాలు చర్చల బల్లవద్దకే రావాల్సి వస్తుంది. అందుకే ప్రపంచ నాయకత్వం ఘర్షణలను విస్తరించే ప్రయత్నాల కంటే, పరిష్కారాలను అన్వేషించే ప్రయత్నాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. శక్తి ప్రదర్శన కంటే సంయమనం, ప్రతీకారం కంటే పరస్పర అవగాహన, ఉద్రిక్తత కంటే స్థిరత్వం ప్రపంచానికి మరింత అవసరం.ప్రపంచం నేడు ఎదుర్కొంటున్న సవాళ్లు దేశాలు ఒంటరిగా పరిష్కరించగలిగేవి కావు. ఇంధన భద్రత, ఆర్థిక స్థిరత్వం, వాతావరణ మార్పులు, అంతర్జాతీయ వాణిజ్యం వంటి అంశాలు సమిష్టి సహకారాన్ని కోరుతున్నాయి. అందువల్ల ఏ ప్రాంతంలోనైనా శాంతి నెలకొనడం ప్రపంచ శ్రేయస్సుకు దోహదపడుతుంది. పశ్చిమాసియాలో తాజా పరిణామాలు కూడా ఇదే సందేశాన్ని ఇస్తున్నాయి.శాంతి అనేది బలహీనతకు గుర్తు కాదు. అది పరిపక్వతకు నిదర్శనం. ఘర్షణలతో సాధించలేనిదాన్ని సంభాషణలు సాధించగలవు. అందువల్ల ప్రపంచ దేశాలు విభేదాల కంటే సంభాషణలకు, అనుమానాల కంటే విశ్వాసానికి, ఘర్షణల కంటే సహకారానికి ప్రాధాన్యం ఇచ్చినప్పుడే స్థిరమైన శాంతి సాధ్యమవుతుంది. నేటి ప్రపంచానికి అత్యంత అవసరమైనది అదే.

**- చిటికెన కిరణ్ కుమార్**
9490841284

# శరీరాన్ని మనసును ఏకం చేయడమే యోగా

యోగా అనే పదం సంస్కృతం నుంచి వచ్చింది. 'యుజ అనే పదం నుంచి వచ్చింది. యుజ అంటే దేన్నయినా ఏకం చేయడం.. లేదా చేరడం అని అర్థం. అంటే.. శరీరాన్ని, మనసును ఏకం చేయడమే యోగా ఉద్దేశం. జూన్ 21నే యోగాడేను జరు పుకోవడానికి పెద్ద కారణమే ఉంది. జూన్ 21.. ఉత్తరా ర్ధగోళంలో అత్యధిక పగటి సమయం ఉన్న రోజు. ప్రపంచం లోని పలు ప్రాంతాల్లో ఆ రోజుకు పగలు ఎక్కువగా ఉన్న రోజుగా ప్రత్యేకత కూడా ఉంటుంది. ఆ గుర్తింపు తోనే .. అదే రోజును 'అంతర్జాతీయ యోగా దినోత్సవం'గా జరుపు కోవాలని నిర్ణయించారు. యోగా ఇప్పటిదేమీ కాదు.. దాదాపు 5000 ఏళ్ల నాటి చరిత్ర ఉంది యోగాకు. యోగను శాస్త్రీయంగా క్రోడీకరించిన వారిలో ఆద్యుడు పతంజలి అష్టాంగ యోగా, అయ్యంగార్, విన్యాస యోగా కూడా ఈ క్రమంలో రూపు దిద్దుకున్నవే. 'అ ' పతంజలి మహర్షి సిద్ధం చేశారని చెబుతారు. ఉపనిషత్తులలోను, భగవద్గీతలోను యోగా ప్రస్తావన ఉంది. మొండి రోగాలను సైతం నయం చేయగల మహత్తర శక్తి యోగా ఉందని పరిశోధనల్లో తేలింది. యోగా చేయడం వల్ల శారీరకంగా, మానసికంగా, ఆధ్యాత్మికంగా ఎన్నో ప్రయోజనాలు ఉంటాయి. యోగా వల్ల కలిగే ఆ ప్రయోజనాల గురించి ప్రజలను చైతన్యం చేయడమే 'యోగా డే' ముఖ్య ఉద్దేశం. యుగయుగాలుగా మన సనాతన భారత సంప్రదాయంలో ఇమిడి ఉండి, పూర్వీకులెందరో తమ శారీరక, మానసిక ఉల్లాసానికి అనాదిగా ఆచరించిన సాధనం 'యోగ సాధన'. ప్రాచీన కాలం నుండి ఎందరో మునులు, యతులు, ఋషులు, యోగులు తమ తపోనిష్టకు అనారోగ్యం అడ్డు కాకుండా కనిపెట్టిన 'ఆసనాలు', ఆచరించిన శ్వాస సంబంధిత 'ప్రాణాయామాలు, క్రమంగా మనకు 'యోగా' పాఠాలుగా మారాయి అనడం అతిశయోక్తి కాదు ఆ కాలంలోనే 'పతంజలి' మహర్షి మన వేదాలు, ఉపనిషత్తుల ఆధారంగా స్వయంగా 'యోగ దర్శిని' అనే గ్రంథాన్ని రచించారు. ఈ తాళ పత్ర గ్రంథం ఆధారంగానే ప్రపంచ వ్యాప్తంగా, ఎందరో యోగా గురువులు తమ సాధనలను, అనుభవాలను రంగరించి వేలాది యోగా పుస్తకాలను రంచించారు. ఇంకా రచిస్తూనే ఉన్నారు. పతంజలి మహర్షి భావనలో యోగా అనేది 'అష్టాంగ యోగం'. అంటే ఈ యోగా అనే శాస్త్రాన్ని 'యమము, నియమము, ఆసనము, ప్రాణాయామము, ప్రత్యాహారము, ధారణ, ధ్యానం, సమాధి అనే ఎనిమిది భాగాలుగా విశ్లేషించి చెప్పారు పతంజలి మహర్షి. ఈ ప్రాచీన పద్ధతులను ఆచరిస్తూ విశ్వవ్యాప్తంగా ఎందరో యోగ సాధకులుగా, యోగా గురువులుగా కొనసాగుతున్నారు. యోగాకు సంబంధించిన యోగశాస్త్రాన్ని ప్రపంచానికి పరిచయం చేసింది భారతీయులే. భారతదేశంలో పురుడు పోసుకున్న యోగా నేడు ప్రపంచమంతా పాకింది. ఐదు సహస్రాబ్దాలకు పైగా భారతీయ జీవన విధానంలో అంతర్భాగమైన యోగవిద్యను యావత్ ప్రపంచం ఎప్పటి నుంచో అనుసరిస్తుంది. అందుకే.. యోగాను ప్రపంచ వ్యాప్తం చేయడం కోసం ప్రతి సంవత్సరం యోగాడేను నిర్వహిస్తారు. ప్రతి సంవత్సరం ఒక నినాదంతో యోగా డేను నిర్వహిస్తారు. 2500 ఏళ్ల క్రితం సాధువులు యోగా సాధనలు చేసేవారని యూనివర్సిటీ ఆఫ్ లండన్ కు చెందిన పరిశోధకుడు, సీనియర్ అధ్యాపకుడు డాక్టర్ జిమ్ మల్లిన్సన్ అభిప్రాయం. ఆయన యోగా చరిత్ర మీద అధ్యయనం చేస్తున్నారు. అప్పట్లో స్థిరంగా ఒక భంగిమలో ఉంటూ యోగా చేసేవారని, ప్రస్తుతం యోగా శిక్షణ కేంద్రాల్లో మనం చూస్తున్న శారీరకపరమైన ఆసనాలు అప్పట్లో ఉండేవి కాదని మల్లిస్సన్ వివరించారు. జూన్ 21 న యోగా దినోత్సవం జరపాలని ఐక్యరాజ్యసమితికి ప్రధాని మోదీ సూచించారు. 2014లో మోదీ ఐక్యరాజ్య సమితికి ప్రతిపాదించడంతో తొలి అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని 2015లో నిర్వహించారు. 2015, జూన్ 21 ప్రపంచ వ్యాప్తంగా మొదటి అంతర్జాతీయ యోగా డేను నిర్వహించారు. భారత్లో ప్రధాని మోదీ.. న్యూఢిల్లీ లోని రాజఘ్ లో నిర్వహించారు. ఆ వేడుకలకు చాలా దేశాలకు చెందిన నేతలు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. ఆరోజు ప్రధాని మోదీతో పాలు వేల మంది యోగా చేశారు. 84 దేశాల నుంచి వచ్చిన నేతలతో పాటు మొత్తం 35985 మంది ఆరోజు మోదీతో పాటు యోగా చేసి రెండు గిన్నిస్ రికార్డులను నెలకొల్పారు. ఉరుకుల పరుగుల జీవితంలో ప్రశాంతత లేకుండా పోతోందని చాలామంది అంటుంటారు. కానీ, రోజూ సమయం దొరికనప్పుడు చిన్నచిన్న యోగా ఆసనాలు వేయడం మొదలుపెడితే ప్రశాంతత మెరుగు పడుతుంది. గడచిన శతాబ్ద కాలంలో ప్రపంచీకరణలో భాగంగా యోగా కూడా అనేక రూపాలు తీసుకుంది. విభిన్నమైన కొత్త ఆసనాలు ఆచరణలోకి వచ్చాయి. చాలా దేశాల్లో యోగాకు ప్రాధాన్యత కూడా బాగా పెరిగింది. నిత్యం మన దైనందిన జీవితంలో ఎదురయ్యే



పలురకాల వ్యాపకాల మూలంగా తెలియకుండానే మనం శారీరక, మానసిక రుగ్మతలకు గురవుతుండడం సహజం. తద్వారా అనారోగ్యంతో రోగాల బారిన పడడమే కాకుండా మానసిక ఆందోళనలతో ప్రశాంతతను కోల్పోవడం కూడా జరుగుతుంది. ప్రస్తుత తరుణంలో 'యోగ' సాధనకు మించిన సాధనం మరొకటి లేదని నిస్సంకోచంగా చెప్పవచ్చు. 'యోగా'తో శారీరక మానసిక రుగ్మతలకు చెక్ పెట్టి అసలైన ఆరోగ్య, ఆనంద 'యోగా'న్ని మనం సంపూర్ణంగా అనుభవించవచ్చు. ఏ ఆసనం ఎలా వేయాలో అవగాహన ఉంటే చాలు... యోగాను ఎవరైనా, ఎప్పుడైనా, ఎక్కడైనా సాధన చేయొచ్చు. యోగాకు వయసు అడ్డంకి కాదు. చాలామంది ఏడు పదుల వయసులో యోగా చేయడం మొదలుపెడతారు. తాము ఇంకా ముందే ప్రారంభించి ఉంటే బాగుండేదని వారు చెబుతుంటారు. అన్ని వయసుల వారికీ ప్రత్యేకంగా కొన్నిరకాల యోగా ఆసనాలు ఉంటాయి. యోగా అనేది ఒక రకమైన 'వ్యాయామం'. అది చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు ఎవరైనా చేయొచ్చు. శారీరక వైకల్యంతో కుర్చీలోంచి లేవలేని వారికోసం కూడా ప్రత్యేకంగా 'ఛైర్ యోగా' ఉంది. పతంజలి మహర్షి 'యోగ దర్శిని' ఆధారంగా హరిద్వార్ కేంద్రంగా 'రాందేవా బాబా' స్థాపించిన పతంజలి యోగా ఆశ్రమం కేవలం మన దేశంలోనే కాకుండా విదేశాల్లోనూ యోగా కేంద్రా లను నడుపుతున్నది. శారీరకంగా దృఢంగా ఉన్నవారే యోగా చేయాలన్న షరతు కూడా ఏమీ లేదు. యోగాలో అనేక రకాల ఆసనాలు ఉన్నాయి. ఫిట్నెస్ కు తగ్గట్టుగానే ఆసనాలను ఎంచు కోవచ్చు. యోగాతో మనసుకు ప్రశాంతత, విశ్రాంతి లభిస్తుంది. దాంతో, మానసిక ఆరోగ్యం మెరుగయ్యే అవకాశం ఉంటుంది. ఆసనం వేసి స్థిరంగా ఉండటం వల్ల శరీర అవయ వాలకు మనసుకు మధ్య సమన్వయం మెరుగు పడుతుంది. ఏకాగ్రత పెరుగుతుంది. శరీరంలో నొప్పులు తగ్గేందుకు ప్రెగ్నెన్సీ యోగా ఉపయోగ పడుతుంది. నిద్ర బాగా పడుతుంది. 'ప్రసవానంతర యోగా' ద్వారా మహిళలు త్వరగా మామూలు స్థితికి వచ్చేందుకు వీలుంటుంది. విద్యార్థులు రోజూ యోగా చేస్తే జ్ఞాపకశక్తి పెరిగే అవకాశం ఉంటుంది. మెదడు చురుగ్గా పని చేస్తుంది. యోగాసనాల వల్ల రక్త ప్రసరణ మెరుగవుతుంది. శరీరం నుంచి. వ్యర్థాలు వేగంగా బయటకు వెళ్లిపోతాయి. శారీరక పరమైన సాధనలతో కండారాలు దృఢంగా తయారవుతాయి.

**జూన్ 21...ప్రపంచ యోగా దినోత్సవం**

**- ఆర్కేఎస్**
9440595494

# జిల్లాలోని ప్రతి చిన్నారికి ఆరోగ్య భద్రత కల్పించడమే లక్ష్యం

**జూన్ 28న పల్స్ పోలియో బూత్ డే, 29-30 తేదీల్లో ఇంటింటి సందర్శనలను పకడ్బందీగా చేపట్టాలి**

**జూలై 13న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం, జూలై 20న మాప్-అప్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి**

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**



**పెద్దపల్లి, జూన్ 20 (మనం ప్రతినిధి):** జిల్లాలోని ప్రతి చిన్నారికి ఆరోగ్య భద్రత కల్పించడమే లక్ష్యంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం, పల్స్ పోలియో కార్యక్రమం, పెద్దపల్లి, గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రులలో అందుతున్న వైద్య సేవల పై సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షసమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, జూన్ 28, 2026న పల్స్ పోలియో బూత్ డే నిర్వహించి, జూన్ 29, 30 తేదీలలో ఇంటింటి సందర్శనలు చేపట్టనున్నట్లు తెలిపారు. జిల్లాలోని 0 నుండి 5 సంవత్సరాల లోపు 62,902 మంది చిన్నారులకు పోలియో నిరోధక రెండు చుక్కల మందు అందించడమే లక్ష్యమని పేర్కొన్నారు.జిల్లాలో మొత్తం 8,38,373 జనాభా, 1,98,242 కుటుంబాలు ఉండగా, పోలియో కార్యక్రమం నిర్వహణ కోసం 381 పోలియో బూత్లు, 25 మొబైల్ బృందాలు, 24 ట్రాన్సిట్ పాయింట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.పట్టణ, గ్రామీణ, గిరిజన ప్రాంతాలతో పాటు వలస కూలీల పిల్లలు, పట్టణ మురికివాడల పిల్లలు, నిర్మాణ స్థలాలు, ఇటుక బట్టీలలో నివసించే కుటుంబాల పిల్లలు, గతంలో పోలియో చుక్కలు వేయించని పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు.పంచాయతీ కార్యదర్శులు, అంగన్వాడీ టీచర్లు, వార్డు సభ్యులు సమన్వయంతో పనిచేసి తమ పరిధిలోని ప్రతి చిన్నారికి పల్స్ పోలియో చుక్కలు అందేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు.పోలియో కార్యక్రమం జరిగే రోజుల్లో విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని, బస్ స్టాండ్లు, రైల్వే స్టేషన్లలో ట్రాన్సిట్ బృందాలు ఏర్పాటు చేసి ప్రయాణికుల పిల్లలకు పోలియో చుక్కలు అందించాలని సూచించారు. సంక్షేమ, విద్యాశాఖలు పూర్తి సహకారం అందించాలని కోరారు.అనంతరం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం నిర్వహణపై సమీక్షిస్తూ, జూలై 13, 2026న ప్రధాన కార్యక్రమం, జూలై 20న మాప్-అప్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని 1 నుండి 19 సంవత్సరాల వయస్సు గల 2,27,251 మంది పిల్లలు, కిశోరులకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు వివరించారు.నులిపురుగుల వల్ల కలిగే రక్తహీనత, పోషకాహార లోపం, ఎదుగుదల సమస్యలను నివారించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. దీని ద్వారా పిల్లల ఆరోగ్యం, రోగనిరోధక శక్తి, చదువుపై ఏకాగ్రత మెరుగుపడతాయని తెలిపారు.1 నుండి 2 సంవత్సరాల పిల్లలకు అర మాత్ర, 2 సంవత్సరాలు పైబడిన వారికి పూర్తి మాత్ర ఇవ్వాలని, 3 సంవత్సరాలు పైబడిన పిల్లలు మాత్రను నమిలి మింగేలా చూడాలని సూచించారు.ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, అంగన్వాడీ కేంద్రాలతో పాటు జిల్లాలోని అన్ని గురుకుల పాఠశాలలు, వసతి గృహాలలోని విద్యార్థులకు కూడా నులిపురుగుల నివారణ మాత్రలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.మండల స్థాయిలో ఎంపీడీవోలు, ఎంపీఓలు, ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు, ఆరోగ్య శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు ఇతర లైన్ డిపార్ట్మెంట్ అధికారులతో సమన్వయంతో పనిచేసి పల్స్ పోలియో కార్యక్రమం, జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.అర్హులైన ఏ ఒక్క చిన్నారి కూడా ఈ కార్యక్రమాలకు దూరం కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.అనంతరం పెద్దపల్లి, గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రులలో అందుతున్న వైద్య సేవలపై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.ఆసుపత్రులలో అవసరమైన మరుగుదొడ్లు పూర్తిస్థాయిలో పనిచేసేలా చూడాలని, మరమ్మతులు లేదా పునరుద్ధరణ అవసరమైతే అంచనా వ్యయ ప్రతిపాదనలు వెంటనే సమర్పించాలని ఆదేశించారు. ఆసుపత్రుల నిర్వహణకు అవసరమైన ప్లంబర్లు, అదనపు సిబ్బంది అవసరాలపై ప్రతిపాదనలు పంపించాలని సూచించారు.గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రిలో నేత్ర వైద్య సేవలు ప్రారంభించి, కంటి శస్త్రచికిత్సలు కూడా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అవసరమైన డెంటల్ పరికరాలు, డెంటల్ చెయిర్లను త్వరితగతిన సమకూర్చాలని సూచించారు.వైద్యుల అందుబాటు పూర్తిస్థాయిలో ఉండాలని, వైద్యులు అందుబాటులో లేరనే పరిస్థితి వార్తలకు కారణం కాకూడదని స్పష్టం చేశారు.

ఆసుపత్రులలో పారిశుధ్యాన్ని అత్యున్నత ప్రాధాన్యతగా తీసుకోవాలని, రోగులకు అవసరమైన పరీక్షలు క్రమం తప్పకుండా నిర్వహించాలని ఆదేశించారు. ఓపీ సేవలు రద్దీ లేకుండా క్యూవిధానంలో క్రమబద్ధంగా నిర్వహించాలని సూచించారు.అదనపు అంబులెన్స్ సమకూర్చేందుకు అవసరమైన ప్రతిపాదనలు పంపించాలని అధికారులను ఆదేశించారు. బయో మెడికల్ వ్యర్థాల నిర్వహణలో నిర్దేశిత మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.రాబోయే రెండు నెలలకు అవసరమైన మందులు, సిరంజీలు, ఇతర వైద్య పరికరాల అవసరాలపై సమగ్ర నివేదికను సిద్ధం చేసి సమర్పించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో పెద్దపల్లి జిల్లా ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్. శ్రీధర్, గోదావరిఖని ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్. హిమబిందు సింగ్, సంబంధిత శాఖల అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ వ్యవసాయాభివృద్ధికి జగిత్యాల జిల్లా ఆదర్శం

- **డిజిటల్ సేవలు - పారదర్శక పాలన - రైతు సంక్షేమమే లక్ష్యం**
- **రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యాలకు చేరువలో జగిత్యాల జిల్లా**
- **మొబైల్ యాప్లో యూరియా బుక్ చేసుకోవడంలో జిల్లా రైతుల ఆసక్తి**




**జగిత్యాల, జూన్ 20 (మనం ప్రతినిధి):** తెలంగాణ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వ్యవసాయ రంగానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తూ రైతు సంక్షేమం, అభివృద్ధి కోసం అనేక వినూత్న కార్యక్రమాలను అమలు చేస్తోంది. రైతుభరోసా , రైతుబీమా, ఉచిత విద్యుత్, సాగునీటి ప్రాజెక్టులు, వ్యవసాయ యాంత్రీకరణ వంటి కార్యక్రమాలతో పాటు ఇటీవల వ్యవసాయ సేవలను డిజిటలైజేషన్ దిశగా తీసుకెళ్తోంది. ఈ క్రమంలో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఆధ్వర్యంలో జగిత్యాల జిల్లా రాష్ట్రంలోనే వ్యవసాయాభివృద్ధికి ఆదర్శంగా నిలుస్తోంది. తెలంగాణలోని వ్యవసాయ జిల్లాల్లో జగిత్యాల ఒకటి. గోదావరి నదీ పరివాహక ప్రాంతంలో విస్తరించిన ఈ జిల్లా ప్రధానంగా వరి, మొక్కజొన్న, పత్తి, సోయాబీన్, పసుపు, మామిడి మరియు కంది వంటి పంటల సాగుకు ప్రసిద్ధి చెందింది. జిల్లాలోని రైతులు ప్రధానంగా వ్యవసాయంపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని జిల్లా యంత్రాంగం నిరంతరం చర్యలు చేపడుతోంది. వ్యవసాయ రంగంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ రైతులకు మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో గత రబీ లో యూరియా కోసం రైతుల అవస్థలు గుర్తించి, రాష్ట్రం లో మొట్ట మొదటి సారిగా కలెక్టర్ గారి ఆదేశం సారం కీళ్ల వ్యాసాయ షాక్ ద్వారా యూరియా సరఫరాని క్రమబద్ధికరించడానికి డీలర్ ల వద్దనే ఒక అప్ప్ ఉపయోగించి యూరియా సరఫరా చేయడం జరిగినది, తర్వాత తెలంగాణ ప్రజా ప్రభుత్వం ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ యాప్ ద్వారా రైతులు తమ మొబైల్ ఫోన్ నుంచే యూరియా ఎరువులను బుక్ చేసుకునే అవకాశం కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమం జగిత్యాల జిల్లాలో విజయవంతంగా అమలవుతోంది. రైతులకు జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఆదేశాల మేరకు జిల్లా వ్యవసాయ శాఖ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి రైతులకు పూర్తి అవగాహనా కల్పించారు. గతంలో ఎరువుల కోసం రైతులు విక్రయ కేంద్రాల వద్ద గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చేది. కొన్నిసార్లు ఎరువుల కొరత ఉందనే అపోహలతో పెద్ద ఎత్తున రద్దీ ఏర్పడేది. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఇప్పుడు యూరియా బుకింగ్ యాప్ ద్వారా ముందుగానే బుకింగ్ చేసుకునే అవకాశం ఉండటంతో రైతులకు ఎంతో సౌలభ్యం కలిగింది. జిల్లాలో ఇప్పటివరకు 18,958 మంది రైతులు ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్ను వినియోగించారు. వీరు మొత్తం 58,241 యూరియా బస్తాలను బుక్ చేసుకున్నారు. అందులో 41,315 యూరియా బస్తాలను విజయవంతంగా కొనుగోలు చేశారు. ఈ గణాంకాలు యాప్పై రైతులకు ఉన్న విశ్వాసాన్ని స్పష్టంగా తెలియజేస్తున్నాయి. యాప్ ద్వారా బుకింగ్ చేసిన రైతులకు కేటాయించిన విక్రయ కేంద్రాల్లో సంబంధిత అధికారులు ఎరువులు అందుబాటులో ఉంచుతున్నారు. దీంతో రైతులు అనవసరంగా తిరగాల్సిన అవసరం లేకుండా పోయింది. ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ ప్రత్యేక విధానం పూర్తిగా పారదర్శకంగా ఉండటం విశేషం. రైతుల సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం తీసుకొస్తున్న ప్రతి కార్యక్రమాన్ని జిల్లా యంత్రాంగం సమర్థవంతంగా అమలు చేస్తోంది. వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాల వారీగా రైతులకు అవగాహన కల్పిస్తూ యాప్ వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నారు. డిజిటల్ సేవలపై రైతుల్లో చైతన్యం పెంచుతున్నారు. జిల్లాలో ప్రస్తుతం 90,898 యూరియా బస్తాల నిల్వలు అందుబాటులో ఉన్నాయి. రైతుల అవసరాలకు అనుగుణంగా నిరంతర సరఫరా కొనసాగుతోంది. ఎరువుల కొరతపై రైతులు ఎలాంటి ఆందోళన అవసరం లేదని రైతులకు కావాల్సిన ఎరువులు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయ శాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు. ముఖ్యంగా వరి సాగు ఎక్కువగా ఉండే జగిత్యాల జిల్లాలో యూరియా అవసరం అధికంగా ఉంటుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ముందస్తుగా నిల్వలు ఏర్పాటు చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటోంది. జిల్లా వ్యవసాయ శాఖ రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచడంతో పాటు పంటల నిర్వహణపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు కూడా నిర్వహిస్తోంది. పంటలలో వచ్చే తెగుళ్ల నివారణకు తగిన సూచనలు అందిస్తోంది. ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పిస్తూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తుంది. వ్యవసాయరంగంలో సాంకేతికత వినియోగం వల్ల రైతులకు సమయం ఆదా కావడంతో పాటు ఖర్చులు కూడా తగ్గుతున్నాయి. మొబైల్ యాప్ ద్వారా ప్రభుత్వ సేవలు నేరుగా రైతుల చేతుల్లోకి చేరుతున్నాయి. ఇదే డిజిటల్ తెలంగాణ లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. జగిత్యాల జిల్లా రైతులు కూడా ఈ మార్పును స్వాగతిస్తున్నారు. మొబైల్ ఫోన్ ద్వారా సులభంగా యూరియా బుక్ చేసుకోవడం, ఎప్పుడు ఎక్కడ యూరియా లభిస్తుందో తెలుసుకోవడం, విక్రయ కేంద్రాల్లో రద్దీ తగ్గడం వంటి ప్రయోజనాలు పొందుతున్నారు. తెలంగాణ ప్రజా ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని కేవలం సంక్షేమ పథకాలకే పరిమితం చేయకుండా వ్యవసాయ వ్యవస్థను ఆధునీకరించే దిశగా అడుగులు వేస్తోంది. రైతుల అవసరాలను ముందుగానే అంచనా వేసి ప్రత్యేక సేవలను అందిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న డిజిటల్ వ్యవసాయ విధానాలు గ్రామీణ ప్రాంతాల్లో విప్లవాత్మక మార్పులకు దారితీస్తున్నాయి. రైతుల జీవితాల్లో సానుకూల మార్పులు తీసుకొస్తున్నాయి. వ్యవసాయరంగాన్ని లాభసాటిగా మార్చే దిశగా ముందుకు తీసుకెళ్తున్నాయి. జిల్లాలోని రైతులు ఎరువుల పంపిణీలో పారదర్శకత పెరిగిందని, యాప్ ద్వారా ఎరువులు పొందడం సులభమైందని చెబుతున్నారు. వ్యవసాయ రంగంలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగానికి జగిత్యాల జిల్లా ఒక విజయవంతమైన ఆదర్శంగా నిలుస్తోంది. రైతు పక్షపాత పాలన, సమర్థవంతమైన పరిపాలన, ఆధునిక సాంకేతికత సమన్వయంతో అభివృద్ధి సాధ్యమని జగిత్యాల జిల్లా నిరూపిస్తోంది. రైతు సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలు రాష్ట్ర వ్యవసాయాభివృద్ధికి కొత్త దిశను చూపిస్తున్నాయి. అందులో భాగంగా జగిత్యాల జిల్లా సాధిస్తున్న పురోగతి రాష్ట్రానికి గర్వకారణంగా నిలుస్తోంది. వ్యవసాయంలో సాంకేతికత - రైతుకు భరోసా - అభివృద్ధిలో జగిత్యాల ముందంజ అనే నినాదానికి అనుగుణంగా జిల్లా ముందుకు సాగుతోంది.

భవిష్యత్తులో మరిన్ని డిజిటల్ సేవలు అందుబాటులోకి రావడంతో రైతులకు మరింత ప్రయోజనం చేకూరనుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం, వ్యవసాయ శాఖ సమన్వయంతో జగిత్యాల జిల్లా వ్యవసాయ రంగంలో సాధిస్తున్న ఈ పురోగతి రాష్ట్ర అభివృద్ధి లో ప్రత్యేకంగా నిలుస్తుంది.

## లోక్ అదాలత్లతో సమ న్యాయం




- **జడ్జి దుర్గం గణేశ్**

**సుల్తానాబాద్, జూన్ 20 (మనం న్యూస్):** లోక్ అదాలత్లతో ఇరు వర్గాలకు సమ న్యాయం అందుతుందని సుల్తానాబాద్ జూనియర్ సివిల్ జడ్జి దుర్గం గణేశ్ అన్నారు. జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా శనివారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు ఆవరణలో లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి గణేష్ మాట్లాడుతూ లోక్ అదాలత్ లలో ఇరు పక్షాల అంగీకారంతో రాజీ మార్గం ద్వారా కేసులను పరిష్కరించుకోవచ్చని అన్నారు. కక్షిదారులు వ్యయ ప్రయాసలకు గురికాకుండా ఇరు వర్గాలు రాజీ ద్వారా తమ కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు . లోక్ అదాలత్ తీర్పులపై ఎలాంటి అప్పీలు ఉండదని తెలిపారు. ఈ సందర్భంగా పలు క్రిమినల్ కేసులు, కుటుంబ వివాదాలు, భూమి తగాదాలు, చెక్ బౌన్స్, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులకు సంబంధించిన పలు కేసులను పరిష్కరించారని కోర్టు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వోడ్నాల రవీందర్, ప్రధాన కార్యదర్శి అవునూరి సత్యనారాయణ, ఏజీపీ దూడం ఆంజనేయులు, సెంకడ్ క్లాస్ మెజిస్ట్రేట్ నేరెళ్ల శంకరయ్య, లోక్ అదాలత్ సభ్యులు మాడూరి ఆంజనేయులు, చీకటి సంతోష్, న్యాయవాదులు ఆవుల లక్ష్మీరాజం, భూసారపు బాలకిషన్ ప్రసాద్, పడాల శ్రీరాములు, జోగుల రమేష్ , ఆవుల శివకృష్ణ, గుడ్ల వెంకటేష్, సిఐ రంజిత్ రావు, సుల్తానాబాద్, జూలపల్లి, ఎలిగేడ్ ఎస్సైలు చంద్ర కుమార్, మల్లేష్, కోర్టు సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో స్పెషలిస్ట్ సేవలు ప్రారంభం



- **పేదలకు మెరుగైన వైద్యం అందిస్తాం**
- **ఓల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజయ్ రెడ్డి**

**జగిత్యాల, జూన్ 20( మనం న్యూస్):** జగిత్యాల ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో తెలంగాణ ప్రభుత్వ అనుమతితో స్పెషలిస్ట్ వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయని ఓల్ ప్రభుత్వ ఆసుపత్రి ఇంచార్జి సూపరింటెండెంట్ డాక్టర్ టి. విజయ్ రెడ్డి తెలిపారు. డాక్టర్ విజయ్ రెడ్డి శనివారం విలేకర్లతో మాట్లాడుతూ జగిత్యాల జిల్లాకు మెడికల్ కాలేజ్, ఆసుపత్రి మంజూరు వచ్చిన తర్వాత ట్రామా, క్రిటికల్ కేర్, మాత శిశు ఆసుపత్రి, జనరల్ సర్జరీ ఇంప్రూవ్ అయ్యాయని తెలిపారు. వేసవి కాలంలో వడదెబ్బ కేసులు క్రిటికల్ కేర్ కు చాలా వచ్చాయాని, అదనపు బెడ్లు వేసి నయం చేశామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే పేద, మధ్యతరగతి ప్రజలకు కార్పొరేట్ ఆసుపత్రుల స్థాయిలో వైద్యం అందించడమే లక్ష్యమని చెప్పారు. ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి అధిక ఖర్చు పెట్టుకోకుండా, ఇక్కడే అన్ని రకాల స్పెషలిస్ట్ సేవలు ఉచితంగా పొందవచ్చన్నారు. ఆసుపత్రిలో అవసరమైన పరికరాలు, మందులు అందుబాటులో ఉంచామని, 24/7 ఎమర్జెన్సీ సేవలు కూడా కొనసాగుతున్నాయని వివరించారు. రోగులు ఎలాంటి ఇబ్బంది పడకుండా సిబ్బంది సహకారం అందిస్తారని, ప్రజలు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ విజయ్ రెడ్డి కోరారు.

## యూరియా సరఫరాలో తెలంగాణ దేశానికే ఆదర్శం

- **యూరియా బుకింగ్ యాప్ను సమర్థవంతంగా వినియోగించాలి**
- **బోనస్ పొందాలంటే ప్రభుత్వం గుర్తించిన ఏడు వరి రకాలనే సాగు చేయాలి**
- **జిల్లాలో యూరియా కొరతకు తావులేదు**
- **ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు**

**పెద్దపల్లి, జూన్ 20 (మనం ప్రతినిధి):** యూరియా సరఫరాలో యాప్ ఆధారిత విధానాన్ని అమలు చేయడంలో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందని ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు అన్నారు. శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అదనపు కలెక్టర్ కొప్పుల వెంకటరెడ్డి తో కలిసి యూరియా బుకింగ్ యాప్ వినియోగంపై ఎరువుల డీలర్లు, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు మాట్లాడుతూ రైతులు యూరియా కొనుగోలులో ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించేందుకు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష చొరవతో పెద్దపల్లి జిల్లాలో యూరియా బుకింగ్ యాప్ను రబీ




పంట కాలంలో ప్రవేశపెట్టినట్లు తెలిపారు. యాప్ వినియోగంపై రైతులకు అవగాహన కల్పించగా వారు పూర్తి సహకారం అందిస్తున్నారని చెప్పారు. గత రబీ సీజన్లో జిల్లాలో 4 లక్షల 40 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కనీస మద్దతు ధరపై కొనుగోలు చేసినట్లు తెలిపారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్ నుంచి ప్రభుత్వం ప్రకటించిన బోనస్ను పొందాలంటే రైతులు బీపీటీ, హెచ్ఎంటీ సోనా, జై శ్రీరామ్, తెలంగాణ సోనా, వరంగల్-44, 1638, 7715 అనే ఏడు సన్నా వరి రకాలనే సాగు చేయాలని సూచించారు. ఇందుకు అవసరమైన విత్తనాలను సిద్ధంగా ఉంచామని, రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని వ్యవసాయ అధికారులు, డీలర్లను ఆదేశించారు.రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించాలని, ఆయిల్ పామ్ సాగు ద్వారా అధిక లాభాలు పొందే అవకాశం ఉందన్నారు. జూన్ 30 నుంచి రైతు భరోసా ఖరీఫ్ నిధులు విడుదల కానున్నాయని తెలిపారు.పెద్దపల్లి జిల్లాలో విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో విశేష పురోగతి సాధించామని, గత రెండున్నర సంవత్సరాల్లో విద్యారంగంలో అనేక సంస్కరణలు అమలు చేసి రాష్ట్రస్థాయి గుర్తింపు పొందినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ గత ఖరీఫ్ సీజన్లో అధికారులు, డీలర్లు, రైతుల సహకారంతో జిల్లాలో యూరియా సమస్య తలెత్తలేదని, అందుకు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.గత సంవత్సరం జిల్లాలో 30 వేల మెట్రిక్ టన్నుల యూరియా వినియోగం జరిగిందని, ఈ ఏడాది సూపర్ ఎల్నినో పరిస్థితుల నేపథ్యంలో 26 వేల మెట్రిక్ టన్నుల అవసరం ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో 20 వేల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు అందుబాటులో ఉండగా, వారం రోజుల్లో మరో 4 వేల మెట్రిక్ టన్నులు రైల్వే ద్వారా చేరనున్నాయని, అదనంగా ఆర్ఎఫ్సీఎల్ నుంచి మరో 2 వేల మెట్రిక్ టన్నుల సరఫరా అందేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు.జిల్లాలో యూరియా కొరతకు అవకాశం లేదని, అంతర్గత సరఫరా వ్యవస్థను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ-పాస్ యంత్రాల ద్వారానే యూరియా విక్రయాలు జరగాలని, మండలాల వారీగా అవసరమైన నిల్వలను సిద్ధంగా ఉంచాలని సూచించారు.యాప్ ద్వారా ఎక్కడి నుంచైనా యూరియా బుకింగ్ చేసుకునే అవకాశం కల్పించామని, వ్యవసాయ విస్తరణ అధికారులు ప్రతిరోజూ బుకింగ్లను పర్యవేక్షించాలని తెలిపారు. రైతులకు అవసరానికి మించి యూరియా అందకుండా, ఎవరూ ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.యాప్కు సంబంధించిన సమస్యలు తలెత్తిన వెంటనే 8 నుంచి 10 గంటల్లో పరిష్కరించాలని, జిల్లాలో ఆందోళనతో అధిక కొనుగోళ్లు జరగకుండా అధికారులు, డీలర్లు రైతులతో సానుకూలంగా వ్యవహరించాలని సూచించారు. గత సీజన్లో అక్రమాలకు పాల్పడిన కొన్ని దుకాణాలపై చర్యలు తీసుకున్నామని, ఈసారి ఎలాంటి ఉల్లంఘనలు జరగకుండా కేవలం యాప్, ఈ-పాస్ విధానంలోనే యూరియా సరఫరా చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్, జిల్లా సహకార అధికారి శ్రీమాల, ఎరువుల డీలర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



## మెబూబ్ సాగర్ చెరువు కట్ట సుందరీకరణ పనుల కోసం పరిశీలించిన జగ్గారెడ్డి,నిర్మల

- **త్వరలో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా పనులకు శంకుస్థాపన**

**సంగారెడ్డి జూన్ 20 మనంప్రతినిధిః** సంగారెడ్డి పట్టణంలోని మహబూబ్ సాగర్ చెరువును రూ. 500 కోట్లతో అభివృద్ధి చేసే దిశగా జగ్గారెడ్డి, టీజీఐఐసీ ఛైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి వేగం పెంచారు. సంబంధిత శాఖల అధికారులతో కలిసి శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. అన్ని హంగులతో కింది బజార్ చెరువును అభివృద్ధి చేసేలా చేపట్టాల్సిన పనుల గురించి ఈ సందర్భంగా చర్చించారు. కిలోమీటరున్నర పొడవున ఉన్న చెరువు కట్టను అభివృద్ధి చేయడంతో పాటు, నెక్లెస్ రోడ్, పార్కులు ఏర్పాటు చేసే అంశాలపై చర్చించారు. సంగారెడ్డి పరిసర ప్రాంత ప్రజలతోపాటు, హైదరాబాద్ నుంచి వచ్చే వారికి ఆహ్లాదం పంచేలా కింది బజార్ చెరువును సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని జగ్గారెడ్డి ఈ సందర్భంగా అధికారులకు సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన! త్వరలో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా కింది బజార్ చెరువు కట్ట పనులకు శంకుస్థాపన చేసేలా పనుల్లో వేగం పెంచాలని, అవసరమైన అన్ని ప్రతిపాదనలు పూర్తి చేయాలని జగ్గారెడ్డి ఈ సందర్భంగా అధికారులకు సూచించారు. రెండేళ్లలో ఈ పనులన్నీ పూర్తి చేసి ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేలా ఈ ప్రాంతాన్ని అందుబాటులోకి తేవాలన్నారు. చెరువు వద్దకు వెళ్లి.. పరిశీలన! సమీక్ష నిర్వహించిన అనం తరం జగ్గారెడ్డి, నిర్మల సంబంధిత అధికారులతో కలిసి కింది బజార్ చెరువు కట్ట వద్దకు వెళ్లారు. అలుగు వద్ద ఉన్న ప్రభుత్వ భూమిని పరిశీలించారు. ఎక్కడెక్కడ ఏమేం పనులు చేయాలనే అంశమై ఈ సందర్భంగా జగ్గారెడ్డి అధికారులతో కలిసి పరిశీలించారు.

## స్త్రీ నిధి రికవరీ, రుణాల పంపిణీ 100 శాతం చేయాలి


- **జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**



**పెద్దపల్లి, జూన్ 20 (మనం ప్రతినిధి)** స్త్రీ నిధి రికవరీని 100 శాతానికి పెంచడంతో పాటు రుణాల పంపిణీని శత శాతం పూర్తి చేసే దిశగా అధికారులు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధ్యక్షతన నిర్వహించిన స్త్రీ నిధి జిల్లా సమీక్షా సమావేశం లో రికవరీ, రుణాల పంపిణీ, డిజిటల్ సేవల వినియోగం, సుస్థిర జీవనోపాధులు, ఆర్థిక క్రమశిక్షణ అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ జిల్లాలో స్త్రీ నిధి రుణ చెల్లింపులు పూర్తిగా డిజిటల్ విధానంలో జరగాలని, అన్ని రికవరీలు 'మన స్త్రీ నిధి యాప్' ద్వారానే బదిలీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. లావాదేవీలలో పారదర్శకత, వేగవంతమైన అడ్జస్ట్మెంట్, సమగ్ర సమాచార నిర్వహణ కోసం అన్ని స్థాయిలలో యాప్ వినియోగాన్ని మరింత విస్తరించాలని తెలిపారు.అక్రమాలకు పాల్పడే వివోఏ ల అంశంపై ప్రత్యేక సమీక్ష నిర్వహించి, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే రుణాలు తీసుకుని సకాలంలో చెల్లించని స్వయం సహాయక సంఘాలపై అవసరమైతే రెవెన్యూ రికవరీ చట్టం ప్రకారం చర్యలు చేపట్టాలని సూచించారు.రికవరీతో పాటు ఇతర విధుల నిర్వహణలో స్త్రీ నిధి, సెర్ప్, మెప్మా సిబ్బందికి అన్ని స్థాయిలలో పూర్తి సహకారం అందించాలని, విధుల నిర్వహణకు ఆటంకం కలిగించే చర్యలను ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.జూన్ నెలాఖరు నాటికి జిల్లా రికవరీని 70 శాతానికి పెంచాలని, క్రెడిట్ లక్ష్యాన్ని కనీసం 30 శాతానికి చేరేలా కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జీవనోపాధి రుణాల మంజూరును పెంచడంతో పాటు జీరో రికవరీ సంఘాల సంఖ్యను సున్నాకు తీసుకురావాలని సూచించారు. జూలపల్లి, ఎలిగేడు, పాలకుర్తి, మంథని, ధర్మారం, సుల్తానాబాద్, ఓదెల, శ్రీరాంపూర్, పెద్దపల్లి మండలాల్లో రికవరీ పనితీరు మెరుగుపరిచేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జూన్ నెలాఖరు నాటికి గణనీయమైన పురోగతి సాధించేలా క్షేత్రస్థాయి సిబ్బంది కృషి చేయాలని తెలిపారు. మహిళల సుస్థిర జీవనోపాధుల అభివృద్ధికి స్త్రీ నిధి రుణాలను సమర్థవంతంగా వినియోగించేలా అన్ని శాఖల అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళల ఆర్థిక సాధికారతకు జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందని, అదే సమయంలో ఆర్థిక క్రమశిక్షణ, సకాలంలో రుణ చెల్లింపులు, క్షేత్రస్థాయి సిబ్బందికి పూర్తి సహకారం అందించడం అవసరమని పేర్కొన్నారు.ఈ సమావేశంలో డి ఆర్ డి ఓ మీ. కాళిందిని, ఏ డి ఆర్ డి ఓ రవీందర్ , స్త్రీ నిధి ఆర్ ఎం ఆర్. దుర్గా ప్రసాద్ గారు, జిల్లా సమాఖ్య అధ్యకురాలు స్వప్న కార్యదర్శి శోభా, కోశాధికారి జి. స్వప్న అందరూ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్లు వివిధ శాఖల అధికారులు, సెర్ప్, మెప్మా, స్త్రీ నిధి సిబ్బంది, జిల్లా సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

# కుంజా వనజ మృతిపై డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ ఆరా

## ప్రోగ్రాం అధికారులతో జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష



**కొత్తగూడెం టౌన్, జూన్ 20 (మనం న్యూస్):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇటీవల చోటు చేసుకున్న కుంజ వనజ మృతి ఘటనపై డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ ఫ్యామిలీ వెల్ఫేర్ డాక్టర్ రవీందర్ నాయక్ జిల్లాకు విచ్చేసి సమగ్రంగా ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్, డిసిహెచ్ఎస్ రవిబాబుతో పాటు సంబంధిత వైద్య అధికారులు, ఆరోగ్య సిబ్బందితో సమావేశమై గర్భిణికి అందించిన వైద్య సేవలు, చికిత్స వివరాలు, రిఫరల్ ప్రక్రియ, సంఘటనకు దారితీసిన పరిస్థితులు తదితర అంశాలపై పూర్తి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం సంబంధిత రికార్డులను పరిశీలించి, విధుల నిర్వహణలో ఎలాంటి లోపాలు జరిగాయో సమగ్రంగా విచారణ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. విచారణ నివేదికను త్వరితగతిన ప్రభుత్వానికి సమర్పించాలని సూచించారు. తదుపరి డైరెక్టర్ డా. రవీందర్ నాయక్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ప్రోగ్రాం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలో అమలవుతున్న వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాల పురోగతి, మాతా-శిశు ఆరోగ్య సేవలు, కుటుంబ నియంత్రణ, వ్యాధి నియంత్రణ కార్యక్రమాలు, అసంక్రమిత వ్యాధుల (ఎన్ సి డి) స్క్రీనింగ్, టీకా కార్యక్రమం, ఆయుష్మాన్ భారత్ హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్ల పనితీరు, సికిల్ సెల్ అనీమియా నియంత్రణ కార్యక్రమం, క్షయవ్యాధి నిర్మూలన, కుష్ఠు నిర్మూలన, వెక్టర్ బోర్న్ వ్యాధుల నివారణ తదితర అంశాలపై కార్యక్రమాల వారీగా సమీక్ష నిర్వహించారు. ప్రతి కార్యక్రమంలో నిర్దేశించిన లక్ష్యాలను శాతానికి శాతం సాధించాలని, పెండింగ్ అంశాలను వెంటనే పూర్తి చేయాలని, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ వైద్య సంస్థల్లో గర్భిణులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, హైరిస్క్ గర్భిణులను ముందస్తుగా గుర్తించి ప్రత్యేక పర్యవేక్షణలో ఉంచాలని, అత్యవసర పరిస్థితుల్లో రిఫరల్ వ్యవస్థను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. మాతా-శిశు మరణాల నివారణకు ప్రతి ఆరోగ్య కార్యకర్త బాధ్యతాయుతంగా పనిచేయాలని, వైద్య సేవల నాణ్యతను మరింత మెరుగుపరచాలని దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఓ డాక్టర్ తుకారాం రాథోడ్, డిసిహెచ్ఎస్ డాక్టర్ రవిబాబు, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ ప్రతాప్ డాక్టర్ ప్రసాద్, డాక్టర్ దినేష్, మోహన్, రామ్ ప్రసాద్ , విప్లవ్ కుమార్, సలిత, శ్రీధర్ , కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలకు 'పీఎస్ఆర్' భరోసా

- 44 కుటుంబాలక్కు 10వేల చొప్పున ఆర్థిక సహాయం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచనతో ట్రస్ట్ వితరణ

**ఖమ్మం రూరల్, జూన్ 20(మనం న్యూస్):** మున్సిపాలిటీ పరిధిలో గత నెల మరణించిన వ్యక్తుల కుటుంబాలకు పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ కొండంత అండగా నిలిచింది. తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సూచనల మేరకు ఏదులాపురం మున్సిపాలిటీ చైర్ పర్సన్ పోకబత్తిని



అనిత, వార్డు కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు శనివారం బాధిత కుటుంబాలను నేరుగా కలిసి ఈ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మున్సిపాలిటీ పరిధిలోని మొత్తం 44 కుటుంబాలకు ఒక్కో ఇంటికి 10,000 చొప్పున నగదును పంపిణీ చేశారు. విపత్కర పరిస్థితుల్లో ఉన్న తమను ఆదుకునేందుకు మంత్రి పొంగులేటి, ట్రస్ట్ ప్రతినిధులు ముందుకు రావడంపై బాధిత కుటుంబాలు కృతజ్ఞతలు తెలిపాయి. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఏదులాపురం మున్సిపాలిటీ అధ్యక్షుడు బానోత్ కిశోర్, స్థానిక కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు అజ్మీర అశోక్ నాయక్, గోనె భుజంగ రెడ్డి, వెంపటి రవి, వీరా రెడ్డి, మహేష్, భద్రకాళి, నూకల రామ్ మోహన్ రెడ్డి, రంజిత్ నాయక్, వెంకట నారాయణ, సాయి, కార్యకర్తలు, పొంగులేటి అభిమానులు పాల్గొని విజయవంతం చేశారు.





# 'సర్' పట్ల అప్రమత్తంగా ఉండాలి

## ఓటు పోకుండా చూసుకోవాలి • బిఎల్ఓ, బిఎల్ఏలే కీలకం

## ఖమ్మం నియోజకవర్గ సమావేశంలో మంత్రి తుమ్మల

**ఖమ్మం, జూన్ 20(మనం బ్యూరో):** 'సర్' కార్యక్రమం పట్ల పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఖమ్మంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో జరిగిన నియోజకవర్గ స్థాయి బిఎల్ఓల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సర్‌లో ఖమ్మంలో ఓట్లు 3,లక్షల 26 వేలు ఉంటే....సగం ఓట్లు కూడా మ్యాపింగ్ జరగ లేదన్నారు. మొన్న ఎన్నికలు జరిగిన బెంగాల్, తమిళనాడు లో ఓట్లు మ్యాపింగ్ జరగకపోవడంతో అక్కడ అధికార పార్టీలు ఓటమి పాలయ్యాయని అన్నారు. ప్రతి ఓటూ పోకుండా జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. ఈ ప్రక్రియలో బిఎల్ఓ, బిఎల్ఏలే ముఖ్యమని, ఓటర్ల జాబితాను జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. అసెంబ్లీ ఎన్నికలలో పెద్ద పర్సంటేజీతో గెలవలేదని, మూడు శాతం ఓట్ల తోనే గెలిచామని అన్నారు. ఇప్పుడు 50 శాతం ఓట్లు మ్యాపింగ్ జరగలేదు, ఫలితాలు తారుమారవుతాయన్నారు. 90 లక్షల ఓట్లు తొలగించారు. అప్పీల్ చేసుకుంటే 30 లక్షల ఓట్లు మాత్రమే అవకాశం కల్పించారు. రాజకీయాలలో ఉండాలంటే ఓటర్ల లిస్ట్ ను చూసుకోవాలని సూచించారు. ఇది జీవనమరణ సమస్య అని, జాతీయ, రాష్ట్ర నాయకత్వం చాలా సీరియస్ గా ఉందని, ఓటర్ల జాబితాను పరిశీలించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, సుడా ఛైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, కార్పొరేషన్ అధ్యక్షులు దీపక్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

# పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ అంకిత్

- నీట్ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు



**భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 20 (మనంప్రతినిధి):** నేడు నిర్వహించనున్న నీట్ (ఎన్ ఇ ఇ టి) పరీక్షకు సంబంధించి జిల్లాలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. శనివారం అదనపు కలెక్టర్ వేణుగోపాల్తో కలిసి పరీక్షా కేంద్రాలను పరిశీలించారు.పరిశీలనలో భాగంగా జిల్లాలో ఏర్పాటు చేసిన నాలుగు పరీక్షా కేంద్రాలైన టీజీఎస్డబ్ల్యూఆర్ బాలికల పాఠశాల మరియు జూనియర్ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ కళాశాల పాల్వంచ, శ్రీ రామచంద్ర ఆరట్స్ అండ్ సైన్స్ కళాశాల కొత్తగూడెం, సింగరేణి ఉమెన్స్ కళాశాల కొత్తగూడెంలలో కలెక్టర్ తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా రిజిస్ట్రేషన్ కౌంటర్లు, బయోమెట్రిక్ ధృవీకరణ కేంద్రాలు, పరీక్షా గదులు, భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల పనితీరు, స్ట్రాంగ్ రూమ్ నిర్వహణ, జామర్ల ఏర్పాటు, అలారాలు, గోడ గడియారాలు తదితర అంశాలను నిశితంగా పరిశీలించారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి లోపాలకు తావు లేకుండా అన్ని చర్యలు చేపట్టాలని, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ జిల్లాలో ఆదివారం నిర్వహించనున్న నీట్ పరీక్షకు మొత్తం 1,128 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని తెలిపారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో సెక్షన్-163 అమల్లో ఉంటుందని అన్నారు . పరీక్షా కేంద్రాల సమీపంలోని జిరాక్స్, ఇంటర్నెట్ కేంద్రాలను పరీక్షా సమయాల్లో మూసివేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఉదయం 11 గంటల నుంచి అభ్యర్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించడం జరుగుతుందని, అభ్యర్థులు ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ప్రతి అభ్యర్థిని క్షుణ్ణంగా తనిఖీ చేసిన అనంతరమే పరీక్షా కేంద్రంలోకి అనుమతించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సెల్ఫోన్లు, స్మార్ట్ వాచ్లు, బ్లూటూత్ పరికరాలు, కాలిక్యులేటర్లు తదితర ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్షా కేంద్రాల్లోకి తీసుకురావద్దని అభ్యర్థులకు సూచించారు.పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, వైద్య సేవలు, భద్రతా ఏర్పాట్లు సహా అన్ని మౌలిక సదుపాయాలు కల్పించామని కలెక్టర్ తెలిపారు. అభ్యర్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా అన్ని శాఖల సమన్వయంతో అవసరమైన చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. పరీక్షల నిర్వహణలో పాల్గొనే అధికారులు, సిబ్బంది పూర్తి బాధ్యతతో విధులు నిర్వర్తించి పరీక్షలను విజయవంతం చేయాలని ఆదేశించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట కొత్తగూడెం ఆర్ డి ఓ మధు, తహశీల్దార్లు ధారా ప్రసాద్, పుల్లయ్య, జిల్లా ఇంటర్మీడియట్ శాఖ అధికారి వెంకటేశ్వర్లు, సంబంధిత శాఖల అధికారులుపాల్గొన్నారు.

# అభివృద్ధిని అడ్డుకోం... అవినీతిని అరికడతాం

## కౌన్సిల్ సమావేశంలో మహిళా ప్రతినిధులకు రక్షణ ఏది?

## విలేకరుల సమావేశంలో టిఆర్ఎస్, సిపిఎం, సిపిఐ కౌన్సిలర్లు



**వైరా , జూన్ 20 (మనం న్యూస్):** వైరా మున్సిపాలిటీ అభివృద్ధికి తాము అడ్డు కాదని మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరిస్తామని, అవినీతిని అరికడతామని వైరా మున్సిపాలిటీ బీఆర్ఎస్, సిపిఐ, సిపిఎం కౌన్సిలర్లు అన్నారు. శనివారం స్థానిక టిఆర్ఎస్ పట్టణ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో కౌన్సిలర్లు కట్ట స్వరూప రాణి, మాదినేని సునీత, తిరుపతి శివకుమారి, చిలక చిన్న కోటయ్య, దొంతబోయిన వెంకటేశ్వరరావు, కిన్నెర కృష్ణ, నల్లమోతు శైలజ మాట్లాడుతూ వైరా మున్సిపాలిటీలో శుక్రవారం జరిగిన రెండో విడత సాధారణ సమావేశంలో 95 అంశాలను ఒకేసారి ప్రవేశ పడటం పట్ల అభ్యంతరం తెలపడంతో మున్సిపల్ చైర్ పర్సన్ కాపా చంద్రకళ భర్త కాప మురళి కృష్ణ కౌన్సిల్ సభ్యుల పట్ల అభ్యంతరకరంగా మాట్లాడటం శోచనీయమన్నారు. ఇలాంటి సంఘటనలో పునరావృతమైతే త్వరలో జరగనున్న సమావేశాలు సైతం అడ్డుకుంటామని అన్నారు.. మున్సిపల్ సమావేశం జరుగుతుండగా సమావేశానికి హాజరైన విలేకరులు వెళ్లిపోవాలని కోరటం అధికారపక్ష కౌన్సిల్ సభ్యుల భర్తలు అక్కడ ఉండి పలు అంశాలపై మాట్లాడుతున్న కౌన్సిలర్ల మైకు లాక్కోవాలని చెప్పటం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అలాగే 12 మంది మహిళా కౌన్సిల్ సభ్యులు ఉండగా వారికి రక్షణ లేకుండా సమావేశం నిర్వహించిన కమిషనర్ రామచంద్రరావు పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు ఇలా మహిళల పట్ల అభ్యంతరకరంగా మాట్లాడటం ఎలాంటి ప్రజాప్రతినిధి కాకపోయినా మున్సిపాలిటీలో పెత్తనం చెలాయించటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

మహిళ ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ సీఎం ఆధ్వర్యంలో మహిళలకు పెద్దపీట వేస్తుండగా వైరా మున్సిపాలిటీలో అగౌరపరచటం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.. మహిళా కౌన్సిలర్ల హక్కులను గౌరవాన్ని కాపాడాలని కోరారు. మున్సిపల్ సమావేశంలో పలు అంశాలు అవినీతి మయంగా ఉన్నాయని వెంటనే వాటిని సవరించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు వనమా విశ్వేశ్వరరావు, కట్టా కృష్ణార్జునరావ్, మాజీ మండల అధ్యక్షులు బాణాల వెంకటేశ్వరరావు, మాజీ పట్టణ అధ్యక్షుడు మద్దిల రవి, మాదినేని దుర్గాప్రసాద్,అప్పు సురేష్, మరికంటి శివ, ఏదునూరి శ్రీనివాసరావు,తిరుపతి శ్రీను, కారుకొండ బోస్, కొంగర సుధాకర్, మిట్టపల్లి కిరణ్, నూకల వాసు, నల్లమోతు సురేష్, కట్ట నాగేశ్వరరావు, వాంకుడోత్ వీరన్న, వేముల శివకృష్ణ, భానోత్ శివ తదితరులు పాల్గొన్నారు.

# స్టూడెంట్ వాయిస్ పేరుతో ఆందోళనలు

## కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్



**ఖమ్మం, జూన్ 20(మనం బ్యూరో):** నీట్ పేపర్ లీకేజీపై కేంద్రం ప్రభుత్వం బాధ్యతవహించాలని, లీకేజీ బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ స్టూడెంట్ వాయిస్ పేరుతో ఆందోళనలు నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ పేర్కొన్నారు. శనివారం ఖమ్మంలోని కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ నీట్ పేపర్ లీకేజీ వల్ల లక్షల మంది విద్యార్థులు తీవ్ర నిరాశ నిస్పృహలకు గురి అయ్యారని అన్నారు. ప్రత్యేక ఓటర్ జాబితా సమగ్ర సవరణపై ఎన్నో అపోహలున్నాయని, బిజెపి ప్రభుత్వం కుటిల రాజకీయ చతురతకు నిదర్శనం అని అన్నారు. జిల్లా మహిళా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య మాట్లాడుతూ మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఈ నెల 22న సాయంత్రం 3.00 గంటలకు సప్తపది ఫంక్షన్ హాల్ లో నారి భేరి కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. మహిళల కోసం ప్రజా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నదని, భవిష్యత్‌లో ఎన్నో పథఖాలు చేపట్టనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జిల్లాలోని మహిళలు జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, జిల్లా ఆర్‌టిఏ మెంబర్ గజ్జెల్లి వెంకన్న, జిల్లా కాంగ్రెస్ అనుబంధ సంఘ అధ్యక్షులు కొత్తా సీతారాములు, సయ్యద్ గౌస్, పుచ్చకాయల వీరభద్రం, బొడ్డు బొందయ్య, రాష్ట్ర యువజన కాంగ్రెస్ కార్యదర్శి జెర్రిపోతుల అంజనీ కుమార్, జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యులు భానోత్ వినోద, రేఖా భార్గవి, సుకన్య తదితరులు పాల్గొన్నారు.

# ఫారెస్ట్-రెవెన్యూ జాయింట్ సర్వే, భూసేకరణ ప్రక్రియలను వేగవంతం చేయాలి

## అకేనేపల్లి, లింగాలపల్లి ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్

**దమ్మపేట, జూన్ 20(మనం న్యూస్) :** జిల్లాలో ఫారెస్ట్-రెవెన్యూ జాయింట్ సర్వే, నాన్-క్యాడస్ట్రల్ సర్వే, నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియలను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. శనివారం దమ్మపేట మండలంలోని పలు ప్రాంతాల్లో కొనసాగుతున్న సర్వే పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా దమ్మపేట మండలం అకేనేపల్లి గ్రామంలో చేపడుతున్న నాన్-క్యాడస్ట్రల్ సర్వే పనులను కలెక్టర్ పరిశీలించారు. సర్వే ప్రక్రియ, భూముల హద్దుల గుర్తింపు, రికార్డుల నమోదు విధానాలను అడిగి తెలుసుకుని పనులను నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయాలని సూచించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా సర్వే నిర్వహించాలని అధికారులకు సూచించారు. అనంతరం దమ్మపేట మండలం లింగాలపల్లి గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 1458లో కొనసాగుతున్న ఫారెస్ట్-రెవెన్యూ జాయింట్ సర్వే పనుల పురోగతిని కలెక్టర్ పరిశీలించారు. అటవీ మరియు రెవెన్యూ శాఖల అధికారులు సంయుక్తంగా నిర్వహిస్తున్న సర్వే ప్రక్రియను పరిశీలించి, భూముల సరిహద్దుల నిర్ధారణలో ఖచ్చితత్వం పాటించాలని ఆదేశించారు. శాఖల మధ్య సమన్వయంతో పనిచేస్తూ సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా అధికారులు కలెక్టర్కు వివరాలు అందిస్తూ అకేనేపల్లి గ్రామ పరిధిలో సుమారు 4,400 ఎకరాల విస్తీర్ణంలో ఫారెస్ట్-రెవెన్యూ జాయింట్ సర్వే పనులు కొనసాగుతున్నాయని, ప్రస్తుతం పనులు ప్రణాళికాబద్ధంగా జరుగుతున్నాయని తెలిపారు. మరో రెండు నెలల్లో సర్వే ప్రక్రియను పూర్తిచేయనున్నట్లు వివరించారు. దమ్మపేట తహసీల్దార్ కార్యాలయంలో నీటిపారుదల శాఖ అధికారులతో కలెక్టర్ సమావేశమయ్యారు.ఈ సందర్భంగా సీతారామ ప్రాజెక్టు అలైన్మెంట్ను మ్యాప్ ద్వారా పరిశీలించి, ప్రాజెక్టుకు అవసరమైన



భూసేకరణ, సర్వే, సరిహద్దుల నిర్ధారణ అంశాలపై అధికారులతో సమగ్రంగా చర్చించారు. ప్రాజెక్టు పనులకు ఎటువంటి అవరోధాలు తలెత్తకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని, పెండింగ్ అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఫారెస్ట్-రెవెన్యూ జాయింట్ సర్వే ద్వారా అటవీ, రెవెన్యూ భూముల సరిహద్దులు స్పష్టంగా నిర్ధారణ కావడంతో పాటు భవిష్యత్తులో తలెత్తే వివాదాలకు పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. సర్వే, భూసేకరణ ప్రక్రియలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి ప్రభుత్వ లక్ష్యాల సాధనకు కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట కొత్తగూడెం రెవెన్యూ డివిజనల్ అధికారి మధు, దమ్మపేట తహశీల్దార్ రామ్ నరేష్, ఫారెస్ట్ రేంజర్ శ్రీనివాస్ రావు, సర్వేయర్ నాగరాజు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# రైతుల పక్షాన నిరంతర పోరాటమే ధ్యేయం

## 17వ లోక్‌సభ ఫ్లోర్ లీడర్గా రైతుల సమస్యలపై గళమెత్తాను

## మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు



**ఖమ్మం, జూన్ 20(మనం న్యూస్):** రైతుల సంక్షేమం కోసం బీఆర్ఎస్ ఎప్పటికీ అండగా ఉంటుందని మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 17వ లోక్‌సభలో బీఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్గా రైతుల సమస్యలను పార్లమెంట్ వేదికగా ఎన్నోసార్లు ప్రస్తావించి, వారి హక్కుల కోసం నిరంతరం పోరాటం చేశానని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రైతాంగాన్ని దేశానికి ఆదర్శంగా నిలిపేలా అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేశామని ఆయన గుర్తు చేశారు. రైతుబంధు, రైతు బీమా, 24 గంటల ఉచిత విద్యుత్, కాళేశ్వరం వంటి భారీ సాగునీటి ప్రాజెక్టులు, విస్తృత స్థాయిలో కొనుగోలు కేంద్రాల ఏర్పాటు ద్వారా వ్యవసాయాన్ని లాభసాటి రంగంగా మార్చిన ఘనత నాటి కేసీఆర్ ప్రభుత్వానిదేనని తెలియజేశారు.

వ్యవసాయం దేశ ఆర్థిక వ్యవస్థ కువెన్నెముక అని, రైతు బాగుంటేనే దేశం అభివృద్ధి చెందుతుందని స్పష్టం చేశారు. రైతులు ఎదుర్కొంటున్న పంట కొనుగోలు సమస్యలు, గిట్టుబాటు ధరలు, సాగునీటి ఇబ్బందులు, ఎరువులు, విత్తనాల కొరత, విద్యుత్ సమస్యలు వంటి అనేక అంశాలపై కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం ఒత్తిడి తీసుకొచ్చామని గుర్తు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో రైతుల ఖాతాల్లో నేరుగా పెట్టుబడి సాయం జమ చేసి, రైతు కుటుంబాలకు భరోసా కల్పించి, తెలంగాణను వ్యవసాయ రంగంలో దేశానికి ఆదర్శంగా నిలిపిందన్నారు. ప్రతి పంటను చివరి గింజ వరకు కొనుగోలు చేసి రైతుకు అండగా నిలవాలనే విధానాన్ని నాడు కేసీఆర్ ప్రభుత్వం విజయవంతంగా అమలు చేసిందని తెలిపారు. ప్రస్తుతం రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

కేంద్రం నిర్దేశించిన కోటాకు పరిమితం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రతి పంటను చివరి గింజ వరకు కొనుగోలు చేసి రైతులకు అండగా నిలవాలని కోరారు. రైతుల ప్రయోజనాల విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, అవసరమైతే రైతు సంఘాలతో కలిసి బీఆర్ఎస్ పార్టీ మరో ఉద్యమానికి సిద్ధంగా ఉంటుందని, రైతు సంక్షేమమే బీఆర్ఎస్ పార్టీ ప్రధాన లక్ష్యమని, అన్నదాతకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేసారు.

# పాపం 'ఇడమయ్య'...

## ప్రమాదంలో రెండు కాళ్లు కోల్పోయిన ఆదివాసీ

- కూలి పనులు చేస్తూ భర్తను పోసిస్తున్న భార్య
- ఆరేళ్లుగా ఫించన్ కోసం ఎదురు చూపులు
- పట్టించుకోని అధికారులు, రాజకీయ నాయకులు
- నేడు ఆపన్న హస్తం కోసం ఎదురుచూపులు





**చర్ల, జూన్ 20 (మనం న్యూస్) :** బతుకుదెరువు కొరకు వలస వెళ్లి కూలీ పనులు చేస్తున్న ఇడమయ్య అనుకోని ప్రమాదంలో చిక్కుకొని రెండు కాళ్లను కోల్పోయాడు. అతని రెండు చేతులు చచ్చుబడిపోయాయి. దీంతో అతని బ్రతుకు భారంగా మారింది. కట్టుకున్న ఇల్లాలు అన్నీ తానై భర్త బరువు బాధ్యతలను మోస్తోంది. ప్రమాదం సంభవించి ఆరేళ్లయినా అధికారులు, ప్రజాప్రతినిధులు అతనిపై కనికరం చూపలేదు. ఎన్ని మార్లు దివ్యాంగ ఫించన్ కోసం దరఖాస్తు చేసుకున్నా మంజూరు కాలేదు. పూట గడవటమే కష్టంగా మారిన నేపథ్యంలో నేడు ఆదుకునే ఆపన్న హస్తం కోసం అతడు ఎదురు చూస్తున్నాడు. చర్ల మండలం పులిగుండాల గ్రామ పంచాయతీ బక్కచింతలపాడు గ్రామానికి చెందిన మడకం ఇడమయ్య కూలీ పనులను చేసుకుంటూ జీవనం సాగిస్తుండే వాడు. ఈ క్రమంలో ఆరేళ్ల క్రితం పాల్వంచకు చెందిన ఒక కాంట్రాక్టర్ బిల్డింగ్ పనుల నిమిత్తం ఇడమయ్యను కొత్తగూడెం తీసుకువెళ్లి పనులను చేయించాడు. ఈ క్రమంలో బిల్డింగ్ కు ఉపయోగించే ఇనుప చువ్వలను అందిస్తుండగా పైన ఉన్న విద్యుత్ తీగలను చువ్వ తగలడంతో విద్యుత్ ఘాతానికి గురయ్యాడు. ఈ ప్రమాదంలో రెండు కాళ్లను ఇడమయ్య పూర్తిగా కోల్పోయాడు. రెండు చేతులూ చచ్చిబడిపోయి దగ్గరకు వచ్చాయి. దీంతో అతడు ఏ పనులను చేయలేని నిస్సహాయ స్థితికి చేరుకున్నాడు. ఎక్కడకు వెళ్లాలన్నా భార్య సుశీలపైనే ఆధారపడుతున్నాడు. భర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటూ నడవలేని స్థితిలో ఉన్న అతడిని భార్య సుశీల ఎత్తుకు వెళ్లి కాలకృత్యాలతో పాటు ఇతర పనులకు సహకారం అందిస్తూ భర్తపై మమకారం చూపుతోంది. దివ్యాంగత్వంతో ఏ పనీ చేయలేని భర్తను భార్య కూలీ పనులతో పాటు అటవీ ఉత్పత్తుల సేకరణ ద్వారా వచ్చిన కొద్దిపాటి ఆదాయంతో పోషించుకుంటోంది.

**మంజూరు కాని దివ్యాంగ ఫించన్**

దివ్యాంగుడుగా మారి ఆరేళ్లు గడుస్తున్నా ఇడమయ్యకు నేటి వరకు ప్రభుత్వం ఫించన్ మంజూరు చేయలేదు. ఈ దిశగా అధికారులు, రాజకీయ నాయకులు ప్రయత్నాలను చేయకపోవడం గమనార్హం. గత ఏడాది కొత్తగూడెం వెళ్లిన ఇడమయ్య సదరం సర్టిఫికేట్ పొందాడు. మీ సేవ ద్వారా ఫించన్ కోసం దరఖాస్తు చేసుకున్నా ప్రభుత్వం కనికరం చూపలేదు. నడవలేని స్థితిలో ఉన్న ఇడమయ్య భార్య సంపాదించే కొద్ది మొత్తం ఆదాయం సరిపోక అవస్థలు పడుతున్నాడు.

**ఆపన్న హస్త కోసం వేడుకోలు...**

ఏ పనీ చేసుకోలేని స్థితిలో ఉన్న ఇమడయ్య దాతల ఆపన్న హస్తం వేడుకుంటున్నాడు. దాతలు సహకరించి కృత్రిమ కాళ్లు పెట్టించాలని, ఆర్థికంగా ఆదుకోవాలని కోరుతున్నాడు. ట్రైసైకిల్ లేదా ట్రై వాహనం అందచేస్తే తన పనులను తాను చేసుకుంటానని వేడుకుంటున్నాడు. అధికారులు స్పందించి దివ్యాంగ ఫించన్ మంజూరయ్యేలా కృషిచేయాలని కోరుతున్నాడు.

**ఎంపిడివో ఈదయ్య వివరణ... :**

ఈ విషయమై ఎంపిడివో కనపర్తి ఈదయ్యను వివరణ కోరగా గత రెండున్నరేళ్లుగా ప్రభుత్వం కొత్త ఫించన్లను మంజూరు చేయలేదు. దీనికి తోడు గత ఏడాదే ఇడమయ్యకు సదరం సర్టిఫికేట్ వచ్చినందున ఈ సారి ఫించన్ పొందేలా కృషిచేస్తాము.

# మోడీ 12 ఏళ్ల పాలనలోఅనేక సంక్షేమ ఫలాలు

- ఓబిసిల అభ్యున్నతే లక్ష్యంగా కేంద్రం అడుగులు
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి



**మానకొండూరు జూన్ 20(మనం న్యూస్):** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం గత 12 ఏళ్లుగా పేద, మధ్యతరగతి , బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం అనేక అద్భుతమైన పథకాలను అమలు చేస్తోందని బీజేపీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి కొనియాడారు. ప్రధాని మోదీ 12 ఏళ్ల పాలన పూర్తయిన సందర్భాన్ని, పురస్కరించుకొని, జన్ కళ్యాణ్ ప్రోగ్రాంలో భాగంగా బిజెపి ఓబీసీ మోర్చా మానకొండూరు అసెంబ్లీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ విశ్వకర్మ యోజన లబ్ధిదారులతో శనివారం రోజున తిమ్మాపూర్ మండలం మహాత్మ నగర్ లో గల శ్రీ తపాల లక్ష్మీనరసింహస్వామి ఫంక్షన్ హాల్ లో సమావేశం,మేధావులతో సదస్సు జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ దేశాభివృద్ధిలో ఓబిసి వర్గాల పాత్రను గుర్తించిన కేంద్రం, వారి ఆర్థిక, సామాజిక సాధికారత కోసం అనేక ప్రత్యేక కార్యక్రమాలను చేపడుతోందన్నారు. మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'పీఎం విశ్వకర్మ యోజన' కులవృత్తులకు కొత్త జీవం పోసిందన్నారు. సంప్రదాయ చేతివృత్తులు చేసుకునే విశ్వకర్మ వర్గాల వారికి ఈ పథకం ఒక వరం లాంటిదన్నారు. కులవృత్తుల వారిని ప్రోత్సహించడానికి కేంద్రం రూ. లక్షల కొద్దీ రుణాలను అతి తక్కువ వడ్డీకే అందిస్తోందని తెలిపారు. కేవలం ఆర్థిక సహాయమే కాకుండా, శిక్షణ, ఆధునిక పనిముట్లు, మార్కెటింగ్ సౌకర్యాలను కల్పించడం ద్వారా వృత్తి కళాకారులను స్వయం సమృద్ధివంతులుగా తీర్చిదిద్దే లక్ష్యంగా కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఓబిసిల సాధికారతకు బీజేపీ కట్టుబడి ఉందన్నారు.మోడీ సర్కారు అమలు చేస్తున్న పథకాలు కుల, మతాలకతీతంగా ప్రతి అర్హుడికి అందుతున్నాయని చెప్పారు. భారత్ను 'వికసిత్ భారత్'గా మార్చే క్రమంలో ఓబిసిల భాగస్వామ్యం కీలకమని, ఆ దిశగా కేంద్రం ఓబిసి రిజర్వేషన్లు, స్కాలర్షిప్లు, స్వయం ఉపాధి పథకాలను పటిష్టంగా అమలు చేస్తోందని గుర్తు చేశారు.గత పాలకుల విధానాలకు భిన్నంగా, నేడు ప్రతి రూపాయి నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకే చేరుతోందని, అవినీతికి ఆస్కారం లేని పారదర్శక పాలనను మోడీ అందిస్తున్నారని ఆయన ఉద్ఘాటించారు.

2047 నాటికి భారత్ను విశ్వగురువుగా తీర్చిదిద్దే లక్ష్యంగా 12 ఏళ్ల మోడీ ప్రభుత్వ పాలన కొనసాగిందన్నారు.మోడీ పాలనలో భారత్ ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందన్నారు. 2047 నాటికి దేశాన్ని అభివృద్ధి చెందిన దేశాల సరసన నిలబెట్టాలనే లక్ష్యంతో ప్రధాని మోడీ నిరంతరం శ్రమిస్తున్నారని, ఆ లక్ష్య సాధనలో ప్రతి కార్యకర్త భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు, ఓబీసీ మోర్చా జిల్లా ప్రబారి రంగు భాస్కరాచారి , రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుగొండ నాగేశ్వర్ రెడ్డి, పుప్పాల రఘు, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి అడిచర్ల రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల రాజేందర్, బెజ్జంకి మండల బిజెపి అధ్యక్షులు కోలిపాక రాజు ,అప్పని తిరుపతి, ఎర్రోజు లక్ష్మణ్, ఇంగ్లీ ప్రభాకర్, మార్కొండ రమేష్ , ఓబిసి మోర్చా మండల కన్వీనర్లు దురశేటి రమేష్, నూనె అంజి, అంబటి స్వామి, అంబటి స్వామి గుంటి మహేష్ ,నూనె అంజి, వంగల ఆంజనేయులు, ఉషా కోయిల రమేష్ అశ్విన్ తేజ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ములుగు కలెక్టర్‌ని కలిసిన బడే నాగజ్యోతి





**ములుగు, జూన్ 20, మనం ప్రతినిధి:** బీఆర్ఎస్ పార్టీ ములుగు నియోజకవర్గ ఇంచార్జ్ బడే నాగజ్యోతి నేడు ములుగు జిల్లా కలెక్టర్గా ఇటీవలే బాధ్యతలు స్వీకరించిన భోర్కడే హేమంత్ సహదేవరావు ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ములుగు జిల్లాలో అధికారాన్ని అడ్డుపెట్టుకొని అధికార పార్టీ నాయకులు గ్రామాల్లో గెలిచినా టిఆర్ఎస్ పార్టీ సర్పంచులను, ఏ విధంగా ఇబ్బంది పెడుతున్నారో వారికీ వివరించారు, ప్రభుత్వ కార్యక్రమల్లో ప్రోటోకాల్ కూడా పాటించట్లేదని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు జిల్లా అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, గిరిజన ప్రాంతాల అభివృద్ధి వంటి పలు అంశాలపై చర్చించారు. ములుగు జిల్లా ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని బడే నాగజ్యోతి కోరారు. జిల్లా సమగ్ర అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని ఆమె తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్కు శుభాకాంక్షలు తెలియజేసి,సత్కరించారు.ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్. కుటుంబ సభ్యులు పాల్గొన్నారు

## ఎస్సీ ఉప కులాలు వర్గీకరణను ఉపయోగించుకోవాలి



- ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు అంబాల చంద్రమౌళి మాదిగ

**మహాదేవపూర్ జూన్ 20మనం న్యూస్:** మహదేవపూర్ మండల కేంద్రంలో గో టు విలేజ్ కార్యక్రమంలో భాగంగా బ్రాహ్మణపల్లి గ్రామంలో మండల అధ్యక్షులు బెల్లంపల్లి సురేష్ మాదిగ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రాష్ట్ర నాయకులు అంబాల చంద్రమౌళిమాదిగ హాజరవుతూ ఎస్సీ వర్గీకరణనుఎస్సీఉపకులాలు సద్వినియోగం చేసుకోవాలని ఈ వర్గీకరణ కోసం 30 సంవత్సరాల సుదీర్ఘ పోరాటంలో మాదిగలకు వర్గీకరణఫలితాలుఅనుభవించాలంటే విద్య రంగంలో ముందు వరుసలో ఉపకులాలుఉండిఉన్నత స్థాయికి చేరాలని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు బెల్లంపల్లి సురేష్ జిల్లా సీనియర్ నాయకులు నోముల శ్రీనివాస్. గాజుల బిక్షపతి. ఎర్ర భద్రయ్య. అంతడుపుల సురేష్ . సిరిపంగా చంటి కోయల సత్యం తూటి చర్ల దుర్గయ్య,అంబాల రంజిత్ అంబాల రాజశేఖర్ అంబాల వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు

## రోడ్డు ప్రమాదాల నివారణకు సమన్వయంతో కృషి చేయాలి

- రోడ్లపై వర్షపు నీరు నిల్వ కాకుండా తక్షణ చర్యలు తీసుకోవాలి
- జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా




**కరీంనగర్, జూన్ 20(మనం బ్యూరో):** రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. వర్షాకాలంలో అధికారులు అప్రమత్తంగా వ్యవహరిస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఈ సమావేశానికి పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, ఆర్అండ్బీ శాఖ అధికారులు, నేషనల్ హైవే అథారిటీ ప్రతినిధులు, రవాణా శాఖ అధికారులు, మున్సిపల్ అధికారులు తదితరులు హాజరయ్యారు. రోడ్డు భద్రతా కమిటీ చైర్పర్సన్గా కలెక్టర్ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని, ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న బ్లాక్స్పాట్లను గుర్తించి, అక్కడ స్పీడ్ బ్రేకర్లు, రిఫ్లెక్టర్లు, హెచ్చరిక బోర్డులు, రోడ్డు మార్కింగ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. వర్షాకాలంలో వరద నీరు నిలిచే రహదారులపై ప్రత్యేక దృష్టి సారించి, నీటి పారుదల వ్యవస్థలను మెరుగుపరచాలని పేర్కొన్నారు. రోడ్లపై ఏర్పడిన గుంతలను యుద్ధ ప్రాతిపదికన పూడ్చివేసి, దెబ్బతిన్న రహదారులను వెంటనే మరమ్మతు చేయాలని అధికారులను ఆదేశించారు. వాహనదారులకు స్పష్టంగా కనిపించేలా ప్రమాదకర మలుపులు, కల్వర్టులు, వంతెనల వద్ద ప్రతిబింబించే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, కల్వర్టులకు పసుపు రంగు వేయించి హెచ్చరిక గుర్తులు ఏర్పాటు చేయాలని సూచించారు. కరీంనగర్ నగరంలోని ప్రధాన రహదారులపై వీధి దీపాల పనితీరును ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, వెలుతురు లేని ప్రాంతాల్లో అదనపు లైటింగ్ సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. వర్షపు నీరు రోడ్లపై నిల్వ కాకుండా డ్రైనేజీ వ్యవస్థలను శుభ్రపరచడంతో పాటు ముందస్తు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. వర్షాకాలంలో ట్రాఫిక్ అంతరాయాలు ఏర్పడకుండా నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు పోలీసులు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్లాలని సూచించారు. ముఖ్యంగా పాఠశాలలు, కళాశాలలు, ఆసుపత్రులు, రద్దీ కూడళ్ల వద్ద ట్రాఫిక్ నియంత్రణ చర్యలు మరింత బలోపేతం చేయాలని చెప్పారు. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ, మానవ తప్పిదాలు, అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, హెల్మెట్ ధరించకపోవడం, సీటుబెల్ట్ వినియోగించకపోవడం వంటి కారణాల వల్లే అధిక శాతం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడంతో పాటు నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ పరిధిలో వర్షపు నీరు నిలిచే 16 ప్రాంతాలను ఇప్పటికే గుర్తించినట్లు ఆయన వెల్లడించారు. ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. అలాగే పాఠశాలల పరిసరాల్లో జీబ్రా క్రాసింగ్లు, హెచ్చరిక బోర్డులు, వేగ నియంత్రణ సూచికలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్టీఏ సభ్యుడు పడాల రాహుల్ మాట్లాడుతూ, తీగలగుట్టపల్లి ఆర్ఓబీ వంతెన వద్ద రోడ్డు గుంతల కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు సంబంధిత శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి, ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ సమావేశంలో ఆర్టీఏ మెంబర్ పడాల రాహుల్ అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ నేషనల్ హైవేస్ ప్రాజెక్టు డైరెక్టర్ భరద్వాజ్ టౌన్ ఏసిపి వెంకటస్వామి ఆర్ అండ్ బి ఈఈ నరసింహ చారి పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రైతు పండించిన ప్రతి గింజకు గిట్టుబాటు ధర కల్పించడమే ప్రభుత్వ ప్రధాన ఏకైక


- పాలమూరు జిల్లాలో రబీ 2025-26 ధాన్యం కొనుగోళ్లు పూర్తి
- 21,585 మంది రైతుల ఖాతాల్లో రూ.265 కోట్లు జమా
- మిగిలిన రూ.12 కోట్లు మూడు రోజుల్లో విడుదల
- సవాళ్లను అధిగమించి విజయవంతంగా ధాన్యం సేకరణ పూర్తి చేశాం
- అన్నిశాఖల అధికారులు అభినందించిన జిల్లా కలెక్టర్...
- మహబూబ్ నగర్ జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా

**ఉమ్మడి మహబూబ్ నగర్ జూన్ 20 (మనం బ్యూరో):** రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రబీ 2025-26 సీజన్లో మహబూబ్నగర్ జిల్లాలో రైతులు పండించిన ధాన్యాన్ని కనీస మద్దతు ధర (ఎమ్మార్పీ) కింద కొనుగోలు చేసేందుకు జిల్లా వ్యాప్తంగా 180 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి విజయవంతంగా కొనుగోలు ప్రక్రియను పూర్తి చేసినట్లు పాలమూరు జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా తెలిపారు. జిల్లాలో ఐకేపీ (ఇందిరా క్రాంతి పథం), పీఏసీఎస్ (ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు), మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా మొత్తం 22,414 మంది రైతుల నుండి 1,16,345.800 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఇందులో 41,996 మెట్రిక్ టన్నుల సన్న రకం ధాన్యం, 74,349.800 మెట్రిక్ టన్నుల దొడ్డు రకం ధాన్యాన్ని సేకరించినట్లు పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం వేగవంతంగా చెల్లింపులు చేస్తోందన్నారు. ఇప్పటి వరకు 21,585 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో సుమారు రూ.265 కోట్ల మేర ధాన్యం కొనుగోలు నగదును జమా చేసినట్లు తెలిపారు. మిగిలిన రైతులకు సంబంధించిన సుమారు రూ.12 కోట్ల చెల్లింపులు కూడా రానున్న మూడు రోజుల్లో విడుదల చేయనున్నట్లు కలెక్టర్ ఈ సందర్భంగా వెల్లడించారు. ఈ సీజన్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియ అనేక సవాళ్ల మధ్య కొనసాగినప్పటికీ, జిల్లా యంత్రాంగం సమన్వయంతో వాటిని సమర్థవంతంగా ఎదుర్కొని విజయవంతంగా పూర్తి చేసిందని కలెక్టర్ పేర్కొన్నారు. ముఖ్యంగా కొనుగోలు ప్రక్రియ మధ్యలో జిల్లాలో అకస్మాత్తుగా కురిసిన భారీ వర్షాల కారణంగా కొన్ని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసే పరిస్థితులు ఏర్పడినప్పటికీ, అధికారులు వెంటనే స్పందించి తడిసిన ధాన్యాన్ని సమీప బాయిల్ రైస్ మిల్లులకు తరలించే ఏర్పాట్లు చేసి రైతులకు ఎటువంటి నష్టం జరగకుండా చర్యలు తీసుకున్నారని తెలిపారు.

అదేవిధంగా కొన్ని రైస్ మిల్లుల్లో దిగుమతి సమస్యలు తలెత్తిన సందర్భాల్లో ధాన్యంతో వచ్చిన లారీలను సకాలంలో ఖాళీ చేయించడం జరిగిందన్నారు. ధాన్యం నిల్వలో ఆలస్యం జరగకుండా జిల్లా, మండల, గ్రామ స్థాయిలలో ప్రత్యేక అధికారులను నియమించి నిరంతర పర్యవేక్షణ నిర్వహించినట్లు పేర్కొన్నారు. ధాన్యం నాణ్యతకు సంబంధించి తేమ శాతం తాలు ( నాన్-ఎఫ్ఏక్యూ) వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించడంతో పాటు, తలెత్తిన సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించి రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. రవాణా పరంగా లారీల కొరత కూడా ఒక ప్రధాన సవాలుగా మారినప్పటికీ, రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద వేచి ఉండాల్సిన పరిస్థితులు తలెత్తకుండా ఆర్టీఓ శాఖ సహకారంతో చెక్పోస్టుల ద్వారా అదనపు లారీలను సమకూర్చి కొనుగోలు కేంద్రాలకు పంపించడం జరిగిందని కలెక్టర్ వివరించారు. వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ప్రతిరోజు వాతావరణ శాఖ హెచ్చరికలు, వెదర్ యాప్ల ద్వారా వర్షాల అవకాశాలను ముందుగానే గుర్తించి కొనుగోలు కేంద్రాలకు తగిన సూచనలు జారీ చేసినట్లు తెలిపారు. ధాన్యం తడవకుండా ఉండేందుకు అదనపు టార్పాలిన్లను అందుబాటులో ఉంచి రైతులకు పంపిణీ చేయడం ద్వారా పంటను రక్షించినట్లు వెల్లడించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు ప్రతిరోజు జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించడంతో పాటు, రైస్ మిల్లర్లతో నిరంతర సమన్వయం కొనసాగించామని కలెక్టర్ తెలిపారు. జిల్లా పౌర సరఫరాల శాఖ, రెవెన్యూ, వ్యవసాయ, సహకార, పోలీసు, రవాణా శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ సమస్యలను వెంటనే పరిష్కరించడంతో కొనుగోలు ప్రక్రియ విజయవంతంగా పూర్తయిందని పేర్కొన్నారు. రైతులు పండించిన ప్రతి గింజకు గిట్టుబాటు ధర అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. అందుకు అనుగుణంగా ప్రజా ప్రతినిధుల సహకారంతో అన్ని శాఖలు సమిష్టిగా పనిచేసి ధాన్యం కొనుగోళ్లను విజయవంతం చేశాయని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల విజయవంతమైన నిర్వహణకు సహకరించిన రైతులు, ఐకేపీ మహిళా సంఘాలు, మెప్మా సిబ్బంది, పీఏసీఎస్ నిర్వాహకులు, రైస్ మిల్లర్లు, రవాణా కాంట్రాక్టర్లు, పౌర సరఫరాల శాఖ, రెవెన్యూ, వ్యవసాయ, మార్కెటింగ్ సహకార, పోలీసు, రవాణా శాఖల అధికారులు, సిబ్బందిని జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.

## మోదీపై థరూర్ ప్రశంసలు..

- రాహుల్పై బీజేపీ సెటైర్లు




**ఢిల్లీ, జూన్ 20:** కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ ప్రధాని నరేంద్ర మోడీని ప్రశంసించారు. పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో భారత నావికుల భద్రత విషయాన్ని ప్రధాని మోదీ జీ7 (ఎ7) సదస్సులో ట్రంప్ దృష్టికి తీసుకువెళ్లారని పేర్కొన్నారు. యుద్ధ సమయంలో వాణిజ్య నౌకా సిబ్బందిని లక్ష్యంగా చేసుకోవడం సరైన చర్య కాదనే భారత్ వైఖరిని స్పష్టం చేశారన్నారు. ఒమన్ తీరంలో ఇటీవల వాణిజ్య నౌకపై అమెరికా చేసిన దాడిలో ముగ్గురు భారత నావికులు మరణించిన ఘటనపై జీ7 సదస్సులో ప్రధాని మోడీ స్పందించలేదని కాంగ్రెస్ విమర్శలు చేస్తోంది. ఈ విషయాన్ని బహిరంగంగా ప్రస్తావించడంలో విఫలమయ్యారని పేర్కొంది. ఈనేపథ్యంలో ప్రధాని విదేశాంగ విధానాన్ని థరూర్ ప్రశంసించడం ప్రాధాన్యం సంతరించుకుంది. దీనిపై బీజేపీ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ స్పందిస్తూ.. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి సొంత పార్టీలోనే సపోర్ట్ లేదని ఎద్దేవా చేశారు. పుట్టినరోజున (శుక్రవారం) రాహుల్కు గిఫ్ట్ రాకుండా.. ఇలాంటి సర్ప్రైజ్ రావడం బాధాకరమంటూ వ్యంగ్యాస్త్రాలు విసిరారు. కాంగ్రెస్ పార్టీ నేతలు మోడీ దౌత్యనీతిని బహిరంగంగా ప్రశంసిస్తున్నారని ప్రదీప్ భండారీ పేర్కొన్నారు. జాతీయ ప్రయోజనాలను కాపాడే విషయంలో దేశంలో ప్రధాని నరేంద్ర మోడీదే మొదటి స్థానమని అన్నారు. అయితే దేశ ప్రయోజనాలకు వ్యతిరేకంగా మాట్లాడే విషయంలో మాత్రం రాహుల్ గాంధీ ముందుంటారని ఎద్దేవా చేశారు. ఈ విషయం కాంగ్రెస్ నేతలతో సహా దేశ ప్రజలందరికీ తెలుసని వ్యాఖ్యానించారు.

## రైతు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది



- రైతులు ఎదుర్కొనే సమస్యలపై ప్రభుత్వం నిరంతరం సమీక్ష నిర్వహిస్తోంది
- జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

**చిత్తూరు, జూన్ 20 మనం న్యూస్:** రైతులకు పెట్టుబడి భారం తగ్గించి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే లక్ష్యంతో అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకం కింద 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన తొలి విడత ఆర్థిక సహాయాన్ని చిలకలూరిపేట మండలం లింగంగుంట్ల గ్రామంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రైతుల ఖాతాల్లో నిధులను జమ చేయగా జిల్లా స్థాయి కార్యక్రమం చిత్తూరు లోని జడ్పీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, చూడ చైర్మన్ కటారి హేమలత ఆధ్వర్యంలో జరిగింది. ఒఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా 46,85,838 రైతు కుటుంబాలకు రూ.3,125 కోట్ల మేర ఆర్థిక సాయం అందింది.చిత్తూరు జిల్లా కలెక్టర్ అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. రైతులు పంట సాగు ప్రారంభం నుంచి మార్కెటింగ్ వరకు అనేక సవాళ్లను ఎదుర్కొంటారని, అలాంటి ప్రతి సమస్యపై ప్రభుత్వం నిరంతరం స్పందిస్తూ పరిష్కార చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో ముఖ్య కార్యదర్శులు, మంత్రులు, ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు పాల్గొనే ప్రత్యేక బృందం రైతుల సమస్యలను ప్రతిరోజూ సమీక్షిస్తోందన్నారు. కోకో, పొగాకు, ఆక్వా, ఎరువులు, ఉద్యాన పంటలు వంటి వివిధ రంగాల్లో రైతులు ఎదుర్కొనే ఇబ్బందులపై వెంటనే చర్చించి అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.రైతులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి భారీ స్థాయిలో సబ్సిడీలు, ప్రోత్సాహకాలు అందిస్తున్నాయని తెలిపారు

## ప్లాస్టిక్ రహిత సమాజం కోసం స్టీల్ ప్లేట్లు, స్టీల్ వాటర్ బాటిల్స్ పంపిణీ




**గజ్వేల్, జూన్ 20 మనం న్యూస్:** గజ్వేల్ మండలం బెజగామ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణం లక్ష్యంగా 59 మంది విద్యార్థినీ విద్యార్థులకు స్టీల్ ప్లేట్లు, స్టీల్ వాటర్ బాటిల్స్ పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పద్మశాలి సేవా సంఘం అధ్యక్షులు బొల్లిబత్తుల దేవదాస్ మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమం లో భాగంగా పేద విద్యార్థిని, విద్యార్థులకు ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించి ప్రత్యామ్నాయంగా స్టీల్ వాటర్ బాటిల్స్ స్టీల్ ప్లేట్లు, అందజేసినట్లు తెలిపారు. పద్మశాలి సంఘం సొంత నిధులతో 13 ,500 రూపాయల విలువ గల స్టీల్ వాటర్ బాటిల్స్, స్టీల్ ప్లేట్లు, పంపిణీ ప్రతిష్టాత్మకంగా సమాజ శ్రేయస్సు ప్లాస్టిక్ రహిత సమాజం కోసం పద్మశాలి సంఘం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయు ఉపాధ్యాయురాలు బాలమణి ,ముఖ్య అతిథి గ్రామ సర్పంచ్ నకిర్త గోపాల్, ఉప సర్పంచ్ దుబ్బాక కరుణాకర్, హైస్కూల్ హెచ్.ఎం .పీ. రమేష్ ఉపాధ్యాయులు నరసింహారెడ్డి ప్రైమరీ స్కూల్ ఉపాధ్యాయులు శంకరయ్య జి. జ్యోతి జి. కనకరాజు, సభను ఉద్దేశించి వక్తలు మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత సమాజం కోసం స్టీల్ వాటర్ బాటిల్స్, ప్లేట్లు అందజేయడం అభినందనీయమని కొనియాడినారు.. దీనికి సహకరించిన దాతలు బొల్లిబత్తుల దేవదాసు, తలకొక్కుల మధుసూదన్, నాగరాజు నేత, యువజన అధ్యక్షులు ప్రేమ్ కుమార్, పాషికంటి శ్రీనివాస్, షేర్ల నర్సింలు. మహేందర్,పెండెం కృష్ణ. గారికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలమణి గారు కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో పద్మశాలి సేవా సంఘం ప్రధాన కార్యదర్శి గాడిపల్లి ఎల్లంరాజు, సిద్దిపేట జిల్లా యువజన సంఘం అధ్యక్షులు గాడిపల్లి అనూప్, సిద్దిపేట జిల్లా పద్మశాలి ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి దేవసాని వాసుదేవ్, చెప్పాల మల్లేశం, నల్ల శివకుమార్, పద్మశాలి సంఘం కులస్తులు, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థిని, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమం విజయవంతం చేసినారు.

## మహదేవపూర్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లను సందర్శించిన సర్పంచ్

**మహాదేవపూర్ జూన్ 20మనం న్యూస్:** మహదేవపూర్ మండల కేంద్రంలోని గ్రామ సర్పంచ్ హసీనా బాను ఈరోజు స్థానిక ఎస్సీ ఎస్టీ మరియు బీసీ విద్యార్థుల వసతి గృహాలను హాస్టళ్లను సందర్శించారు.ఈ సందర్శనలో భాగంగా, వారు హాస్టళ్లలోనిమౌలికసదుపాయాలు, విద్యార్థులకు పెడుతున్న భోజన నాణ్యత మరియు పరిసరాల పరిశుభ్రతను స్వయంగా పరిశీలించారు. విద్యార్థులతో ఆప్యాయంగాముచ్చటించి, వారికి ఏవైనా సమస్యలు ఉన్నాయా అనిఅడిగి తెలు సుకున్నారు. అలాగే,మెనూ ప్రకారం రోజూ పౌష్టికాహారం అందు తుందో లేదో అని హాస్టల్ వార్డెన్లను అడిగి ఆరా తీశారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూవిద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చూడాల్సిన బా ధ్యత మనందరిపై ఉందని, . హాస్టళ్లలో ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే తమదృష్టికి తీసుకురావాలని,గ్రామ పంచాయతీ తరపు నహాస్టళ్లకు అవసరమైన పూర్తి సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తుంగల శ్రీజ సంతోష్ గ్రామపంచాయతీపాలకవర్గంహాస్టల్ వార్డెన్లు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# యోగం దుఃఖాన్ని రాకముందే నివారిస్తుంది



జీవితంలోని అన్ని సుఖాలను లోతుగా పరిశీలిస్తే.. వాటన్నింటికీ ఒక పన్ను ఉంటుందని గమనిస్తాం. ఆ పన్ను దుఃఖం. ఏదైనా వస్తువును పొందక ముందు, దానిని పొందాలనే ఆత్రుతే బాధను కలిగిస్తుంది. అది లభించాక దాన్ని కోల్పోతామేమోనన్న భయం బాధిస్తుంది. అది దూరమైన తర్వాత ఆ జ్ఞాపకాలు కూడా మనస్సుకు ఎంతో వ్యథను కలిగిస్తాయి. ఇలా చూస్తే.. ఆ సుఖం ప్రారంభం నుంచి ముగింపు వరకు ఏదో ఒక రూపంలో బాధతోనే ముడిపడి ఉంటుంది.

మీకు ఏది ఆనందాన్ని ఇస్తుందో, అది ఉపశమనాన్ని కూడా ఇవ్వాలి. లేకపోతే ఆ ఆనందమే క్రమంగా బాధగా మారుతుంది. ఉదా: మీకు గులాబ్ జామున్ ఎంతో ఇష్టమని అనుకుందాం. మీరు ఒకట్రెండు లేదా మూడు, నాలుగు తినగలరు. కానీ, ఐదోది కొంచెం ఎక్కువై అసౌకర్యాన్ని కలిగించవచ్చు. తర్వాత ఎంత ఎక్కువగా తింటే అంత ఎక్కువ అసౌకర్యంగా అనిపిస్తుంది. ప్రపంచంలోని ప్రతి వస్తువు స్వభావమూ ఇదే. వేల సంవత్సరాల క్రితం యోగం యొక్క అపారమైన జ్ఞానాన్ని సరళమైన యోగా సూత్రాల రూపంలో అందించిన మహర్షి పతంజలి ఇలా చెప్పారు..

### హేయం దుఃఖమనాగతమ్

అంటే, ఇంకా రాని దుఃఖాన్ని నివారించవచ్చు. యోగం ముఖ్యోద్దేశం దుఃఖం రాకముందే దాన్ని అరికట్టడం. అయితే అది ఎలా సాధ్యం?

మహర్షి పతంజలి అన్ని బాధలకు ఐదు మూల కారణాలను పేర్కొన్నారు. అవేంటంటే.. అజ్ఞానం, అహంకారం, తృష్ణ (అతిశయ కోరిక), ద్వేషం, తెలియని దాని పట్ల భయం. అజ్ఞానం అంటే శాశ్వతం కాని దాన్ని శాశ్వతమని, శాశ్వతమైనదాన్ని నశ్వరమని భావించడం. ఇది జీవితంపై మన అవగాహనను వక్రీకరించే ప్రాథమిక అపోహ. 'నేను ఇలాంటివాడినే' అనే స్థిరమైన అభిప్రాయం మన ఎదుగుదలను అడ్డుకొని, సామర్థ్యాలను పరిమితం చేస్తుంది. అహంకారం మనలోని ఉన్నతమైన ఆత్మస్వరూపాన్ని కప్పేస్తుంది. దాంతో మనస్సు కఠినంగా, మార్పులను అంగీకరించలేని స్థితిలో ఉంటుంది. తృష్ణ మనస్సును ఎప్పుడూ అశాంతిగా ఉంచుతుంది. ద్వేషం ఫిర్యాదులు, అసంతృప్తిని నింపుతుంది. భయం కొద్దిమేర అవసరమే.. ఆహారంలో ఉప్పులా. కానీ, అది ఎక్కువైతే అభద్రతా భావనను, బాధను కలిగిస్తుంది.

ఈ ఐదు స్వయంగా దుఃఖం కావు. కానీ, ఇవి కోపం, అసూయ, నిరాశ వంటి భావోద్వేగాలకు కారణమైనప్పుడు, అవే దుఃఖానికి విత్తనాలవుతాయి. అందుకే ఇంకా మొలకెత్తని ఆ దుఃఖాన్ని ప్రారంభ దశలోనే అరికట్టాలి.

### అదెలా సాధ్యం?

చాలాసార్లు మన ప్రతికూల భావోద్వేగాల ముందు మనం నిస్సహాయులమైపోతాం. పాఠశాలలోనూ, ఇంట్లోనూ వాటిని ఎలా ఎదుర్కోవాలో ఎవరూ మనకు నేర్పరు. మనం బాధలో ఉంటే, అలాగే ఉండిపోతాం లేదా కాలమే దాన్ని నయం చేస్తుందని ఎదురుచూస్తాం. యోగం ఈ మనస్థితిని మార్చే రహస్యాన్ని అందిస్తుంది. అది మనల్ని స్వతంత్రులుగా చేస్తుంది. మన భావోద్వేగాలకు బానిసలుగా కాకుండా, మనం కోరుకున్న విధంగా ఎప్పుడైనా అనుభూతి చెందగల శక్తిని ఇస్తుంది.

యోగం కేవలం ఆసనాలు మాత్రమే కాదు.. అది ఒక జీవన విధానం. ఒక మొగ్గ పూర్తిగా వికసించే సామర్థ్యాన్ని కలిగి ఉన్నట్లే.. ప్రతి మనిషిలోనూ తన సంపూర్ణ సామర్థ్యాన్ని వికసింపజేసే శక్తి ఉంది. ఆ సంపూర్ణ వికాసమే యోగం. యోగా సాధనతో అజ్ఞానపు తెర క్రమంగా పలుచబడుతుంది. అది మనస్సును ప్రభావితం చేయలేని స్థాయికి చేరుతుంది. ఆధ్యాత్మిక మార్గంలోకి రాకముందు మీరు తరచూ కోప్పడేవారై ఉండొచ్చు. కానీ, కొంతకాలం సాధన చేసిన తర్వాత, మీ కోపం తగ్గిందని మీరు గమనిస్తారు. దుఃఖపు తెర మరింత పారదర్శకంగా మారుతుంది.

ఆనందానికి మూలం మనలోనే ఉంది. సంఘటనలన్నీ తాత్కాలికమైనవి. మనస్సును స్వచ్ఛమైన అద్దంలా ఉంచి, పరిస్థితుల వల్ల కలత చెందకుండా ఉండటం యోగం. ఇది మనల్ని తేలికపరిచే ఒక శాస్త్రం. ఇది కోపం, అసూయ, ద్వేషం, లోభం వంటి మానసిక భారాలను తొలగిస్తుంది. దుఃఖం ఉందని చెప్పడం వల్ల ఈ ప్రపంచాన్ని వదిలి పారిపోవాల్సిన అవసరం లేదు. ఈ ప్రపంచం ఆనందించడానికి ఉంది. అందమైన ప్రకృతి దృశ్యాలు చూడటానికి ఉన్నాయి. రుచికరమైన ఆహారం ఆస్వాదించడానికి ఉంది. ఈ ప్రపంచమంతా మీ అనుభవం, ఆనందం కోసం ఉంది. అయితే ఆనందిస్తూనే మీ 'స్వ'ను మరచిపోకండి. మీరు చూసే దానికంటే మీరు వేరు. మీరు అనుభవించే దాని కంటే మీరు వేరు. వచ్చి వెళ్లే సంఘటనల కంటే మీరు అతీతం. దీన్నే వివేకం అంటారు. యోగం ప్రధాన బోధన మనస్సు సమత్వాన్ని కాపాడుకోవడం. మీరు ఏ పని చేసినా పూర్తి జాగరూకతతో, అవగాహనతో చేస్తే మీరు నిజమైన యోగిగా మారతారు.

మీరు గమనించారా? సంతోషంగా ఉన్నప్పుడు మనలో ఒక విస్తరణ భావన కలుగుతుంది. అపజయం ఎదురైనప్పుడు లేదా ఎవరైనా అవమానించినప్పుడు, మనలో ఏదో కుంచించుకుపోయినట్లుగా అనిపిస్తుంది. యోగం అనేది మనలోని ఈ విస్తరణ, సంకోచం లక్షణాలపై దృష్టి పెట్టే సాధన. ఇది మన భావోద్వేగాలకు బానిసలుగా కాకుండా వాటిపై ఆధిపత్యం సాధించడానికి దోహదపడుతుంది. సహాయపడుతుంది.

### ఒక శిశువు మనకు నేర్పే యోగం

ఒక శిశువు నుంచి నేర్చుకోవాల్సింది చాలా ఉంది. శిశువు సహజంగానే ఒక పరిపూర్ణ యోగి. నిద్రిస్తున్నప్పుడు కూడా శిశువులు చిన్ముద్రలో చేతులను ఉంచుతాయి. ప్రపంచంలో ఎక్కడైనా శిశువులు నిద్రపోయేటప్పుడు ముందుగా కాళ్లను పైకెత్తి, తర్వాత పొట్టపై తిరిగి, భుజాలను పైకెత్తడానికి ప్రయత్నిస్తారు. అది భుజంగాసనం (కోబ్రా పోజ్) లాంటిదే. ఈ భూమిపై ప్రతి బిడ్డ ఏదో ఒక స్థాయిలో ఆసనాలను అభ్యసించినట్లే. ఒక శిశువు మనస్సు ఒత్తిడి లేనిది, ఆనందంతో నిండినది. కానీ, పెరిగి పెద్దవుతున్న కొద్దీ భయం, తృష్ణ, స్వీయ ప్రతిష్ఠను కాపాడుకోవాలనే ప్రయత్నం మనలో ప్రవేశిస్తాయి.

యోగం అంటే తిరిగి ఆ మూలానికి చేరుకోవడం.. మళ్లీ బాల్యపు అమాయకత్వాన్ని, సహజత్వాన్ని పొందడం.

- గురుదేవ్ శ్రీశ్రీ రవిశంకర్

# కొంచెం మెదడును ఉపయోగించండి..

- ఇజ్రాయెల్‌కు ట్రంప్ సూచన



వాషింగ్టన్, జూన్ 20: : ఇజ్రాయ్పె అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గుర్రుగా ఉన్నారు. కాల్పుల విరమణను ఉల్లంఘించి హెజ్బొల్లాపై ఇజ్రాయెల్ దాడులకు దిగడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంలో స్వయంగా జోక్యం చేసుకున్న ఆయన కొంచెం మెదడును వాడాలంటూ టెల్‌అవీవ్‌పై ఫైర్ అయ్యారు. హెజ్బొల్లాతో కాల్పుల విరమణకు అంగీకరించాలని తాను వ్యక్తిగతంగా ఇజ్రాయెల్‌ను కోరినట్లు ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఫోన్ ఇంటర్వ్యూలో ట్రంప్ తెలిపారు. ఇజ్రాయెల్-లెబనాన్ సరిహద్దుల్లో చోటుచేసుకుంటున్న ఉద్రిక్తతలు.. ఇరాన్‌తో కొనసాగుతోన్న శాంతి ఒప్పందానికి సంబంధించిన తన దౌత్య ప్రయత్నాలను దెబ్బతీసే ప్రమాదం ఉందని వ్యాఖ్యానించారు. ఈ దాడుల నేపథ్యంలో ఇజ్రాయెల్ అధికారులతో మాట్లాడినట్లు ట్రంప్ వెల్లడించారు. సంయమనం పాటించాలని వారిపై ఒత్తిడి చేశానని.. ఘర్షణలు ఇలాగే కొనసాగితే ఒప్పందం దెబ్బతినే ప్రమాదం ఉందని వాదించానన్నారు. ప్రశాంతంగా ఉండాలని.. కొంచెం బుర్ర ఉపయోగించి నిర్ణయం తీసుకోవాలని ఇజ్రాయెల్‌కు ట్రంప్ సూచించినట్లు ఆ మీడియా సంస్థ పేర్కొంది. అయితే, కాల్పుల విరమణ విషయంపై ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో మాట్లాడారో, లేదో ట్రంప్ వెల్లడించలేదు. ఇజ్రాయెల్ మనుగడకు తన విదేశాంగ విధాన నిర్ణయాలు చాలా అవసరమని ట్రంప్ అభిప్రాయపడ్డారు. ప్రాంతీయ ఘర్షణల నేపథ్యంలో అమెరికా జోక్యం లేకపోతే ఆ దేశం ఉనికికే ప్రమాదం ఏర్పడుతుందని వ్యాఖ్యానించారు. 'ట్రంప్ లేకపోయి ఉంటే.. ఇజ్రాయెల్ నాశనమైపోయేది. ఇరాన్‌తో ఒబామా చేసుకున్న అణు ఒప్పందాన్ని తాను రద్దు చేయకపోయి ఉంటే.. నేడు ఇజ్రాయెల్ ఉండేది కాదు' అని ట్రంప్ అన్నారు.

# 'కాస్త నోరు మూసుకుంటారా'

## ఇజ్రాయెల్ రాయబారి, ఐరాస ప్రతినిధి మధ్య వాగ్వాదం



న్యూయార్, జూన్ 20: ఐక్యరాజ్యసమితిలో రసాభాస చోటుచేసుకుంది. ఇజ్రాయెల్ రాయబారి, ఐరాస సెక్రటరీ జనరల్ ప్రత్యేక ప్రతినిధి మధ్య వాగ్వాదం నడిచింది. ఘర్షణల సమయంలో లైంగిక హింస నిర్మూలన అంశంపై న్యూయార్క్‌లో జరిగిన సమావేశంలో మాటల యుద్ధం చోటుచేసుకోవడంతో ఇతర సభ్యులు జోక్యం చేసుకోవాల్సి వచ్చింది.

### ఇంతకీ ఏం జరిగిందంటే..?

సంక్షోభ ప్రదేశాల్లో లైంగిక హింసపై ఐక్యరాజ్యసమితి విడుదల చేసిన వార్షిక నివేదిక వివాదాస్పదంగా మారింది. దీనిలో రష్యా, ఇజ్రాయెల్ దళాల పేర్లను కూడా చేర్చడంతో ఆ దేశాలు మండిపడ్డాయి. దాదాపు 15 ఏళ్ల క్రితం మొదలైన ఈ నివేదికలో తొలిసారి ఇజ్రాయెల్ పేరును చేర్చారు. పాలస్తీనాలో ఆ దేశ దళాలు చేస్తున్న హింసకు ఫలితంగానే ఐరాస ప్రతినిధి ప్రమీలా పాటెన్ దీనిని ప్రవేశపెట్టారు. పాటెన్ పక్షపాతంతో వ్యవహరించారని, ఆమె రాజీనామా చేయాలని ఈ సమావేశంలో ఇజ్రాయెల్ రాయబారి డానీ డానన్ డిమాండ్ చేశారు. అలాగే ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ పైనా విమర్శలు గుప్పించారు. దీంతో మరో యూఎన్ ప్రతినిధి వానెస్సా ఫ్రేజియర్ స్పందించారు. సభా మర్యాద కాపాడాలని, వ్యక్తిగత దాడులకు దూరంగా ఉండాలంటూ ఆమె కాస్త అరిచి చెప్పారు. అలాగే తమవద్ద సాక్ష్యాలు ఉన్నాయని పేర్కొన్నారు. 'ఇజ్రాయెల్ ఐరాసలో సభ్య దేశం. మీరు యూఎన్లో పనిచేస్తున్నారు. కాస్త మీరు నోరు మూసుకోండి. ఆ రిపోర్టు సిగ్గుచేటు. మీరు ఈ పదవిని ఎందుకు తీసుకున్నారో నాకు తెలుసు. మాకు వ్యతిరేకంగా జరుగుతోన్న ప్రచారంలో మిమ్మల్ని భాగం కానివ్వబోం'' అంటూ ఫ్రేజియర్ను ఉద్దేశించి ఇజ్రాయెల్ రాయబారి డానీ డానన్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దీంతో పరిస్థితి ఒక్కసారిగా వేడెక్కింది. కాగా.. పాలస్తీనాలో చిన్నారుల హక్కుల ఉల్లంఘనల ఘటనలు పెరగడంపై గుటెరస్ ఇప్పటికే ఆందోళన వ్యక్తంచేశారు. ఈ క్రమంలోనే తాజా పరిణామం చోటుచేసుకుంది.

# పాక్లో మీడియా స్వేచ్ఛ లేదు

## అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్



వాషింగ్టన్, జూన్ 20: పాకిస్థాన్‌లో మీడియాకు స్వేచ్ఛ లేదని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ అన్నారు. అందువల్లే ఇరాన్‌తో కుదుర్చుకున్న ఒప్పందానికి సంబంధించిన పూర్తి వివరాలను విడుదల చేయడంలో జాప్యం జరిగిందని తెలిపారు. అమెరికా-ఇరాన్ డీల్‌కు ఖతార్‌తోకలిసి పాకిస్థాన్ మధ్యవర్తిత్వం వహించిన నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. జూన్ 15న మధ్యంతర శాంతి ఒప్పందాన్ని ట్రంప్ ప్రకటించగా.. రెండు రోజుల తర్వాత ఈ ఒప్పందం అధికారిక పత్రం విడుదలైంది. పాకిస్థాన్, ఖతార్‌లో పత్రికా స్వేచ్ఛ సరిగ్గా లేకపోవడం, పారదర్శకతపై ఉన్న ఆందోళనల కారణంగానే వివరాలను విడుదల చేయడానికి వాషింగ్టన్ సమయం తీసుకుందని వాన్స్ పేర్కొన్నారు. దేశంలో భావ ప్రకటనా స్వేచ్ఛ, పత్రికా స్వేచ్ఛ, మత స్వేచ్ఛకు భంగం కలిగించే చట్టాలను ప్రభుత్వం అమలు చేయడాన్ని అమెరికా రాజ్యాంగం నిషేధిస్తుందని జేడీ వాన్స్ పేర్కొన్నారు. పాకిస్థాన్‌లో అటువంటి రాజ్యాంగపరమైన రక్షణలు లేకపోవడంతోనే ఈ ఆలస్యం జరిగిందన్నారు. ఇరాన్‌తో చేసుకున్న ఒప్పందంలో ఆ దేశానికి గణనీయమైన రాయితీలు ఇచ్చే అవకాశం ఉన్నందున.. అమెరికా అవగాహన ఒప్పందం వివరాలను గోప్యంగా ఉంచుతోందని వస్తున్న విమర్శలను ఆయన ఖండించారు.

# ట్రంప్ తీరు సిగ్గుచేటు

# అమెరికా అధ్యక్షుడిపై మెలోనీ ఫైర్

- ఫొటో కోసం ప్రాధేయపడ్డారని చెప్పడంపై మండిపాటు
- మెలోనీ పదే పదే అడిగారు..! ట్రంప్ నోట అదేమాట



రోమ్/వాషింగ్టన్, జూన్ 20 : ఫ్రాన్స్‌లో జరిగిన జీ-7 సదస్సులో తనతో ఫొటో దిగేందుకు ఇటలీ ప్రధానమంత్రి జార్జియా మెలోనీ ప్రాధేయపడ్డారని, అందుకే తాను అంగీకరించానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై దుమారం చెలరేగింది. ఇటలీ మీడియా సంస్థ "లా7"కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ ఈ మాటలన్నారు. దీనికి నిరసనగా ఇటలీ విదేశాంగ మంత్రి ఆంటోనియో తజాని తన అమెరికా పర్యటనను రద్దు చేసుకున్నారు. దేశాధ్యక్షునితోపాటు రాజకీయ ప్రముఖులందరూ మెలోనీకి సంఘీభావం తెలిపారు. అమెరికా అధ్యక్షుని ప్రకటన అసభ్యకరంగా ఉందని మంత్రులు పేర్కొన్నారు. ట్రంప్ వాదన పూర్తిగా కల్పితమని పేర్కొంటూ మెలోనీ ఒక వీడియో ప్రకటన జారీచేశారు. ఒక మిత్రదేశ ప్రధాని గురించి అమెరికా అధ్యక్షుడు ఇలా మాట్లాడటం తనను ఆశ్చర్యానికి గురిచేసిందన్నారు. "పాశ్చాత్య దేశాల శత్రువుల పట్ల, అమెరికాకు శత్రువుల విషయంలో ట్రంప్ ఇలా వ్యవహరించరు. వారి విషయంలో సర్దుకుపోతుంటారు. అది సిగ్గుచేటు. ఆయన ఒకటి గుర్తుపెట్టుకోవాలి. నేనూ, ఇటలీ ఎవరినీ ప్రాధేయపడం. ఇలాంటివి చెప్పుకోవడం ట్రంప్‌నకు కొత్తకాదు'' అని మండిపడ్డారు. కాగా... జీ-7 సదస్సులో ఫొటో కోసం ఇటలీ ప్రధాని ప్రాధేయపడ్డారని ట్రంప్ ప్రకటనను జార్జియా మెలోని తిప్పికొట్టిన విషయం తెలిసిందే. అయినప్పటికీ, ఇదే విషయాన్ని ట్రంప్ మరోసారి ప్రస్తావిస్తూ ట్రూత్ సోషల్లో తాజాగా పోస్టు చేశారు. "ఫ్రాన్స్‌లో జరిగిన సదస్సులో ఫొటో కోసం మెలోనీ పదే పదే అడిగారు. స్వదేశంలో ఆమెకున్న ప్రజాదరణ తగ్గుతోంది. బహుశా ఇరాన్ అణ్వాయుధాన్ని పొందకుండా లేదా అభివృద్ధి చేయకుండా నిరోధించే విషయంలో అమెరికాను తిరస్కరించడమే ఇందుకు కారణం కావచ్చు. ఈ విషయంలో నాటో కూడా అలాగే చేసింది. ఇటలీతోపాటు నాటో మిత్రదేశాలను రక్షించడానికి అమెరికా ఏటా వందల బిలియన్ల డాలర్లను అందిస్తున్నప్పటికీ వాళ్లు మాకు సహకారం అందించలేదు.

ముఖ్యంగా ల్యాండింగ్ సదుపాయాలను ఉపయోగించుకోనివ్వలేదు. ఇరాన్‌ను అమెరికా ఓడించిన తర్వాత తన బలాన్ని పెంచుకునేందుకు ఇప్పుడు మళ్లీ అమెరికాతో స్నేహం చేయాలని ఆమె కోరుకుంటున్నారు'' అని ట్రంప్ విమర్శించారు.

# కూలిన ఆలయ మండపం పైకప్పు..

- ముగ్గురి మృతి



ముంబయి, జూన్ 20: మహారాష్ట్రలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. పర్భణీ జిల్లా యశ్వాడీ గ్రామంలోని హనుమాన్ ఆలయ మండపం పైకప్పు కూలిపోయింది. దాంతో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. శిథిలాల కింద చిక్కుకుపోయిన పలువురిని స్థానికులు, పోలీసులు బయటకు తీశారు. శనివారం కావడంతో ఉదయం నుంచి భారీ సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చారు. రద్దీ ఎక్కువకావడంతో మండపం పైకప్పులో కొంతభాగం, పిల్లర్ కూలిపోయింది. ఆ మండపం నిర్మాణంలో ఉండటంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఆకస్మిక ఘటనతో భక్తులంతా ఒక్కసారిగా భయాందోళనలకు గురయ్యారు. శిథిలాల కింద చిక్కుకొన్న 25 మంది భక్తులను బయటకు తీశారు. గాయపడిన వారిని వెంటనే దగ్గరలోని ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

# కాంగ్రెస్ నేత హత్య కేసు

## 20 ఏళ్ల తర్వాత నిర్దోషులుగా తీర్పు



ముంబయి, జూన్ 20 : మహారాష్ట్ర కాంగ్రెస్ నేతతో పాటు ఆయన కారు డ్రైవర్ హత్య కేసులో శనివారం ముంబయిలోని ప్రత్యేక న్యాయస్థానం సంచలన తీర్పు వెలువరించింది. నిందితులందరినీ నిర్దోషులుగా తేల్చింది. 2006లో ఈ హత్యలు జరగగా దాదాపు 20 ఏళ్ల తర్వాత తీర్పు రావడం గమనార్హం. పవన్‌రాజే నింబాల్కర్.. ఉస్మానాబాద్‌కు చెందిన ప్రముఖ కాంగ్రెస్ నేత. 2006, జూన్ 3న ముంబయి నుంచి ఉస్మానాబాద్‌కు వస్తున్న నింబాల్కర్ వాహనాన్ని ఇద్దరు వ్యక్తులు అడ్డగించి, కాల్పులు జరిపారు. కలంబోలి ప్రాంతంలో జరిగిన ఈ ఘటనలో కాంగ్రెస్ నేతతో పాటు ఆయన డ్రైవర్ కూడా ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన అప్పట్లో మహారాష్ట్ర రాజకీయాల్లో సంచలనం సృష్టించింది. బాంబే హైకోర్టు ఈ కేసును సీబీఐకి అప్పగించింది. ఈ హత్యకు అప్పటి ఎన్సీపీ నేత పదమ్‌సిన్హా పాటిల్ కుట్రపన్ని, నిధులు సమకూర్చినట్లు దర్యాప్తు సంస్థ గుర్తించింది. పాటిల్‌తోపాటు మరో ఎనిమిది మందిని నిందితులుగా చేర్చింది. తర్వాత ఒక నిందితుడు అప్రూవర్‌గా మారాడు. రాజకీయ వైరం కారణంగానే ఈ హత్య జరిగిందని సీబీఐ ఛార్జిషీట్లో పేర్కొంది. తెర్నా షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యాన్ని నింబాల్కర్ వ్యతిరేకించడం హత్యకు పురిగొల్పిందని, అందుకోసం పాటిల్ రూ.30 లక్షల సుపారీ ఇచ్చారని అభియోగాలు మోపింది. అయితే, ఈ ఆరోపణలను పాటిల్ తోసిపుచ్చుతూ వచ్చారు. ఇరుపక్షాల వాదనలు విన్న ప్రత్యేక న్యాయస్థానం ఈ కేసులో ఎనిమిది మందిని నిర్దోషులుగా ప్రకటిస్తూ తీర్పు వెలువరించింది. మహారాష్ట్ర హోంమంత్రిగా పని చేసిన పాటిల్.. ప్రస్తుత డిప్యూటీ సీఎం సునేత్ర పవార్‌కు సోదరుడు కూడా.

# విశ్వవ్యాప్తమైన భారతీయ యోగా

## ఐక్యరాజ్యసమితి చీఫ్ ఆంటోనియో గుటెరస్

న్యూయార్క్, జూన్ 20 : ప్రాచీన భారత మూలాలున్న యోగా విశ్వవ్యాప్తమైందని, అన్ని మతాలకు చెందిన లక్షల మందికి ఇది ఉపయోగపడుతోందని ఐక్యరాజ్యసమితి చీఫ్ ఆంటోనియో గుటెరస్ వ్యాఖ్యానించారు. ఐరాసలోని భారత శాశ్వత కమిషన్ సంస్థ ప్రధాన కార్యాలయంలో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఓ కార్యక్రమం నిర్వహించింది. దీనికి యోగా సాధకులు, దౌత్యవేత్తలు, ఐరాస అధికారులు, దౌత్య సిబ్బంది హాజరయ్యారు. 2028- 29 నాటికి ఐరాస భద్రతా మండలిలో భారత్ తాత్కాలిక సభ్యత్వాన్ని ఈ సందర్భంగా ప్రకటించారు. ప్రపంచవ్యాప్తంగా జనాభా వృద్ధాప్యం వైపు అడుగులు వేస్తున్న కొద్దీ శారీరక, మానసిక శ్రేయస్సు, చలనశీలత ప్రాముఖ్యతను యోగా మనకు తెలియజేస్తుందని ప్రసంగించిన గుటెరస్ నమస్తే అంటూ తన ఉపన్యాసాన్ని ముగించారు.


### చైనాలో భారత్ యోగా..

బీజింగ్‌లోని భారత రాయబార కార్యాలయ ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన యోగా కార్యక్రమంలో చైనా ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. దీనిలో వెయ్యి మందికి పైగా యోగా ఔత్సాహికులు పాల్గొన్నారని, వీరిలో ఎక్కువ శాతం చైనీయులు ఉన్నారని భారత రాయబారి విక్రమ్ దొరైస్వామి తెలిపారు. పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరుకావడం ప్రపంచవ్యాప్తంగా యోగాకు పెరుగుతున్న ఆదరణకు నిదర్శనమని, చైనాలో యోగా సాధకులు పెరుగుతుండటం తనకు ప్రత్యేక ఆనందాన్నిస్తోందని ఆయన వ్యాఖ్యానించారు.



## ప్రజాధనం కాజేయడానికి..

# మేయర్ కిడ్నాప్ డ్రామా..!



మెక్సికో, జూన్ 20: మెక్సికోకు చెందిన ఓ మేయర్‌పై సంచలన ఆరోపణలు వచ్చాయి. రూ.కోట్ల ప్రజాధనాన్ని కొట్టేయడానికి ఏకంగా కిడ్నాప్ డ్రామా ఆడినట్లు వస్తున్న ఆరోపణలు తాజాగా తీవ్ర చర్చనీయాంశం అయ్యాయి. వివరాల్లోకి వెళితే.. మెక్సికోలోని టెనాన్సింగో పట్టణానికి నాన్సీ నాపొలిస్ మేయర్‌గా వ్యవహరిస్తున్నారు. ఇటీవల కొందరు సాయుధ వ్యక్తులు తుపాకీతో బెదిరించి.. ఆమెను బలవంతంగా తీసుకెళ్లారు. కిడ్నాపర్లు ఆమెను విడుదల చేయాలంటే.. 2.3 మిలియన్ డాలర్లు (భారత కరెన్సీలో రూ.18 కోట్లకు పైగా) ఇవ్వాలని డిమాండ్ చేశారు. నగదు ఇవ్వకపోతే మేయర్‌తోపాటు ఆమె కుటుంబసభ్యులను చంపేస్తామని బెదిరించారు. దీనిపై ఓ వ్యక్తి ఇచ్చిన సమాచారం ఆధారంగా అధికారులు విస్తృత దర్యాప్తు చేపట్టి.. కిడ్నాపర్ల నుంచి ఆమెను రక్షించారు. దీనికి సంబంధించి ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకొని విచారించగా, వారి నుంచి పొంతన లేని సమాధానాలు వచ్చాయి. దీంతో ఈ కిడ్నాప్ నాటకమని దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు. ఈనేపథ్యంలో ప్రజాధనాన్ని కాజేసేందుకు మేయర్ కావాలనే ఈ కిడ్నాప్ డ్రామా ఆడినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. నాపొలిస్ విడుదలకు ప్రైవేట్ నిధులు సమకూరకపోతే.. ప్రభుత్వ డబ్బును ఉపయోగించాలని ఆమె బంధువులు సూచించారని ప్రాసిక్యూటర్లు ఆరోపించారు. ఈ వ్యవహారానికి సంబంధించి ఆమెపై ఎలాంటి అరెస్ట్ వారెంట్ జారీ కాలేదు. అయితే, ఆమె భర్త, మరో వ్యక్తి పరారీలో ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ కేసుకు సంబంధించి జులై 9న ఆమెను విచారించేందుకు అనుమతివ్వాలని కోర్టును కోరారు. కాగా.. ఈ ఆరోపణలన్నింటినీ నాపొలిస్ ఖండించారు. ఇవి రాజకీయ ప్రేరేపితమైనవిగా అభివర్ణించారు. ఈ కేసుకు సంబంధించిన అధికారులకు సహకరించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఎక్స్‌లో పోస్టు చేసిన వీడియోలో పేర్కొన్నారు.

# బాల్య మిత్రుల ఆర్థిక సహాయం



తిరుమలగిరి, జూన్21 (మనం న్యూస్): తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1993-94 పదవ తరగతి బాల్యమిత్రుడు సంకేపల్లి సోమిరెడ్డి ఇటీవల మృతి చెందారు. వారి కుమారుడు రిత్విక్ రెడ్డి కి బాల్య మిత్రులందరికీ రూ 30000 లు ముప్పైవేల ఆర్థిక సహాయం అందజేశారు. సోమిరెడ్డి కుటుంబాన్ని విమర్శించి సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మిత్రులు దుంపల కృష్ణారెడ్డి, పయంల వెంకన్న, బేతు ఎర్ర య్య, కొంపెల్లి బుచ్చిమల్లు గౌడ్, మరియు వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# రాజీవ్ గాంధీ ఎత్తిపోతల పథకం పనులను పరిశీలించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

మేళ్లచెరువు, జూన్ 20 మనం న్యూస్: సూర్యాపేట జిల్లాచింతలపాలెం మండలం లోని బుగ్గ మాధవరం వద్ద 394 కోట్ల రూపాయలతో 14 వేల ఎకరాలకు సాగు నీరు అందించే రాజీవ్ గాంధీ ఎత్తిపోతల పథకం పనులను శనివారం రాష్ట్ర నీటిపారుదల మరియు ఆహార పౌర సరఫరాల శాఖ మంత్రి నల్లమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి పరిశీలించారు. ముందుగా మంత్రి అండర్ గ్రౌండ్ నందు పంపు హౌస్ పనులను పరిశీలించారు. అనంతరం సమావేశంలో మాట్లాడుతూ కృష్ణా నది నుండి 236 క్యూసెక్కుల నీటిని, ఎత్తిపోసేలా ప్రాజెక్టు రూపకల్పన చేశామని,122 మీటర్ల ఎత్తుకు నీటిని ఎత్తిపోసే అత్యాధునిక పంపిణీ వ్యవస్థ ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. ప్రాజెక్టు నిర్మాణంలో నాలుగు భారీ పంపులు, మూడు వర్టికల్ ట్విన్ పంపులు ఏర్పాటు చేశామని మంత్రి అన్నారు. దాదాపు 22 కిలోమీటర్ల ప్రెషర్ మెయిన్ పైప్ లైన్ లో ఇప్పటివరకు 14 కిలోమీటర్ల ఫ్యాబ్రికేషన్ పూర్తి చేశామని ఆరు కిలోమీటర్ల మేర పైపులైన్ వేసినట్లు మంత్రి తెలిపారు. 1300 మీటర్ల అప్రోచ్ ఛానల్లో 400 మీటర్ల మేర భూ



తవ్వకాలు కొనసాగుతున్నాయని, ప్రతివారం స్వయంగా పనుల పురోగతిని సమీక్షిస్తానని మంత్రి అన్నారు. కృష్ణా నది మీద నిర్మిస్తున్న రాజీవ్ గాంధీ ఎత్తిపోతల పథకం, ప్రాజెక్ట్ మొత్తం ఖర్చు 394 కోట్లు కాగా ఈ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 4 మండలాలలో 14,100 ఎకరాలకు సాగునీరు, అందించడం జరుగుతుందని అన్నారు. మేళ్లచెరువు మండలం కందిబండ గ్రామంలో 2494 ఎకరాలకు, రామాపురం గ్రామమునకు 3826 ఎకరాలకు, చింతలపాలెం కు 149 ఎకరాలకు, దొండపాడు గ్రామమునకు 1589 ఎకరాలకు, కోదాడ మండలం గణపవరం గ్రామంనకు 2437 ఎకరాలకు, కూచిపూడి గ్రామంనకు 1060 ఎకరాలకు, ఎర్రవరం, రామలక్ష్మి పురం, బిక్య తండా గ్రామాలకు1634 ఎకరాలకు, తొగర్రాయి గ్రామంనకు 831 ఎకరాలకు, అలాగే చిలుకూరు మండలం నకు 80 ఎకరాలకు సాగునీరు అందించడం జరుగుతుందని మంత్రి ఉత్తమ్ అన్నారు. దీని కొరకు 35 ఎకరాల రైతుల భూములను కొనుగోలు చేసి, వారికి నష్టపరిహారంగా 17 కోట్ల 50 లక్షలు చెల్లించడం జరిగిందని, ఇట్టి ప్రాజెక్టును నాణ్యతతో ఎటువంటి లోపాలు లేకుండా త్వరగా పూర్తి చేయాలని మంత్రి గుత్తేదారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, జిల్లా ఎస్పీ కే నరసింహ, ఇరిగేషన్ ఎస్సి నాగభూషణం, డిసిసి జిల్లా అధ్యక్షులు గుడిపాటి నరసయ్య, వంగవీటి రామారావు, సర్పంచ్, స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా మంత్రి ఉత్తమ్ జన్మదిన వేడుకలు



- **ఎమ్మెల్సీ శంకర్ నాయక్ జాన్ పాడు దర్గాలో పూజలు**

పాలకీడు, జూన్ 20 (మనం న్యూస్): రాష్ట్ర భారీ నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ నలమాధ ఉత్తమ్ కుమార్ రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం పాలకీడు మండల పరిధిలోని జాన్ పహాడ్ దర్గాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వైభవంగా జరుపుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్రి ఉత్తమ్ నిండు నూరేళ్లు సంపూర్ణ ఆయురారోగ్యాలతో జీవించాలని,రాష్ట్ర ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని కోరుతూ ఆదివాసీల చైర్మన్, ఎమ్మెల్సీ శంకర్ నాయక్ తోపాటు మండలంలోని సర్పంచ్ లు ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి దర్గాలో ప్రత్యేకంగా పూజలు చేశారు. అంతకుముందు జాన్ పాడు సైదన్న సమక్షంలో జన్మదిన కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, మాజీ జెడ్పిటిసి మాలోతు మోతిలాల్ నాయక్ స్వంత ఖర్చులతో రూపొందించి తాజాగా విడుదల చేసిన దద్దరిల్లిన మంత్రి ఉత్తమ్ అనే వీడియో, ఆడియో సాంగ్ కు ఎమ్మెల్సీ శంకర్ నాయక్ లయబద్ధంగా స్టెప్పులు వేసి అలరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ భూక్యా గోపాల్, మార్కెట్ కమిటీ చైర్మన్ బెల్లంకొండ నరసింహారావు, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు నీమా నాయక్, వివిధ గ్రామాల సర్పంచులు కవిత కిరణ్, సురేష్, లక్ష్మి సైదా, సునీత లక్ష్మణ్, మంగమ్మ సోమ్లా నాయక్, అందే సుధారాణి రాజు, యాతం శ్రీను, కొత్తపల్లి సుశీల ఏసు, వరలక్ష్మి రామానుజ రెడ్డి, కాంగ్రెస్ ఎస్టి సెల్ మండల అధ్యక్షుడు నాగరాజు ఎస్సీ సెల్ అధ్యక్షుడు బుడిగ సైదులు, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు జ్యోతి ఎన్ఎస్ యు ఐ అధ్యక్షులు సందీప్, నాయకులు పిడమర్తి ప్రేమ్ కుమార్, శ్రీకాంత్, శోభన్, రాము పాల్గొన్నారు.

# క్రమశిక్షణతో కూడిన ఆటలతోనే గుర్తింపు




- **ములుగు వాలీబాల్ ప్రీమియర్ లీగ్ ప్రారంభించిన తెలంగాణ వాలీబాల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హనుమంత రెడ్డి**

ములుగు, జూన్ 20(మనంన్యూస్): క్రమశిక్షణతో కూడిన ఆటలతోనే క్రీడాకారులకు మంచి గుర్తింపు లభిస్తుందని తెలంగాణ వాలీబాల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రోటరీ పాస్ట్ డిస్టిక్ గవర్నర్ ఎన్ వీ హనుమంత రెడ్డి అన్నారు. శనివారం రోటరీ క్లబ్ గజ్వేల్ ఆధ్వర్యంలో ములుగులో నిర్వహించిన మొలుగు వాలీబాల్ ప్రీమియర్ లీగ్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడల్లోనూ నైపుణ్యత సాధించాలని సూచించారు. గెలుపు ఓటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడల్లో రాణించాలని, పార్టిసిపేషన్ తోనే నైపుణ్య పెరుగుదల జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో రోటరీ అసిస్టెంట్ గవర్నర్ జగదీశ్వర్, రోటరీ క్లబ్ ఆఫ్ గజ్వేల్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, కార్యదర్శి సాయి రెడ్డి, కోశాధికారి బాలకష్ణ, చైర్మన్లు కొడాలి చంటి, కర్ణాకర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ బట్టు అంజిరెడ్డి, రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్ జిల్లా అధ్యక్షుడు కడపల నరసింహారెడ్డి, రైసింగ్ గరుడ స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ హరీష్, క్రీడాకారులు పాల్గొన్నారు.

# జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలను మోడల్ పాఠశాలలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

- **ప్రతీక్ ఉన్నత పాఠశాలలో త్వరలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ల్యాబ్ ప్రారంభం**
- **95 శాతం మార్కులు సాధించిన విద్యార్థులను విమానం ద్వారా ప్రయాణం**
- **రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి**

నల్లగొండ,జూన్ 20 (మనం ప్రతినిధి ): ఆగస్టు నాటికి నల్గొండ నియోజకవర్గ పరిధిలోని 40 ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పించి మోడల్ పాఠశాలలుగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. శనివారం ఆయన నల్గొండ జిల్లా కేంద్రంలోని బొట్టుగూడలో ఉన్న కోమటిరెడ్డి ప్రతీక్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించారు. అంతేకాక ప్రతీక్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను, ఒకేషనల్ జూనియర్ కళాశాలను సైతం సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ అభివృద్ధి నిర్మాణాలలో కనిపించదని, విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించడం ద్వారా వారి జీవితా లు మారిపోతాయని ,అందువలన విద్య పైన తాను ఎక్కువగా దృష్టి సారించినట్లు తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా నిర్మించిన బొట్టు గూడా కోమటిరెడ్డి ప్రతీక్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ద్వారా విద్యార్థులు ఐఏఎస్, ఐపీఎస్, ఐఐటీలను సాధించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ సంవత్సరం పదవ తరగతిలో ప్రతీక్ ప్రభుత్వ పాఠశాల ద్వారా 95% పైగా ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను తన సొంత నిధులతో ఢిల్లీకి విమానంలో పంపిస్తామని, అందువల్ల విద్యార్థులు బాగా చదివి మంచి మార్కులు తెచ్చుకోవాలని అన్నారు .గత సంవత్సరం నల్గొండ జిల్లా, తిప్పర్తి పాఠశాల విద్యార్థులు 13 మంది 97 ,98% ఉత్తీర్ణత సాధిస్తే వారందరినీ విమానంలో విశాఖపట్నం పంపించడమే కాకుండా, స్టార్ హోటల్ ఏర్పాటు చేసి అరకు ఇతర పర్యాటక ప్రాంతాలన్నింటిని ఉచితంగా తిరిగి వచ్చేలా ఏర్పాటు చేశామన్నారు. కోమటిరెడ్డి ప్రతీక్ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు ఐఐటి, ఎంబీబీఎస్ ,ఐపీఎస్, ఐఏఎస్లు



సాధించాలని ఆ విధంగా లక్ష్యంతో చదవాలని, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులను సొంత పిల్లల లాగా చదివించాలని, ప్రత్యేక శ్రద్ధ తీసుకొని చదివించాలని అవసరమైన విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిర్వహించాలని, పదవ తరగతికి తప్పనిసరిగా ప్రైవేటు క్లాసులు తీసుకోవాలన్నారు. ప్రతీక్ పాఠశాలలో నెలరోజుల్లో ఒకటవ తరగతి నుండి పదవ తరగతి వరకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ నేర్పించే విధంగా ల్యాబ్ ను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు .బొట్టుగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 600 వరకు విద్యార్థుల సంఖ్య చేరుకున్నందున ఇకపై ఎలాంటి ప్రవేశాలు తీసుకోవడం లేదని స్పష్టం చేశారు. త్వరలోనే హరే రామ హరే కృష్ణ వారి సహకారంతో పాఠశాల పిల్లలకు మంచి నాణ్యమైన ఆహారాన్ని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నల్గొండ నియోజకవర్గ పరిధిలోని 30 నుండి 40 పాఠశాలలను పైలెట్ మోడల్ లో తీసుకుని ఆ పాఠశాలల్లో తాగునీరు, టాయిలెట్లు, డ్యూయల్ డెస్క్ కంప్యూటర్లు, ఇతర సౌకర్యాలు కల్పించి మోడల్ పాఠశాలలుగా తీర్చిదిద్దుతామని మంత్రి వివరించారు. జిల్లావ్యాప్తంగా పదవ తరగతిలో 95 % పైగా ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా ఇంటర్, మెడిసిన్, ఐఐటి వంటి కోచింగ్ లకు ఆర్థిక సహకారం అందిస్తామని తెలిపారు తెలంగాణలోనే నల్గొండ జిల్లా పాఠశాలలను మోడల్ పాఠశాలలు గా తీర్చిదిద్దేలా కృషి చేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. అనంతరం మంత్రి కోమటిరెడ్డి ప్రతీక్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను, ఒకేషనల్ జూనియర్ కళాశాలలను సందర్శించి 2 కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య, సౌకర్యాలు,అవసరమైన సౌకర్యాలు, తదితర వివరాలను ప్రిన్సిపల్స్ ద్వారా అడిగి తెలుసుకున్నారు. కాగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 800 మంది, ఒకేషనల్ జూనియర్ కళాశాలలో 900 మంది విద్యార్థుల సంఖ్య ఉందని, వారికి సరిపడా గదులు లేవని గదుల కొరత ఉందని, అలాగే ఒకేషనల్ కళాశాలలో సామాగ్రి ఏర్పాటుకు గదులు అవసరం ఉన్నాయని, ప్రిన్సిపల్స్ మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాల్సిన బాధ్యత అధ్యాపకులపై ఉందని, చదువుకుంటే తప్పనిసరిగా మార్పు వస్తుందని ,ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని గుణత్మక విద్యను అందిస్తే వారి భవిష్యత్తు మారిపోతుందని అన్నారు. స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై .అశోక్ రెడ్డి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎం .రాజేందర్, ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఏ. ఉపేందర్, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు మంత్రి వెంట ఉన్నారు .

# నీట్ పరీక్ష నిర్వహణకు ప్రతిష్ట బందోబస్తు



- **పరీక్ష కేంద్రాల వద్ద సెక్షన్ 144 అమలు**
- **జిల్లా ఎస్పీ కే నరసింహ**

సూర్యాపేట, జూన్ 20 (మనం ప్రతినిధి): జూన్ 21వ తేది ఆదివారం సూర్యాపేట జిల్లా పరిధిలో నిర్వహించే రీ-నీట్ పరీక్షల సందర్భంగా సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రాన్ని శనివారం జిల్లా ఎస్పీ నర్సింహా సంబంధిత అధికారులతో కలిసి భద్రతా చర్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...పరీక్షా కేంద్రాల వద్ద నిషేధ ఆజ్ఞలు సెక్షన్ 144 (163 పి ఎన్ ఎస్ ఎస్. యాక్ట్ -2023 (భారతీయ నాగరిక్ సుర్క్షా సంహిత) అమలులో వుంటుందని తెలిపారు. ఈ నేపథ్యంలో పరీక్ష కేంద్రాలకు 200 మీటర్ల దూరం వరకు ఐదుగురికి మించి గుంపులుగా వుండరాదని సూచించారు. అదేవిధంగా ఏలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలకు, మైకులు, డిజేలతో ఊరేగింపులు, దర్నాలు, ప్రచారాలు నిర్వహించరాదని పెర్కొన్నారు. పరీక్ష సమయంలో పరిసరాలలోని ఇంటర్నెట్ సెంటర్స్, జిరాక్స్ షాపులు, స్టేషనరీ దుకాణాలు మూసివేయాలని సూచించారు. అదేవిధంగా పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు తో పాటు ట్రాఫిక్ అంతరాయం కలగకుండా ట్రాఫిక్ పోలీసులు పకడ్బంది చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాలలో పోలీస్ పెట్రోలింగ్ పార్టీలను నియమించినట్లు తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసేందుకు నిఘాను నియమించి సమాచారం సేకరించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. మాల్ ప్రాక్టీస్ కు పాల్పడిన, నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలున తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు.పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఎన్ టి ఏ చూపిన నిబంధనల ప్రకారం హాజరు కావాలని సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని అన్నారు, ఎలాంటి ఎల్క్ట్రానిక్ పరికరాలు, ఫైర్ సంబంధ వస్తువులు, సెల్ ఫోన్స్ అనుమతి లేదు అని అన్నారు. ఎస్పీ వెంట అదనపు ఎస్పి రవీందర్ రెడ్డి, డి.ఎస్.పి ప్రసన్నకుమార్, సిఐ వెంకటయ్య, ప్రభుత్వ కళాశాల ఉపాధ్యాయులు, నీట్ పరీక్ష నిర్వహణ సిబ్బంది ఉన్నారు.

# డిజిటల్ లిటరసీ ఏఐ నైపుణ్యం ఉజ్వల భవిష్యత్తు

- **జిల్లా కలెక్టర్ తేజస్వందులాల్ పవర్**

కోదాడ, జూన్ 20 (మనం న్యూస్): డిజిటల్ లిటరసీ, ఏఐ కోర్సు శిక్షణ నైపుణ్యంతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. శనివారం కోదాడ పట్టణంలో ఈఎంసీ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల నందు 9,10 వ తరగతి తరగతి విద్యార్థుల కోసం ఈనెల 15 నుండి 20వ తేదీ వరకు ఏర్పాటు చేసిన ప్రత్యేక డిజిటల్ లిటరసీ, ఏఐ కోర్సు శిక్షణ ముగింపు కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏఐ కోర్సు సిలబస్ పుస్తకాలతో కంప్యూటర్ ఆపరేటింగ్, చాట్ జిపిటి, ఏఐ స్కిల్స్ అప్లికేషన్, డిజైన్ థింకింగ్, మేకింగ్ ఆఫ్ కోడింగ్, పెయింటింగ్, విషయాలను విద్యార్థులు నేర్చుకోవడం వలన సబ్జెక్టు విషయాలకు అన్వయించుకుని, సాఫ్ట్వేర్ రంగంలో ఉజ్వల భవిష్యత్తును సాధించవచ్చునని పేర్కొన్నారు. శిక్షణ



పొందుతున్న విద్యార్థులను ప్రత్యేకంగా కంప్యూటర్ విభాగంనకు సంబంధించిన విషయ పరిజ్ఞానాన్ని విద్యార్థులతో పరిశీలించి, ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టినారు. శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసినారు. పాఠశాలలో జరుగుతున్న నూతన అడ్మిషన్ల డెస్క్ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు అడ్మిషన్లు ఇచ్చినారు. ఈ కార్యక్రమంలో కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ, తాసిల్దార్ సంతోష్ కిరణ్ , ఎం ఈ ఓ సలీం షరీఫ్,పాఠశాల ఇన్చార్జి ప్రధాన ఉపాధ్యాయులు డి. మార్కండేయ, డిజిటల్ లిటరసీ, ఏఐ శిక్షణ మాస్టర్స్ ధీరజ్, రవితేజ, నాని, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి

- **పాఠశాలలను తనిఖీ చేసిన అధికారులు**

ములుగు, జూన్ 20, మనం ప్రతినిధి: విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని అధికారులు సూచించారు. ఈ మేరకు శనివారం ములుగు జిల్లా కేంద్రంలోని పాఠశాలలతో పాటు వసతి గృహాలను ఎ.ఎం. టెక్నికల్ సివిల్ సప్లైస్ షేక్ ఇర్ఫాన్, ఎస్ఐ (రిటైర్డ్) పి. జంగయ్యలతో పాటు టెక్నికల్ అసిస్టెంట్ ఎ. రాహుల్లు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు బండారుపల్లి గ్రామంలోని టీజీఎంఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు దేవకి, టీజీఆర్ఎస్ బాలుర



పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి. విజయేందర్ సమక్షంలో పాఠశాలలను సందర్శించిన అధికారులు విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేయటం తోపాటు ఆహార నాణ్యత, రుచి, వంట విధానం తదితర అంశాలపై విద్యార్థులతో చర్చించి వివరాలు అడిగి తెలుసు కున్నారు. ఆనంతరం ఏర్పాటు చేసిన సమావేశం లో వారు మాట్లాడారు.తెలంగాణ సివిల్ సప్లైస్ కార్పొరేషన్ ఎల్లప్పుడూ నాణ్యమైన బియ్యాన్ని ప్రజలకు, విద్యార్థులకు అందించడంలో ముందంజలో ఉంటుందని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇరు పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఎల్పీజీ వినియోగదారులు జూన్ 30 లోగా తప్పనిసరిగా ఇ-కేవైసీ పూర్తి చేయాలి

ములుగు, జూన్ ,20 మనం ప్రతినిధి: ములుగు జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ఎల్పీజీ వినియోగదారులందరూ తమకు సంబంధించిన ఇ-కేవైసీ ప్రక్రియను ఈ నెల జూన్ 30, 2026 లోగా వంద శాతం పూర్తి చేయాలని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి సయ్యద్ షా ఫైసల్ హుస్సేన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్పీజీ వినియోగదారులు ఎవరైతే ఇప్పటివరకు తమఇ-కేవైసీ పూర్తి చేయలేదో, వారు నేరుగా సంబంధిత గ్యాస్ ఏజెన్సీని సంప్రదించి వెంటనే ఇ-కేవైసీ అప్డేట్ చేసుకోవాలని



సూచించారు. అలాగే జిల్లా వ్యాప్తంగా ఉన్న గ్యాస్ ఏజెన్సీలు, రేషన్ షాప్ డీలర్లు వినియోగదారులకు పూర్తి సహకారం అందించి ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. నిర్దేశిత గడువులోగా ఇ-కేవైసీ పూర్తి చేయని వినియోగదారులు ఎల్పీజీ సబ్సిడీకి సంబంధించిన బకాయిలు, ఇతర ప్రయోజనాలు కోల్పోయే అవకాశం ఉందని, అందువల్ల ప్రతి వినియోగదారుడు ఈ విషయాన్ని అత్యంత ప్రాధాన్యతతో తీసుకుని వెంటనే ప్రక్రియ పూర్తి చేసుకోవాలని ఆయన కోరారు.

# మీసేవ డిజిటల్ రసీదుల విధానం అమలు

- **కాగితపు రసీదులకు ఇక చెల్లు**
- **దరఖాస్తుదారుడి మొబైల్కే అక్నౌలెడ్జిమెంట్ హైపర్ లింక్**
- **పొరపాటున డిలిట్ అయితే తిరిగి పంపించే వెసులుబాటు**

సూర్యాపేట, జూన్ 20 (మనం ప్రతినిధి): మీసేవ కేంద్రాల్లో సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకున్న తర్వాత ఇచ్చే కాగితపు రసీదులకు కాలం చెల్లింది అని మీసేవ ఈ జిల్లా మేనేజర్ గఫార్ అహ్మద్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా పేపర్ లెస్ పాలనలో భాగంగా జిల్లాలోని 90 మీ సేవ కేంద్రాల్లో శుక్రవారం నుంచి డిజిటల్ రసీదుల విధానం అమల్లోకి రానుంది. ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ (మీసేవ) కమిషనర్ ఆదేశాల మేరకు.. ఇకపై కాగితపు ప్రింట్లకు బదులుగా దరఖాస్తుదారుడి రిజిస్టర్డ్ మొబైల్ నంబరు ఎస్ఎంఎస్ ద్వారా అక్నాలెడ్జ్మెంట్ హైపర్ లింక్ పంపనున్నారు. పాత పద్ధతిలో ప్రింట్ ఇస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరిస్తున్నారు.

### మొబైల్ కే రశీదు లింక్

కొత్త విధానం ప్రకారం మీసేవ కేంద్రంలో దర



ఖాస్తు చేసుకున్న వెంటనే, దరఖాస్తుదారుడి రిజిస్టర్డ్ మొబైల్ నంబర్ కు ఒక ఎస్ఎంఎస్ వస్తుంది. అందులో అప్లికేషన్ నంబర్, సేవ పేరు, చెల్లించిన ఫీజు వివరాలతో పాటు ఒక హైపర్ లింక్ ఉంటుంది. పౌరులు ఆ లింక్ పై క్లిక్ చేసి తమ అక్నాలెడ్మెంట్ రశీదును ఎప్పుడైనా వీక్షించవచ్చు. డౌన్లోడ్ చేసుకోవచ్చు లేదా ప్రింట్ తీసుకోవచ్చు. సర్టిఫికెట్ చేతికి వచ్చే వరకు ఈ ఎస్ఎంఎస్ సురక్షితంగా ఉంచుకోవాలని అధికారులు సూచించారు. దీనివల్ల కాగితాలు పోగొట్టుకునే భయం ఉండదు. అదేవిధంగా అందుబాటులో రీ సెండ్ ఆప్షన్ మొబైల్కు వచ్చిన ఎస్ఎంఎస్ పొరపాటున డిలిట్ అయినా లేదా పోయినా ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. మీసేవ అప్లికేషన్ లో సదరు ఎస్ ఎం ఎస్ తిరిగి పంపించే సౌకర్యాన్ని కల్పించారు. దరఖాస్తుదారులు కోరితే ఆపరేటర్లు మళ్లీ మెసేజ్ పంపేలా సహాయం అందిస్తారు.

### నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

నూతన నిబంధనల ప్రకారం.. జిల్లాలోని మీసేవ నిర్వాహకులు, ఆపరేటర్లు దరఖాస్తు దారుల నుంచి కచ్చితమైన, యాక్టివ్ ఉన్న మొబైల్ నంబర్లను మాత్రమే సేకరించాల్సి ఉంటుంది. జూన్ 19 నుంచి ఎలాంటి ఫిజికల్ (కాగితపు) రసీదులను ప్రింట్ తీసి ఇవ్వకూడ దని స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి. ఒకవేళ ఈ నిబంధనలు ఉల్లంఘించి పాత పద్ద తిలోనే కాగితపు రశీదులు జారీ చేస్తే జిల్లా లోని సదరు కేంద్రాలపై కఠిన చర్యలు ఉం టాయని ఐటీ, ఈఎస్ఇ కమిషనర్ ఉత్తర్వు లుల్లో హెచ్చరించారు. అప్లికేషన్ ఇచ్చే టప్పుడు ప్రస్తుతం వాడుకలో ఉన్న కరెక్ట్ మొబైల్ నంబర్ను మాత్రమే ఇవ్వాలని, లేదంటే భవిష్యత్తులో అప్లికేషన్ స్టేటస్ తెలుసుకోవడం కష్టమవుతుందని అధికారు లు స్పష్టం చేశారు.

### కాగిత రహిత పాలనే ధ్యేయం

కాగిత రహిత పాలనే ధ్యేయంగా నూతన విధానం అమలు చేస్తున్నాం. దీనికి సంబంధించిన ఉత్తర్వు లను ఇప్పటికే మీ సేవ కేంద్రాల నిర్వాహకులకు అందజేశాం. మీ సేవ కేంద్రాల్లో పేపర్ రసీదు ఇచ్చే పద్ధతికి స్వస్తి పలుకుతున్నాం.

# బాయిల్డ్ రైస్ మిల్లింగ్ ప్రక్రియ సమన్వయంతో పూర్తి చేయాలి

- **ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా రైస్ మిల్లర్లు సహకరించాలి**
- **మిల్లింగ్ ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలి**
- **అదనపు కలెక్టర్ సి హెచ్ మహేందర్ జి**



ములుగు,, జూన్ 20, మనం ప్రతినిధి: బాయిల్డ్ రైస్ మిల్లింగ్ ప్రక్రియను సమన్వయంతో వేగవంతంగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి సంబంధిత అధికారులను, రైస్ మిల్లర్లను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టరేట్లోని అదనపు కలెక్టర్ రెవెన్యూ సి హెచ్ మహేందర్ జి తన ఛాంబర్లో బాయిల్ రైస్ మిల్లర్లతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా ధాన్యం సేకరణ, మిల్లింగ్ ప్రక్రియను ఎలాంటి ఆటంకాలు లేకుండా పూర్తి చేయాలని సూచించారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని మిల్లర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. మిల్లింగ్ ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలను సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వం, మిల్లర్లు, సంబంధిత శాఖల మధ్య సమన్వయం మెరుగ్గా ఉంటే ప్రక్రియ మరింత వేగవంతంగా పూర్తవుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి ఫైజల్ హుస్సేన్, డి యం కృష్ణ వేణి, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బాదం ప్రవీణ్,రైస్ మిల్లర్లు పాల్గొన్నారు. సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బదిలీ సందర్భంగా అధికారికి వీడ్కోలు



మహాదేవపూర్ జూన్ 20మనం న్యూస్ : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల పరిషత్ కార్యాలయంలోపర్యవేక్షణకుడిగా నిర్వహిస్తున్న ఎం,శ్రీధర్ బాబు బదిలీపై కాటారం మండలానికి వెళ్లనున్న సందర్భంగా మహాదేవపూర్ మండల పరిషత్ కార్యాలయంలో ఘన వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి ఎంపీడీవో రవీంద్రనాథ్ డిఎల్పి ఓమల్లికార్జున గ్రామపంచాయతీ కార్యదర్శులు కార్యాలయ సిబ్బందిపాల్గొన్నారు, శ్రీధర్ బాబు విధి నిర్వహణలో చూపిన నిబద్ధత క్రమశిక్షణ సేవాభావాన్ని పలువురు ప్రశంసించారు అనంత రంపంచాయి తీ కార్యదర్శులుశాలువాతోసత్కరించి జ్ఞాపకాను అందజేశారు ఈ సందర్భంగా అధికారులు సిబ్బంది మాట్లాడుతూ శ్రీధర్ బాబు కొత్త బాధ్యతలో మరింత విజయంవంతంగా రాణించాలనిఆకాంక్షిస్తూశుభాకాంక్షలుతెలిపారు

## పరీక్ష నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం వహించద్దు

- అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలి
- పరీక్ష సజావుగా నిర్వహించాలి
- జిల్లా కలెక్టర్ డా. సత్య శారద

వరంగల్, జూన్ 20(మనంన్యూస్)ః జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష నిర్వహణ సందర్భంగా వరంగల్లోని సీకేఎం డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ డా. సత్య శారద శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వారి వెంట అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వైవి గణేష్, వరంగల్ ఆర్డీవో సుమ,తహసిల్దార్ శ్రీకాంత్,డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ ధర్మ రెడ్డి లు ఉన్నారు. పరీక్షా కేంద్రంలో అభ్యర్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లు, పరీక్ష నిర్వహణ విధానాన్ని పరిశీలించారు. పరీక్షా కేంద్రంలో నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలని, అభ్యర్థులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. పరీక్షకు




హాజరైన విద్యార్థులకు అవసరమైన తాగునీరు, వైద్య సదుపాయాలు, విద్యుత్ సరఫరా వంటి ఏర్పాట్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పరీక్ష పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. పరీక్షా కేంద్రంలో మొత్తం 480 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా, వారి కోసం 20 పరీక్షా గదులను ఏర్పాటు చేశారు. పరీక్ష నిర్వహణకు 40 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. ఎలాంటి అవకతవకలకు తావులేకుండా అన్ని గదుల్లో జామర్లు ఏర్పాటు చేయడంతో పాటు, 35 సీసీ కెమెరాల ద్వారా నిరంతర పర్యవేక్షణ చేపట్టారు. అభ్యర్థులకు ఉదయం 11:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు మాత్రమే పరీక్షా కేంద్రంలోకి ప్రవేశానికి అనుమతి కలదని, మధ్యాహ్నం 2:00 గంటల నుంచి సాయంత్రం 5:15 గంటల వరకు పరీక్షా నిర్వహించడం జరుగుతుందని, దివ్యాంగులకు 6.16 వరకు పరీక్షా నిర్వహించడం జరుగుతోందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బందితో మాట్లాడిన కలెక్టర్, పరీక్ష నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. పరీక్ష సజావుగా నిర్వహించబడేందుకు తీసుకున్న ఏర్పాట్లపై ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు.

## ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక – 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలుపై సమీక్ష




వరంగల్, జూన్ 20(మనంన్యూస్)ః ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రూపొందించిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలు పురోగతి పై జిల్లా కలెక్టర్ డా. సత్య శారద సంబంధిత శాఖల అధికారులతో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖలకు నిర్దేశించిన లక్ష్యాలు, కార్యక్రమాల అమలు పురోగతిని కలెక్టర్ సమీక్షించారు. ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని, శాఖల మధ్య సమన్వయంతో పనిచేసి కార్యాచరణ ప్రణాళికను సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. ప్రజలకు నేరుగా ప్రయోజనం చేకూరే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని, పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షణ తప్పని సరి అని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డీసీపీ అంకిత్ కుమార్,అదనపు కలెక్టర్ రెవెన్యూ జి సంధ్యారాణి, అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వైవి గణేష్,జడ్పి సీఈఓ రాంరెడ్డి,డి ఆర్వో విజయ లక్ష్మి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొని తమ శాఖల పరిధిలో చేపడుతున్న కార్యక్రమాల పురోగతిని కలెక్టర్కు వివరించారు.

## జిల్లా కన్వీనర్గా నియామక పత్రం అందుకున్న వినోద



వరంగల్, జూన్ 20(మనం న్యూస్ )ః వరంగల్ జిల్లా తెలంగాణ పంచాయతీ సర్పంచ్ ల సంఘము ఆధ్వర్యంలో కార్యవర్గ ఎన్నికలల సంగెం మండలం పెద్ద తండా సర్పంచ్ గుగులోత్ వినోద రవీందర్ నాయక్ ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా జిల్లా సర్పంచ్ ల సంఘము కన్వీనర్ గా నియమక పత్రాన్ని అందుకుంటున్న వినోద రవీందర్ నాయక్ సహకరించిన ఎనిమిది వందల నలభై ఏడు గ్రామాల సర్పంచ్ లందరికీ ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు జిల్లాలో ఎలాంటి సమస్యలు ఉన్న ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నా వంతు సహకారం అందిస్తానని తెలిపారు నాపై నమ్మకంతో నాకు ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు గ్రామ సర్పంచ్ లకు ముఖ్య నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు గ్రామంలో నీటి కొరత విధిలైట్ల సమస్యలు రోడ్లు డ్రైనేజీలు సమస్యలు గ్రామంలో ఇలాంటి ప్రాబ్లం ఉన్న ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని వినోద రవీందర్ నాయక్ తెలిపారు.

## మహాదేవపూర్లో 108 అంబులెన్సుల ఆకస్మిక తనిఖీ



మహాదేవపూర్ జూన్ 20మనం న్యూస్ : మహాదేవపూర్ మండలంలోని 108 అంబులెన్స్ సేవలను జిల్లా మేనేజర్ రాజునాయక్శని వారం ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా అంబులెన్స్ వాహనాలఫిట్నెస్, నిర్వహణ పరిస్థితులు, అవసరమైనరికార్డులు,అత్యవసర మెడికల్బాక్సు క్షుణ్ణంగా పరిశీలించారు. సేవల నాణ్యతను మెరుగుపరచడం, అత్యవసర సమయాలో ప్రజలకువేగవంతమైన వైద్య సహాయం అందించడం లక్ష్యంగా ఈ తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో సీజనల్వ్యాధులు పెరిగేఅవకాశం ఉన్నందున, అవసరమైనమందులు, వైద్య పరికరాలు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంచుకోవాలని రాజునాయక్సూచించారు. ముఖ్యంగా జ్వరాలు, వైరల్ఇన్ఫెక్షన్లుడెంగీ, మలేరియా వంటి వ్యాధుల కేసులు పెరిగే అవకాశ ముండటంతో, అంబులెన్సులో తగిన స్టాక్ అందుబాటులో ఉండేలాచూసుకోవాలని సిబ్బందికి ఆదేశించారు .అదేవిధంగా రోడు ప్రమాదాలు లేదాఇతర అత్యవసర పరిస్థితుల్లోవచ్చేకాల్సు్క వెంటనే స్పందించి, రోగులను సురక్షితంగా సమీప ఆసుపత్రులకు తరలించడంఅత్యంతప్రాధాన్యంగా తీసుకోవాలని సూచించారు. స్పందన సమయం తగ్గించడం ద్వారా ప్రాణాలను కాపాడే అవకాశాలు పెరుగుతాయని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా అంబులెన్స్ సిబ్బందితో మాట్లాడిన జిల్లా మేనేజర్, సేవల పట్ల మరింత బాధ్యతగా వ్యవహరించాలని, ప్రజల ప్రాణాలకు సంబంధించిన సేవగా 108వ్యవస్థపై ఉన్న నమ్మకాన్నినిలబెట్టాలని తెలిపారు. సేవలలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని హెచ్చరించారు.ఈ తనిఖీ కార్యక్రమంలో అంబులెన్స్ సిబ్బంది ఈఎంటిలక్ష్మి, పైలట్ చంద్రయ్యపాల్గొన్నారు.

## కాళేశ్వరం అభివృద్ధి ఓర్వలేక విమర్శలు



మహాదేవపూర్ జూన్ 20మనం న్యూస్: దేవస్థానం టెండర్ల చేపట్టక ముందే మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ 100 కోట్ల అవినీతి ఆరోపణలు చేయడం తగ్గదని ట్రేడ్ కమిషన్ కోఆపరేషన్ చైర్మన్ ఐత ప్రకాశ్ రెడ్డి జిల్లా గ్రంథాలయ చైర్మన్ కోట రాజబాబు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అక్బర్ ఖాన్ అన్నారు ప్రెస్ క్లబ్ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ లక్ష కోట్ల కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ సమయంలో ఎమ్మెల్యేగా ఉన్న పుట్ట మధు కాళేశ్వరం గా కుంగిపోయిన మేడిగడ్డ బ్యారేజ్ వల్ల తమకు ఎన్ని కోట్లువచ్చాయో చెప్పాలని డిమాండ్ చేశారు, ముక్తేశ్వర స్వామి వద్ద భక్తులు తన్మయం పొందే విధంగా అభివృద్ధికార్యక్రమాలుచేసిపుష్కర బ్రహ్మండా గానికి వహించిన వ్యక్తిగా శ్రీధర్ బాబు కొన్ని యాడ పడుతున్నారని పనులు కాకముందే 100 కోట్లు అవినీతి జరుగుతుందనిఅనడంపై తనకున్న జ్ఞానం ఏంటిదో ఈప్రాంత ప్రజలు అర్థంచేసుకుంటున్నారని అన్నారు మన్యాహితుడైన కాళేశ్వరం ముక్తేశ్వర స్వామి ఒకేపానపాఠంపై రెండులింగాలుఉన్నటువంటిదేవాలయంకాళేశ్వరం మాత్రమేనాని అన్నారు, దేవాలయ అభివృద్ధితో ఈ ప్రాంతం అనేక విధాలుగా అభివృద్ధి చెంది ప్రజల అభివృద్ధికి తోడ్పడుతుందని ఇప్పటికైనా సద్బుద్ధితో మాట్లాడాలని తప్పుడు ఆరోపణలు చేయడందే వునిశిక్షకు గురికావాల్సివస్తుందని అన్నారు, ఈ సమావేశంలో గ్రామ సర్పంచ్ సీనా భాను పిఎసిఎస్ చైర్మన్ చల్లా తిరుపతి రెడ్డి మాజీ ఎంపిటిసి సుధాకర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కటకం అశోక్, రామారావు నాయకులు వామన్ రావు తిరుపతిరెడ్డి శివరాజ్ సాంబయ్య డిసిసి ప్రధాన కార్యదర్శి కోట సమ్మయ్య తో పాటు నాయకులు తదితరులు పాల్గొన్నారు

## నేరాల నియంత్రణ, ప్రజా భద్రత, విజిబుల్ పోలీసింగ్పై ప్రత్యేక దృష్టి సారించాలి

- హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగం పటిష్టంగా అమలు చేయాలి
- మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల కలిగే ప్రమాదాలపై విస్తృత అవగాహన కల్పించాలి.
- జగిత్యాల టౌన్ , ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ అశోక్ కుమార్



జగిత్యాల, జూన్ 20(మనం న్యూస్)ః పోలీస్ శాఖలో సేవల నాణ్యతను మరింత మెరుగుపరచడం, ప్రజలకు వేగవంతమైన మరియు పారదర్శకమైన పోలీసింగ్ అందించడా , ట్రాఫిక్ నిర్వహణను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దడంతో పాటు రోడ్డు ప్రమాదాల నివారణకు చేపడుతున్న చర్యలను సమీక్షించేందు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ జగిత్యాల టౌన్ పోలీస్ స్టేషన్ మరియు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిధిలో నమోదవుతున్న కేసుల వివరాలు, పెండింగ్ కేసుల పురోగతి, విచారణ విధానం, నేరాల నియంత్రణ చర్యలు, స్టేషన్ నిర్వహణ, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను ఎస్పీ క్షుణ్ణంగా పరిశీలించారు. కేసుల దర్యాప్తులో నాణ్యతను పెంచాలని, ప్రతి కేసును శాస్త్రీయ ఆధారాలతో విచారించి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.అలాగే స్టేషన్లో నిర్వహిస్తున్న రిజిస్టర్లు, రికార్డులు, సిబ్బంది విధుల కేటాయింపు తదితర అంశాలను పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు. స్టేషన్కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, వారి సమస్యలను ఓపికగా విని చట్టపరంగా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అనతరం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లో నిర్వహిస్తున్న రికార్డులు, ట్రాఫిక్ చలానాలు, రోడ్డు భద్రతా కార్యక్రమాల అమలును పరిశీలించారు. స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, వాహనాల పార్కింగ్ విధానం, ట్రాఫిక్ నియంత్రణ కోసం వినియోగిస్తున్న పరికరాల సామగ్రి పనితీరును తనిఖీ చేశారు.జిల్లాలో పెరుగుతున్న వాహన రద్దీని దృష్టిలో ఉంచుకొని ట్రాఫిక్ నియంత్రణలో సాంకేతికత వినియోగాన్ని మరింత విస్తరించాలని సూచించారు. ప్రమాదాలకు గురయ్యే ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు.రోడ్డు ప్రమాదాల నివారణలో ట్రాఫిక్ పోలీసుల పాత్ర అత్యంత కీలకమని, ప్రజలకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించేందుకు కృషి చేయాలని సూచించారు. హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగం, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల కలిగే ప్రమాదాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలిపారు.అదేవిధంగా తెలంగాణ పోలీస్ శాఖ చేపడుతున్న అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లాలని, విద్యాసంస్థలు, వ్యాపార సంస్థలు, ప్రజా సంఘాల సహకారంతో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఎస్పీ వెంట డీఎస్పీ పురుషోత్తం రెడ్డి, టౌన్ ఇన్స్పెక్టర్ కరుణాకర్, ట్రాఫిక్ ఎస్.ఐ మల్లేష్, ఎస్.ఐ లు సదకర్, కుమారస్వామి మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## గాలి వాన బీభత్సానికి పులువురి ఇల్లు ధ్వంసం

### ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలి

### బిఆర్ఎస్ జిల్లా నాయకులు బాడిశ నాగ రమేష్



మంగపేట ,జూన్ 20, మనం ప్రతినిధిః మంగపేట మండలం లోని వాగొడ్డుగూడెం,కత్తిగూడెం గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం బీబత్సం గా వొచ్చిన గాలి వాన వలన పలు కుటుంబాలు ఇళ్లు కోల్పోయి నిరాశ్రయులయ్యారు.వివరాల్లోకి వెళితే వాగొడ్డుగూడెం గ్రామం లో ఎస్కే షారుక్ రాత్రి వొచ్చిన గాలి వాన కు ఇల్లు పూర్తిగా కూలి పోవడంతో అందులో వున్న షారుక్ తండ్రి ముస్తఫా,భార్య ఆయేషా,తమ్ముడు ఫరూక్,మామ సయ్యద్ బడా లకు స్వల్ప గాయాలయ్యాయి .అంతేకాక ఇంట్లో వున్న సామగ్రి ధ్వసం అయ్యాయి.కూలి కి వెళితే కానీ పూట గడవని షారుక్ కుటుంబానికి ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు ఇచ్చి ఆదుకోవాలని బిఆర్ఎస్ జిల్లా నాయకులు బాడిశ నాగరమేష్ కోరారు.అదేవిధం గా కత్తిగూడెం గ్రామం లో కాయం జయసుధ ,పల్లిశెట్టి రాజేష్ ఇండ్లు గాలివాన బీభత్సానికి పూర్తిగా ధ్వసం కాగా,ఇదే గ్రామానికి చెందిన దాసరి సతీష్ పాక్షికం గా ధ్వసం అయింది వారి కుటుంబాలకు కూడా తగిన నష్ట పరిహారం అందజేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమం లో బిఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షులు రొడ్డ సుదర్శన్,కొమరం పుల్లారావు, పండా శ్రీను,సోయం సీతయ్య స్థానిక నాయకులు మండల సంతోష్,మునిగేల మహేష్,నిట్టా బన్ను,బాడిశ శ్రవణ్,కొమరం శివాజీ,పాగా కేశవరావు,సుధాకర్ సానాపురి శేఖర్,వరప్రసాద్, గ్రామస్థులు మండల పూర్ణ ,మెరుగుసీతారాములు,వే ల్పుల శశి మరియు సోషియల్ మీడియా వారియర్ మునిగేల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడి



- ఒకరిని బైండోవర్ చేసిన పోలీసులు
- 20 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నఎస్ఐ సాంబమూర్తి

మహాదేవపూర్, జూన్ 20మనం న్యూస్: మహాదేవపూర్ మండలం కుదురుపల్లి గ్రామంలో గుడుంబా స్థావరాలపై ఎస్సై సాంబమూర్తి ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు మండలంలోని కుదురుపల్లి గ్రామంలో గుడుంబా స్థావరాల నిర్వహిస్తున్నట్లు నమ్మదగిన సమాచారం ప్రకారం ఎస్సై సాంబమూర్తి పోలీసులతో కలిసి గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు ఈ దాడులలో భాగంగా 20 లీటర్ల గుడుంబాను స్వాధీనం పరుచుకొనిఒక వ్యక్తిని అదుపులోకి తీసుకొని బైండోవర్ చేయడం జరిగింది తదనంతరం ఎస్సైసాంబ మూర్తి మాట్లాడుతూ గుడుంబా వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహిస్తే చట్ట ప్రకారం ఆరు నెలల జైలు శిక్ష తోపాటు రెండు లక్షలు లేదా లక్ష రూపాయల జరిమానా పడే అవకాశాలు ఉన్నాయని తెలుపుతూ అవకాశాలు ఉన్నాయని తెలుపుతూ ఎవరైనా ఎలాంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహిస్తూ ఉన్నట్లు అయితేపోలీసులకు సమాచారం అందించాలని గ్రామస్తులు మరియు ప్రజలనుకోరారు ఈ కార్యక్రమంలో మహాదేవపూర్ ఎస్సై సాంబమూర్తి, సివిల్ మరియు సిఆర్పిఎఫ్ పోలీస్ సిబ్బంది తోపాటు గ్రామస్తులు పాల్గొన్నారు

## సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలి

### రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్క ృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు

### నాగర్కర్నూల్ కలెక్టరేట్లో ఉమ్మడి జిల్లా ప్రాజెక్టులపై ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం

### జోగులాంబ గద్వాల జిల్లా నుంచి పాల్గొన్న కలెక్టర్, గద్వాల ఎమ్మెల్యే , అధికారులు



ఉమ్మడి మహబూబ్ నగర్ జూన్ 20 (మనం బ్యూరో)ః రాష్ట్రంలో సాగునీటి రంగ అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, రైతులకు సాగునీరు అందించడమే లక్ష్యంగా చేపట్టిన ప్రతిష్ఠాత్మక సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో ఎలాంటి జాప్యం చోటుచేసుకోకుండా భూసేకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్క ృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. శనివారం నాగర్కర్నూల్ జిల్లా కలెక్టరేట్లోని ప్రధాన సమావేశ మందిరంలో పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం, డిండి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్తో పాటు నాగర్కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాల పరిధిలో కొనసాగుతున్న వివిధ సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ అంశాలపై నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల్ల చిన్నారెడ్డి, నాగర్కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ మల్లు రవి, ఎమ్మెల్యేలు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, కసిరెడ్డి నారాయణరెడ్డి, డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి , బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ, సర్వే, నీటిపారుదల శాఖల ఉన్నతాధికారులతో కలిసి మంత్రి సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రాజెక్టుల వారీగా, నియోజకవర్గాల వారీగా భూసేకరణ పురోగతిని మంత్రి క్షుణ్ణంగా సమీక్షించారు. ఇప్పటివరకు ఎంత భూమి సేకరించబడింది, ఎంత భూమి పీడీ (ప్రాథమిక నోటిఫికేషన్) దశలో ఉన్నది, ఎంత భూమి పీఎం స్థాయిలో ఉంది, ఇప్పటి వరకు ఎన్ని అవార్డులు ప్రకటించారు, ఎంత పరిహారం చెల్లించారు, ఇంకా ఎన్ని కేసులు పెండింగ్లో ఉన్నాయనే అంశాలపై అధికారులను ఒక్కొక్కరిగా ప్రశ్నించి మంత్రి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల జిల్లాలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ పనులను వేగవంతం చేయాలని ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారని గుర్తు చేశారు.

ఆ దిశగా అధికారులు మరింత బాధ్యతతో పనిచేసి పెండింగ్లో ఉన్న సమస్యలను సెప్టెంబర్ 15లోగా పూర్తిస్థాయిలో పరిష్కరించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి ఉందని, సాగునీటి వనరుల విస్తరణ ద్వారానే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని తెలిపారు. రైతుల అభ్యంతరాలు, భూవివాదాలు, పరిహారం చెల్లింపులకు సంబంధించిన అంశాలను ప్రత్యేకంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని ఈ సందర్భంగా మంత్రి అధికారులను ఆదేశించారు.

జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ.... నెట్టెంపాడు, గట్టు ఎత్తిపోతల పథకాలతో పాటు మల్లమ్మ కుంట రిజర్వాయర్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణకు రెవిన్యూ, ఇరిగేషన్, సర్వే అధికారులతో ప్రత్యేక టీములు ఏర్పాటు చేసి కృషి చేస్తున్నామన్నారు. ప్రతి శుక్రవారం భూసేకరణ విషయంపై సమీక్ష సమావేశాలు నిర్వహిస్తూ ముందుకెళ్తున్నామన్నారు.

ఆయా ప్రాజెక్టుల పనులు పూర్తయితే సాగునీటితోపాటు వ్యవసాయాధారిత పరిశ్రమలకు కూడా ప్రోత్సాహం లభించి గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిలో సాగునీటి ప్రాజెక్టుల పాత్ర అత్యంత కీలకమని వారు అభిప్రాయపడ్డారు. అనంతరం జిల్లా పరిధిలో కొనసాగుతున్న భూసేకరణ ప్రక్రియపై సమగ్ర నివేదికలను సమర్పించారు. ఇప్పటివరకు జరిగిన భూసేకరణ, పరిహారం చెల్లింపులు, పెండింగ్లో ఉన్న కేసులు, కోర్టు వివాదాలు, రైతుల అభ్యంతరాలు తదితర అంశాలపై వివరాలు వెల్లడించారు. భూసేకరణలో ఎదురవుతున్న సమస్యలను అధిగమించేందుకు తీసుకుంటున్న చర్యలను ఈ సమావేశంలో క్షుణ్ణంగా మంత్రికి వివరించారు. అనంతరం నీటిపారుదల, రెవెన్యూ శాఖల అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆయా ప్రాజెక్టుల పురోగతిని వివరించారు.

ఈ సమావేశంలో సాగు నీటి ప్రాజెక్టుల ఎస్సీలు, ఈఈలు, ఏఈలు, ఆర్డీవోలు, తహసిల్దార్లు, రెవెన్యూ అధికారులు సంబంధిత శాఖల ఉన్నతాధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు, ఇంజినీరింగ్ అధికారులు, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# వన్డే సిరీస్ భారత్ కైవసం





చెన్నై వేదికగా జరిగిన మూడో వన్డేలో భారత యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ అద్భుత శతకంతో చెలరేగాడు. కెప్టెన్ రోహిత్ శర్మతో కలిసి ప్రత్యర్థి బౌలర్లను ఊచకోత కోస్తూ భారత్కు 9 వికెట్ల తేడాతో భారీ విజయాన్ని అందించాడు. ఈ విజయంతో టీమిండియా సొంతగడ్డపై మరో చిరస్మరణీయమైన సిరీస్ విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది.

ఆఫ్ఘనిస్తాన్ నిర్దేశించిన లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన భారత జట్టుకు ఓపెనర్లు అదిరిపోయే ఆరంభాన్ని ఇచ్చారు. ముఖ్యంగా యువ సంచలనం యశస్వి జైస్వాల్ మైదానం నలుమూలలా బౌండరీల వర్షం కురిపించాడు. కేవలం 86 బంతులు ఎదుర్కొన్న జైస్వాల్ 14 ఫోర్లు, 3 భారీ సిక్సర్ల సాయంతో 110 పరుగులు చేసి నాటౌట్గా నిలిచాడు. వన్డే క్రికెట్లో తన మార్కు క్లాస్, మాస్ షాట్లతో ఆఫ్ఘన్ బౌలింగ్ విభాగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తూ అజేయ శతకంతో జట్టును విజయతీరాలకు చేర్చాడు.

**అండగా నిలిచిన కెప్టెన్ రోహిత్ శర్మ**

మరోవైపు కెప్టెన్ రోహిత్ శర్మ కూడా తనదైన శైలిలో విరుచుకుపడ్డాడు. జైస్వాల్కు అండగా నిలుస్తూనే స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. రోహిత్ శర్మ 69 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్సర్లతో 79 పరుగుల అద్భుత ఇన్నింగ్స్ ఆడాడు. వీరిద్దరి మధ్య నమోదైన భారీ భాగస్వామ్యంతో భారత్ విజయం ఎప్పుడో ఖాయమైపోయింది. అయితే సెంచరీ వైపు దూసుకెళ్తున్న రోహిత్.. మహమ్మద్ నబి బౌలింగ్లో ప్రత్యామ్నాయ ఫీల్డర్ సెదిఖుల్లా అటల్ చేతికి చిక్కి అవుటయ్యాడు. దాంతో భారత్ తొలి వికెట్ను కోల్పోయింది.

**కేవలం 28.4 ఓవర్లలోనే మ్యాచ్ ముగింపు**

రోహిత్ అవుటైన తర్వాత క్రీజులోకి వచ్చిన శ్రేయస్ అయ్యర్ ఏమాత్రం ఒత్తిడికి లోనవకుండా వేగంగా ఆడాడు. అయ్యర్ 19 బంతుల్లో 2 సిక్సర్ల సాయంతో 20 పరుగులు చేసి నాటౌట్గా నిలిచాడు. భారత్ కేవలం 28.4 ఓవర్లలోనే 1 వికెట్ నష్టానికి 224 పరుగులు చేసి ఘన విజయం సాధించింది. ఆఫ్ఘన్ బౌలర్లలో మహమ్మద్ నబికి మాత్రమే ఒక వికెట్ దక్కింది. మిగతా బౌలర్లు ఎవరూ కూడా భారత బ్యాటర్లను అడ్డుకోలేకపోయారు.



## అదిరిపోయేలా.. శ్రద్ధ నృత్య ప్రదర్శన

'స్త్రీ 2'తో రెండేళ్ల క్రితం బాక్సాఫీస్ వద్ద వసూళ్లతో మ్యాజిక్ చేసింది బాలీవుడ్ కథానాయిక శ్రద్ధా కపూర్. ఈ సినిమా విజయం తర్వాత ఇప్పటి వరకూ ఆమె ఏ ప్రాజెక్టును అధికారికంగా ప్రకటించకపోయినా.. లక్ష్మణ్ ఉటేకర్ తెరకెక్కిస్తున్న ఓ చిత్రంలో శ్రద్ధ నటిస్తున్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. దీనికి 'ఈథ' అనే పేరును ఖరారు చేసినట్లు తెలుస్తోంది. తాజాగా ఈ సినిమా టీజర్ను 'కాక్టెయిల్ 2' చిత్రం ప్రదర్శితమవుతోన్న థియేటర్లలో విడుదల చేసినట్లు సమాచారం. ప్రస్తుతం ఈ టీజర్కు సంబంధించిన ఫొటోలు, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి. ఇందులో శ్రద్ధ.. అదిరిపోయేలా నృత్య ప్రదర్శన ఇస్తూనే.. మరోవైపు స్టేజ్పైనే ప్రసవ వేదన పడుతూ బిడ్డకు జన్మనివ్వడం లాంటి సన్నివేశాలతో ఆద్యంతం ఆసక్తికరంగా సాగుతోంది టీజర్. మహారాష్ట్రకు చెందిన జానపద నృత్య కళాకారిణి విఠాబాయి భావు మాంగ్ నారాయణ్గావ్కర్ జీవితం ఆధారంగా దీన్ని తీర్చిదిద్దుతున్నట్లు సమాచారం.



## లియోనెల్ మెస్సిపై చర్యలు తీసుకోవాలి
### అల్జీరియా ఫిర్యాదు

ఫిఫా ప్రపంచ కప్ 2026 తొలి మ్యాచ్లోనే అర్జెంటీనా స్టార్ లియోనెల్ మెస్సి హ్యాట్రిక్ కొట్టాడు. దీంతో అర్జెంటీనా 3-0 తేడాతో అల్జీరియాను చిత్తు చేసింది. అయితే, మెస్సిపై అల్జీరియా వరల్ కప్ నిర్వాహకులకు ఫిర్యాదు చేసినట్లు వార్తలు వస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా మెస్సి వ్యవహరించినా.. రెడ్ కార్డు ఇవ్వలేదని అల్జీరియా ఆరోపించింది. తాజాగా ఫిఫా వద్ద అధికారికంగా ఫిర్యాదు చేయడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

మెస్సి కాలు అల్జీరియా కెప్టెన్ మాండీ పిక్కను తాకినట్లు వీడియోల్లో కనిపించిందని.. అయినా సరే రిఫరీ చర్యలు తీసుకోలేదని ఫిర్యాదు లేఖలో అల్జీరియా పేర్కొంది. ఇక అర్జెంటీనా మిడ్ఫీల్డర్ అలెక్సిస్ అలిస్టర్ కూడా తమ ఆటగాడు ఇబ్రహీం మజా మోచేతిని తాకినట్లు అల్జీరియా ఆరోపణలు చేసింది. ఈ మ్యాచ్కు పోలాండ్కు చెందిన షిమోన్ మార్సినియక్ రిఫరీగా వ్యవహరించాడు.

అర్జెంటీనా-ఫ్రాన్స్ మధ్య జరిగిన 2022 ప్రపంచ కప్ ఫైనల్కూ అతడే రిఫరీ కావడం గమనార్హం.



## ఇంగ్లాండ్తో వన్డే సిరీస్కు హార్దిక్ దూరం!

ఇప్పటికే అఫ్గానిస్థాన్తో వన్డే సిరీస్కు దూరమైన భారత ఆల్రౌండర్ హార్దిక్ పాండ్య ఇంగ్లాండ్తో సిరీస్కూ దూరం కానున్నట్లు తెలుస్తోంది. ఐపీఎల్ సమయంలో తగిలిన గాయం నుంచి అతడు పూర్తిగా కోలుకోలేదని వార్తలు వస్తున్నాయి. అందుకు ఇంకా సమయం కావాలని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ అభిప్రాయపడుతున్నట్లు సమాచారం. ఐదు టీ20లు, మూడు వన్డేలు ఆడేందుకు భారత్ జట్టు ఇంగ్లాండ్ వెళ్లనుంది. జులై 1 నుంచి మ్యాచ్లు ప్రారంభం కానున్నాయి. సుదీర్ఘ విరామం తర్వాత ఈ ఫార్మాట్లోకి పునరాగమనం చేయడానికి పాండ్య ఎదురు చూస్తున్నాడు.

దీంతో సెలెక్టర్లు ఈ సిరీస్కు పాండ్యకు బదులుగా మరో ఆటగాడిని ఎంపిక చేయాల్సిన పరిస్థితి నెలకొంది. పేస్ బౌలింగ్ ఆల్రౌండర్గా హార్దిక్ పాండ్య పరిమిత ఓవర్ల క్రికెట్లో కీలక ఆటగాడిగా కొనసాగుతున్నాడు. అయితే, గాయం కారణంగా వన్డే సిరీస్లకు అందుబాటులో లేకపోవడం అతడి అవకాశాలకు దెబ్బతీయనుంది.

వచ్చే ఏడాది దక్షిణాఫ్రికా వన్డే ప్రపంచ కప్ జరగనుంది. ఈ క్రమంలో పాండ్యను ఫిట్గా ఉంచాల్సిన అవసరం ఉందని సెలక్షన్ కమిటీ ఛైర్మన్ అజిత్ అగార్కర్ ఇటీవల పేర్కొన్నారు. అతడిని తాము ఎప్పుడైనా గ్రౌండ్లోకి తీసుకువచ్చే అవకాశం ఉందన్నారు.

## మెగా అభిమానులకు సర్ప్రైజ్.. ఇదిగో చిన్నారి క్లీంకార



మెగా అభిమానులకు ఊహించని సర్ప్రైజ్. రామ్చరణ్, ఉపాసనల ముద్దుల బిడ్డ క్లీంకారను ఎప్పుడెప్పుడు చూస్తామా? అని ఎదురు చూసిన వారి కల నెరవేరింది. మూడో పుట్టినరోజు సందర్భంగా క్లీంకారకు శుభాకాంక్షలు చెబుతూ చిన్నారి ఫొటోను ఉపాసన సోషల్మీడియా వేదికగా పంచుకున్నారు. అటు ఉపాసన, అటు రామ్చరణ్ క్లీంకారను ఇరు వైపులా ఎత్తుకుని నిలబడగా, చిరునవ్వులు చిందిస్తూ చిన్నారి కనిపించింది. ప్రస్తుతం ఈ ఫొటో సామాజిక మాధ్యమాల వేదికగా వైరల్ అవుతోంది. క్లీంకార 2023 జూన్ 20న జన్మించగా, ఈ ఏడాది ఫిబ్రవరిలో చరణ్, ఉపాసన దంపతులకు కవలలు జన్మించారు. అబ్బాయికి శివరామ్, అమ్మాయికి అన్వీరా దేవి అని పేరు పెట్టిన సంగతి తెలిసిందే.

## సోషల్ మీడియాకి బ్రేక్.. 'డ్రాగన్' బ్యూటీ సడెన్ నిర్ణయం!



తన కెరీర్ ఆరంభంలోనే మంచి గుర్తింపును అందుకున్న యంగ్ హీరోయిన్స్ లో కోలీవుడ్ డ్రాగన్ బ్యూటీ కయాదు లోహర్ కూడా ఒకామె. అయితే కయాదు ఇప్పుడు తమిళ్ సహా తెలుగు మలయాళ సినిమాల్లో కూడా బిజీగా వుంది. ఇటీవల 'పళ్ళి చట్టంబి'లో పలకరించిన బ్యూటీ సడెన్ గా ఓ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపింది. ఇక నుంచి కొన్నాళ్ళ పాటుగా తను సోషల్ మీడియా నుంచి బ్రేక్ తీసుకోవాలని డిసైడ్ అయినట్టు తెలిపింది.

సోషల్ మీడియా నుండి ఒక చిన్న అడుగు వెనక్కి వేస్తున్నాను. కొన్నిసార్లు, మన శరీరాలకు మనం ఇచ్చే విశ్రాంతి ఇచ్చేలానే మనస్సుకు కూడా విశ్రాంతి అవసరం. నేను వేగాన్ని తగ్గించుకోవాలని, కొంతకాలం డిస్ కనెక్ట్ అయ్యి స్క్రీన్ దాటి తనతో తను ఎక్కువ సమయం గడపాలని భావిస్తున్నాను. తనకు ఇప్పటివరకు సహకరించిన అందరికీధన్యవాదాలు తెలుపుతూ త్వరలో కలుద్దాం అని ముగించింది. సో కొన్నాళ్ళ పాటు ఈ యంగ్ బ్యూటీ సోషల్ మీడియాలో ఉండదని చెప్పాలి. ప్రస్తుతం అయితే తెలుగులో నాచురల్ స్టార్ నానితో ది ప్యారడైజ్ అనే భారీ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే.



## 'సింగ్ గీతం' కోసం కల్కి.. మాటతో పాట అంటున్న ప్రభాస్!



ఇటీవల మన తెలుగు సినిమా నుంచి వచ్చిన వినూత్న ప్రయత్న చిత్రమే సింగ్ గీతం. భారతీయ సినిమా దగ్గర ఎన్నో వండర్స్ తీసిన లెజెండరీ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు తెరకెక్కించిన ఈ ఇంట్రెస్టింగ్ ప్రాజెక్ట్ ఆడియెన్స్ నుంచి మంచి రెస్పాన్స్ అందుకుంది. అలా మాటతోనే పాటని సృష్టించి థియేటర్స్ లో అలరించిన టీం కోసం ఇప్పుడు కల్కి పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ కూడా భాగం అవ్వడం జరిగింది. 'నా వాయిస్లో ఏదైనా సమస్య ఉందా? నాకు పాటలు పాడటం రాదనుకున్నారా? నేను ప్రయోగాలు చేయలేదా? నన్ను ఎందుకు 'సింగ్ గీతం'లో పెట్టుకోలేదు?'' అని నాగ్అశ్విన్ను ప్రభాస్ సరదాగా ప్రశ్నించారు. ఈ సినిమా నిర్మాత అలాగే కల్కి దర్శకుడు నాగ్ అశ్విన్ ప్రభాస్ తో కలిసి చేసిన చిట్ చాట్ ఇప్పుడు వైరల్ గా మారింది. మాటతో పాట అంటూ నాగ్ అశ్విన్ తో ప్రభాస్ అరిపించడం ఫ్యాన్స్ లో మంచి క్రేజీగా మారింది. ఇక ఇందులో ప్రభాస్ లుక్స్ కూడా మంచి స్టైలిష్ గా కనిపించడంతో ఈ ప్రోమో మరింత వైరల్ అయ్యింది. ఇక ఈ ఫుల్ ఇంటర్వ్యూ త్వరలోనే రానుంది అని వైజయంతి మూవీస్ వారు కన్ఫర్మ్ చేశారు. ఇక దేవిశ్రీప్రసాద్ ఈ ప్రాజెక్ట్కి సంగీతం అందించిన సంగతి తెలిసిందే.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No:19, IDA Balanagar, Medchal-Malkajgiri Dist, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.